4TH ANNIVERSARY

మన తెలంగాణ

www.manatelangana.news | హైదరాబాద్ | సంపుటి 7 | సంచిక: 215 | శుక్రవారం | 25 జనవరి, 2019

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad | పేజీలు: 12 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00



రాజశ్యామలా దేవికి సువర్ణ మంత్ర పుష్పాంజలి 3

మళ్లీ బ్యాలట్ ప్రసక్తి లేదు

ఇసి స్పష్టీకరణ



న్యూఢిల్లీ: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో బ్యాలట్ పత్రాలను ఉపయోగించే ప్రసక్తేలేదని ఎన్నికలసంఘం (ఇసి)స్పష్టం చేసింది. రాజకీయ పార్టీలు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల(ఇవిఎం) పనితీరుపై వ్యక్తం చేస్తున్న అనుమానాలను తోసిపుచ్చింది. గురువారం ఏర్పాటు చేసిన మీడియా స మావేశంలో ఎన్నికల ప్రధానాధికారి సునీల్ అరోరా మాట్లాడుతూ మన దేశంలో తరువాయి 6లో

చందాకొచ్చర్‌పై సిబిఐ కేసు



న్యూఢిల్లీ: ఐసిఐసిఐ బ్యాంక్ మాజీ సిఇఓ చందా కొచ్చర్,ఆమె భర్త దీపక్ కొచ్చర్‌లపై సిబిఐ గురువారం కేసు నమోదు చేసింది, వీడియోకాన్ గ్రూపు ఎండి వేణుగోపాల్ ధూత్‌పై కూడా సిబిఐ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. 2012లో వీడియోకాన్ గ్రూపునకు ఐసిఐసిఐ బ్యాంక్ రుణాల మంజూరుకు సంబంధించి అవకతవకల కేసులో నిందితులుగా పేర్కొంటూ సిబిఐ వీరిపై కేసు నమోదు చేసింది. కాగా గురువారం ఉదయం తరువాయి 6లో

కారుకే పదహారు

కాంగ్రెస్‌కు సున్నా

రిపబ్లిక్ టీవీ, సీ ఓటర్ సర్వేలో వెల్లడి

మన తెలంగాణ /హైదరాబాద్

రానున్న పార్లమెంటు ఎన్నికల్లో తెలంగాణలోని మొత్తం 17 స్థానాల్లో ఒక్కటి ఎంఐఎంకు పోగా మిగిలిన పదహారు స్థానాల్లోనూ టిఆర్‌ఎస్ గెలుస్తుందని రిపబ్లిక్ టివి, సీ ఓటర్ సర్వే అంచనా వేసింది. కాంగ్రెస్, బిజెపి, తెలుగుదేశం తదితర పార్టీలకు ఒక్క సీటు కూడా గెల్చుకునే అవకాశం లేదని స్పష్టం చేసింది. దేశం మొత్తం మీద తాజా రాజకీయ పరిస్థితులను అంచనా వేసిన ఈ రెండు సంస్థలు వివిధ రాష్ట్రాల్లో సర్వే నిర్వహించి ప్రజల నాడిని తరువాయి 6లో

పిఎస్‌ఎల్‌వి–సి44 ప్రయోగం సక్సెస్ 10

నిర్ణీత కక్ష్యలోకి కలాంశాట్, మైక్రోశాట్

కమలానికి కష్టమే

ఇప్పటికిప్పుడు లోక్‌సభ ఎన్నికలు జరిగితే భారీగా నష్టపోనున్న ఎన్‌డిఎ

యుపిలో బిజెపి సీట్లలో భారీ కోత పుంజుకోనున్న యుపిఎ

కాంగ్రెస్ కలిస్తే ఉత్తరప్రదేశ్‌లో కూటమికి 75, కేంద్రంలో కీలకం కానున్న కెసిఆర్, జగన్, నవీన్, పళనిస్వామి





న్యూఢిల్లీ: దేశంలో ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వం వస్తుందని ఓ సర్వేలో వెల్లడైంది. బిజెపి నాయకత్వంలోని ఎన్‌డిఎ కూటమికి మెజారిటీ తగ్గుతుందని 'ఇండియా టుడే–కార్వీ ఇన్‌సైట్స్' నిర్వహించిన 'మూడ్ ఆఫ్ ది నేషన్ పోల్'లో తేలింది. 19రాష్ట్రాలు.. 97 పార్లమెంటరీ నియోజకవర్గాల్లో 13,179మంది అభిప్రాయాలను ఈ సర్వే కోసం తీసుకున్నారు. ఈ రోజే లోక్‌సభ ఎన్నికలు జరిగితే ఎలాంటి ఫలితాలు వస్తాయనే దానిపై దేశవ్యాప్తంగా ఈ సర్వే నిర్వహించారు. 2014 ఎన్నికలతో పోలిస్తే ఎన్‌డిఎ(336సీట్లు)కు 99 సీట్లు తగ్గే అవకాశముందని సర్వే అంచనా వేసింది. అంటే ఆ ఎన్‌డిఎ 237 సీట్లు మాత్రమే గెలిచే అవకాశముందని తెలిపింది. గత ఎన్నికలతో పోలిస్తే యుపిఎ కూటమి భారీగా పుంజుకోనుంది. ఆ కూటమి 166 సీట్లు దక్కించుకునే అవకాశముంది. 2014తో పోలిస్తే యుపిఎకు అదనంగా 106 సీట్లు పెరగనున్నాయి. ఎన్‌డిఎ, యుపిఎలో భాగస్వాములు కాని పార్టీలు 140 స్థానాల్లో విజయం సాధిస్తాయని సర్వే తేల్చింది. మొత్తంగా చూస్తే ఎన్‌డిఎకు 35 శాతం, యుపిఎకు 33 శాతం ఓట్లు పడతాయని అంచనా. అయితే ఎన్‌డిఎ, యుపిఎతో జట్టు కట్టే పార్టీల ఆధారంగా తరువాయి 6లో

మన తెలంగాణ మరో అడుగు

మన తెలంగాణ దినపత్రిక ఆవిర్భవించి నేటితో నాలుగేళ్లు పూర్తయ్యాయి. ఐదోయేట అడుగిడుతోంది. ఈ సందర్భంగా పాఠకులకు, ప్రకటన కర్తలకు, ఏజెంట్లకు, శ్రేయోభిలాషులకు శుభాకాంక్షలు

– ఎడిటర్

వచ్చే నెల నుంచే కోటా

అగ్రవర్ణ పేదల రిజర్వేషన్లపై కేంద్రం ఉత్తర్వు 10

రెండో విడత ఢీ

నేడే రాష్ట్రంలో మలిదశ పంచాయతీ ఎన్నికల పోలింగ్

3342 పంచాయతీలు, 26,191 వార్డులు

సర్పంచ్ పదవికి బరిలో 10,668 మంది

29,964 పోలింగ్ స్టేషన్‌లు.. 673 కేంద్రాలలో వెబ్‌క్యాస్టింగ్



మన తెలంగాణ/హైదరాబాద్

రెండో విడతలో భాగంగా శుక్రవారం పోలింగ్ జరగనున్న పంచాయతీ, వార్డు సభ్యుల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసింది. 3342 పంచాయతీలకు, 26,191 వార్డులకు ఉదయం తరువాయి 6లో

ఆదుకున్న కెటిఆర్

45రోజుల పాపకు వైద్య ఖర్చులకోసం సిఎంఆర్‌ఎఫ్

ట్విట్టర్ విజ్ఞప్తికి పెద్దమనసుతో స్పందన



మన తెలంగాణ/హైదరాబాద్

నగరంలోని పటేల్ నగర్‌కు చెందిన 45 రోజుల దేదీప్య అనే చిన్నారి హైపోగ్లాసీమియా వ్యాధితో ఆసుపత్రిలో చికిత్స పొందుతుండడంతో వైద్యఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి కెటిఆర్ తగిన ఆర్థిక సాయాన్ని అందజేసేలా సానుకూలంగా తరువాయి 6లో

విజయ భయోగ్నిస్టిక్స్

స్కానింగ్ కోసం వెళ్లిన యువతిపట్ల అసభ్య ప్రవర్తన

టెక్నీషియన్ వీరబాబుపై కేసు



10

మనతెలంగాణ/సిటీబ్యూరో

ఆరోగ్యం బాగాలేకపోవడంతో స్కానింగ్ తీయించుకునేందుకు వెళ్లిన ఓ యువతితో ల్యాబ్ టెక్నీషియన్ అసభ్యంగా ప్రవర్తించిన సంఘటన నగరంలోని హుమాయున్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం రాత్రి జరిగింది. హుమాయున్ నగర్ పోలీస్ తరువాయి 6లో

కుంచెపోటు



పార్లమెంటు ఎన్నికల పోస్టర్లలో మన నాయకుడి బదులు కోహ్లీ ఫోటో వేస్తే గెలుస్తామేమో!

పల్లీ టోపీరాయుడు పాత కేడియే



- గతంలో మహాలైఫ్ పేరిట భారీ మోసానికి పాల్పడిన శ్రీకాంత్
- గ్రీన్‌గోల్డ్ బయోటెక్ ఏజెంట్లు 200మంది పైన కేసులు
- బాధితుల్లో ఎక్కువగా కర్ణాటక వారే

మన తెలంగాణ/హైదరాబాద్

వేరుశనగ పేరిట వందలాది కోట్ల రూపాయలు శఠగోపం పెట్టిన గ్రీన్‌గోల్డ్ కేసు దర్యాప్తును పోలీసులు వేగవంతం చేశారు. గ్రీన్‌గోల్డ్ అధినేత జిన్నా శ్రీకాంత్‌ను అరెస్టు చేసిన పోలీసులు దర్యాప్తులో అనేక విషయాలను రాబట్టారు. గతంలో మహాలైఫ్ పేరిట కోట్లాది రూపాయలు కాజేసిన శ్రీకాంత్ కొత్తగా గ్రీన్‌గోల్డ్ పేరిట ప్రజలకు టోకరా వేశాడని పోలీసులు వివరిస్తున్నారు. నాలుగు రాష్ట్రాలలో నెట్‌వర్క్ ఏర్పాటు చేసుకుని మోసానికి పాల్పడ్డాడని, ఏజెంట్లను ఏర్పాటు చేసుకుని, వారికి కమీషన్ల ఆశచూపించంతో పెద్ద ఎత్తున బాధితులు నష్టపోయారని దర్యాప్తులో వెలుగుచూసింది. సంస్థ ప్రారంభంలో కొద్ది మందికి సకాలంలో బ్యాంక్ అకౌంట్లలో నగదు, కమీషన్ డిపాజిట్ చేసి సంస్థపై నమ్మకం కలిగేలా వ్యవహరించారన్నారు. సంస్థలో రూ.లక్ష డిపాజిట్ చేసిన వారికి నెలకు రూ.10వేలు రావడంతో వారి తరువాయి 6లో

పింఛన్లకు 3,174 కోట్లు?

- ఓటాన్ అకౌంట్‌పై కసరత్తు వేగవంతం
- ఖరీఫ్ రైతుబంధుకు రూ. 7.5 వేల కోట్లు..
- సాగునీటికి... ఆరోగ్యశాఖలకు ప్రాధాన్యత
- అప్రోప్రియేషన్ బిల్లుతో ఆమోదం
- ఎన్ని నెలలు అనేదానిపైనే ఊగిసలాట



మన తెలంగాణ/హైదరాబాద్

ఓటాన్ అకౌంట్ బడ్జెట్ అంచనాలపై ఆర్థిక శాఖ కసరత్తును వేగవంతం చేసింది. ఇప్పటికే పలు ప్రభుత్వ శాఖలు ప్రగతి పద్దు, నిర్వహణ పద్దు కింద ఎంతెంత మొత్తం అవసరమౌతాయో ప్రతిపాదనలను సిద్ధం చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఇంకా కొన్ని శాఖలు ప్రతిపాదనలను సిద్ధం చేసే పనిలోనే ఉంది. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచే ఎన్నికల హామీలో చెప్పిన విధంగా పెంచిన పింఛన్‌లు తరువాయి 6లో

9వ జాతీయ ఓటర్ల దినోత్సవం 2019



శ్రీ సునీల్ అరోరా
భారత ఎన్నికల అధికారి

సందేశం

9వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా, దేశంలోని పౌరులందరినీ, 18 సం॥లు నిండి ఓటర్లుగా నమోదు చేసుకోబోతున్న వారందరికీ నా శుభాకాంక్షలు. యుక్త వయస్సు రాగానే ఓటు హక్కును మన పవిత్ర రాజ్యాంగ కర్తలు, అర్హులైన భారతీయ పౌరులందరికీ కల్పించారు. భారత ఎన్నికల సంఘంగా మేము దానిని మీకందించడానికి ఎంతో కృషి చేస్తున్నాం.

యావత్ దేశమంతటా 17వ లోక్‌సభ ఎన్నికలకు, ప్రపంచంలోనే అతిపెద్ద జాతీయ ఎన్నికలకు సిద్ధమవుతోంది. మేము కూడా దేశంలోని 87 కోట్లపైగా ఓటర్లకు, 10 లక్షల పోలింగ్ కేంద్రాల్లో తమ ఓటు హక్కు వినియోగించుకునేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం.

జాతీయ ఎన్నికల్లో మొదటి సారిగా మిల్లెనియల్స్ మా అంబాసిడర్స్‌గా పాలుపంచుకుంటున్నారు. దీనికి వారి కుటుంబసభ్యులు సైతం సహకరిస్తారని ఆశిస్తాము. ఈ ఎన్నికల్లోనే కాక, రాబోయే అన్ని ఎన్నికల్లోనూ పాలు పంచుకుంటారని భావిస్తున్నాము.

ఎక్కువ మంది ఓటింగ్‌లో పాలు పంచుకుంటే, అదే ధృడమైన ప్రజాస్వామ్యానికి పునాది. మేం, భారతీయ కమీషన్‌లో **"ప్రతి ఒక్క ఓటరు ప్రజాస్వామ్యంలో భాగస్వాములు కావాలి"** అన్న ప్రధాన లక్ష్యంతో కృషి చేస్తున్నాం.

మాకు ఈ రోజు ఎంతో కీలకమైన రోజు. 25 జనవరి, 1950న భారత ఎన్నికల సంఘం స్థాపించబడిన రోజు. ఈనాడే పటిష్ట భారత ప్రజా స్వామ్య వ్యవస్థ సుస్థాపితమైన రోజు. దేశంలో అద్భుత ప్రజాస్వామ్య వారసత్వాన్ని చాటిచెబుతూ, ఎటువంటి భయభ్రాంతులు లేకుండా ప్రశాంతంగా ఎన్నికలు నాటి నుండి విజయవంతంగా నిర్వహిస్తున్నాం.

మా లక్ష్యం - ప్రతి ఎన్నికలను ప్రతి ఒక్కరికీ మరింత చేరువ చేయడమే, ఓటరుతో స్నేహపూర్వకంగా, పారదర్శకంగా మెలగడమే. ఈ దిశగా మేము ఎన్నో చర్యలు చేపట్టాం. ఎన్నికల ఆఫీసును చేరువ చేసి, సకల సమాచారం, సహకారం కోసం - ఓటర్ హెల్ప్‌లైన్ నెం: 1950 అందించాం. ఇదే నెంబర్‌పై ఎస్ఎంఎస్ సేవలు ఫోన్ ద్వారా పంపిస్తున్నాం. ఆన్‌లైన్ ఓటర్ సేవలను ఫోన్ ద్వారా అందిస్తున్నాం.

భారత ఎన్నికల సంఘం తరపున, నేను దేశంలోని ఓటరులందరినీ తమ పవిత్రమైన ఓటుహక్కు వినియోగించుకోవలసిందిగా మనవి చేస్తున్నాను. రాబోయే ఎన్నికల్లో ఎలాంటి భయం, ఆందోళన, లంచాలకు లొంగక భారత ప్రజాస్వామ్యాన్ని గెలిపించవలసిందిగా కోరుతున్నాను. ఇది 5 సంవత్సరాలకు ఒకసారి వచ్చే అద్భుత అవకాశం మీరు కోరుకున్న వారు మీ తరపున లోక్‌సభలో నిలుస్తారు. అందుకే నేడే ఓటర్‌గా నమోదు చేసుకోండి.

మరొక్కసారి, జాతీయ ఓటర్ల దినోత్సవం 2019 తరపున దేశంలోని ప్రజలందరికీ మన స్ఫూర్తిగా నా శుభాభినందనలు అందజేస్తున్నాను.

జై హింద్

"ఎలక్షన్ కమీషన్ 25 జనవరి తన సంస్థాపన దినోత్సవంగా **'జాతీయ ఓటర్ల దినోత్సవం'** గా జరుపుకుంటోంది, 2011 జనవరి 25 నుంచి ప్రతీ సంవత్సరం ఇలా జరుపుకోంటోంది. ఏ ఓటరు తన హక్కును కోల్పోకూడదు అనే లక్ష్యంతో ఈ రోజు 9వ జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించబడుతోంది. చట్టం ప్రకారం ప్రతీ ఒక్కరికి ఈ హక్కును కల్పించుటలో పూర్తిగా వాస్తవరూపంలోకి తీసుకువచ్చుటకు మరియు భారత ప్రజాస్వామ్య నాణ్యతను పెంపొందించుటకు ఈ సందర్భాన్ని ఉపయోగిస్తూ ఓటర్ల నమోదు ప్రక్రియను పెంపొందించు లక్ష్యంతో కమీషనర్ ఉన్నారు. తెలంగాణలో పోలింగ్ స్టేషన్ల ప్రదేశాలన్నింటి వద్ద కార్యక్రమాలు నిర్వహించబడతాయి. ప్రతీ పోలింగ్ స్టేషన్ వద్ద నూతనంగా నమోదైన ఓటర్లు నూతన పివిసి కలర్ కార్డుతో పాటు లోగో మరియు **"Proud to be a voter – Ready to Vote"** నినాదం కలిగి ఉంటారు."

తెలంగాణ వ్యాప్తంగా జాతీయ ఓటర్ల దినోత్సవ వేడుకలు

తెలంగాణ సుస్థిర మరియు క్రియాశీల ప్రభుత్వం కలిగిన వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రం, ఇది 2018 ఎన్నికల్లో దేశవ్యాప్తంగా మార్గదర్శకంగా నిలిచింది, ఒక్క సంఘటన కూడా లేకుండా ఎంతో ప్రశాతంగా నిర్వహించబడినవి. ఈ పరపతి అంతా ఎలక్షన్ కమిషన్‌కు దక్కుతుంది, వారు ఎలక్షన్లను సవ్యంగా, సజావుగా నిర్వహించుటకు అవిశ్రాంతంగా పని చేశారు. గతంలోని ఓటర్ శాతం 69.5 శాతంతో పోల్చితే ఇప్పుడు 73.4 శాతమునుకు పెరిగింది. ఎలక్షన్ కమిషన్ ప్రయత్నాలతో ఇది ఎంతో గొప్ప అభివృద్ధి, విజయంగా పేర్కొనవచ్చును.
ఇప్పుడు జాతీయ ఓటర్ల దినోత్సవం ఎంతో సంతోషంగా జరుపుకునే వేడుక **NVD**. తెలంగాణలోని అన్ని జిల్లాల్లో వివిధ రకాల కార్యకలాపాలతో మరియు ఎంతో ఆసక్తి కలిగించే అంశాలతో నిర్వహించబడుతోంది. క్విజ్, వ్యాసరచన, మాక్ పార్లమెంట్, మహిళలకు రంగోలి పోటీలు, హై స్కూల్స్ సీనియర్ స్థాయిలో పోటీలు నిర్వహించబడతాయి. వీటిని అన్ని పోలింగ్ స్టేషన్ల వద్ద నిర్వహిస్తారు. మరియు విజేతలకు బహుమతులు మరియు సర్టిఫికేట్లు పంపిణీ ఉంటుంది. జాతీయ ఓటర్ల దినోత్సవం రోజున తెలంగాణలో అన్ని విద్యాసంస్థలు/ప్రభుత్వ కార్యాలయాలలో **NVD** ప్రతిజ్ఞ చేయబడుతుంది. పోలింగ్ స్టేషన్, శాసన సభ నియోజకవర్గం, జిల్లా మరియు రాష్ట్ర స్థాయిలో **NVD** కార్యక్రమాలకు హాజరయ్యే పౌరులందరూ కూడా ప్రతిజ్ఞ చేయవలసి ఉంటుంది.

జాతీయ
ఓటర్ల దినోత్సవం
25 జనవరి
2019

భారతదేశ పౌరులమయిన మేము, ప్రజాస్వామ్యంపై విశ్వాసంతో, మనదేశ ప్రజాస్వామ్య సాంప్రదాయాలను, స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత, ప్రశాంత ఎన్నికల ప్రాభవాన్ని నిలబెడతామనీ, మతం, జాతి, కులం, వర్గం, భాష లేదా ఎటువంటి ఒత్తిడులకు ప్రభావితం కాకుండా ప్రతి ఎన్నికల్లో నిర్భయంగా ఓటు చేస్తామని ఇందుమూలంగా ప్రతిజ్ఞ చేస్తున్నాము.



డా॥ రజత్ కుమార్ ఐ.ఎ.ఎస్
ప్రధాన ఎన్నికల అధికారి, తెలంగాణ

సందేశం


భారత ఎన్నికల సంఘం 25 జనవరిని తన సంస్థాగత దినోత్సవం రోజును 2011 నుండి ప్రతి ఏడాది జాతీయ ఓటర్ల దినోత్సవంగా జరుపుకుంటున్న విషయం మీకందరికీ తెలుసు. ఎన్నికల సంఘం ప్రధాన ఉద్దేశ్యం - ఈ సందర్భాన్ని పురస్కరించుకుని, అర్హులైనవారందరినీ ఓటర్లుగా నమోదు చేయడం తద్వారా భారత ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడం. ఈ రోజు మనం 9వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని **"ప్రతి ఒక్క ఓటరు ప్రజాస్వామ్యంలో భాగస్వాములు కావాలి"** అన్న ముఖ్యాంశంతో జరుపుకుంటున్నాం.

తెలంగాణ మొట్టమొదటి సాధారణ ఎన్నికలు డిసెంబర్ 2018లో ఎంతో ప్రశాంతంగా చక్కగా జరిగాయని తెలియజేస్తున్నాను. తెలంగాణ ఓటరు మహాశయులందరికీ ఈ సందర్భంగా ధన్యవాదాలు సమర్పిస్తున్నాను. పోలింగ్ శాతం రాష్ట్రంలో చారిత్రాత్మకంగా 73.40% మును పెన్నడూ లేని విధంగా నమోదు అయ్యింది. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు గానీ, ఉద్రిక్తపరిస్థితులు, ఆందోళనలు, తలెత్తలేదు, రీపోలింగ్ జరగలేదు. వికలాంగులైన వారికి సైతం - కల్పించిన ప్రత్యేక వసతుల వలన పోలింగ్‌లో ఉత్సాహంగా పాలుపంచుకున్నారు. వారి పోలింగ్ శాతం 70% వరకూ నమోదైంది.

లోక్‌సభకు ఎన్నికలు అతి తొందరలోనే రాబోతున్నాయి. దీనిలో మీ ఓటు హక్కును మీరు వినియోగించాలంటే ముందుగా మీ పేరు ఓటరు జాబితాలో ఉండేలా చూసుకోవాలి. ఓటర్ లిస్ట్‌లో పేరు లేకపోతే ఓటును వేయలేరు. ఓటర్ల జాబితాల సవరణ 1-1-2019 నుండి ప్రారంభమై, ఫిబ్రవరి 4వ తేదీ వరకు కొనసాగుతాయి. మీ దరఖాస్తులు సమర్పించడానికి ఇదే ఆఖరు తేదీ. తుది జాబితా 26.02.2019 న ప్రకటించబడుతుంది. 31 డిసెంబర్ 2018 నాటికి 18 సంవత్సరాలు నిండిన పౌరులందరూ ఓటు హక్కును పొందడానికి అర్హులు.

కనుక అర్హులైన పౌరులందరూ వెంటనే తమపేరు నమోదు చేసుకొని, రానున్న జాతీయ సార్వత్రిక ఎన్నికల్లో తమ విలువైన ఓటు హక్కును ఎటువంటి భయం, భీతి లేకుండా, కులం, మతం, ప్రాంతం, భాష లేదా లంచాలకు లొంగకుండా నిజాయితీగా వినియోగించుకోవలసిందిగా కోరుతున్నాను.

నేను మరొక్కసారి చేసే విన్నపమల్లా **"ప్రతి ఒక్క ఓటరు ప్రజాస్వామ్యంలో భాగస్వాములు కావాలి"** అనే భావన ఎన్నికల సంఘం వారి మహదాశయాన్ని నిజం చేసేందుకు మనందరం నిరంతరం కృషి చేద్దాం... ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును పొందేలా, వినియోంచుకునేలా చూద్దాం !!



ప్రతి ఒక్క ఓటరు ప్రజాస్వామ్యంలో భాగస్వాములు కావాలి

భారత ఎన్నికల సంఘం
https://eci.gov.in

ప్రధాన ఎన్నికల అధికారి,
తెలంగాణ

Voter Helpline 1950







రాజశ్యామలా దేవికి సువర్ణ మంత్ర పుష్పాంజలి

నాల్గవరోజు చండీయాగం





మన తెలంగాణ / హైదరాబాద్ : దేశం సుభిక్షంగా ఉండాలని కాంక్షిస్తూ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు నిర్వహిస్తున్న సహస్ర మహా చండీ యాగం నాలుగవ రోజైన గురువారం ఉదయం యాగశాలలో సతీసమే



తంగా ప్రవేశించి రాజశ్యామల మాత మంటపంలో పూజలు చేయడంతో ప్రారంభమైంది. శ్రీ మహాకాళి, మహాలక్ష్మి, మహా సరస్వతి, స్వరూపిణిగా శ్రీ రాజశ్యామలాదేవిని సువర్ణ మంత్ర పుష్పాంజలితో సిఎం దంపతులు ప్రార్థించారు. సర్వ మంగళ మాంగల్యే... శ్రీ రాజశ్యామలా దైవేయ నమస్తే... అంటూ ఋత్విక్కులు వేదోక్తంగా ప్రార్థనలు చేస్తుండగా వేద పండితులు ముఖ్యమంత్రి దంపతులకు ఆశీర్వచనం అందజేశారు. అనంతరం మహారుద్ర మంటపంలో జరిగిన పూజలో సిఎం పాల్గొన్నారు. మహా రుద్ర సహిత రుద్ర ఏకాదశిని రుద్ర నమకం, రుద్ర చమకం ద్వారా పఠించారు. పంచాక్షరి జపంలో భాగంగా శివశివ శంకర భూత పతే, శంకర శివ, శంభో మహాదేవ, హరహర మహాదేవ అనే ప్రార్థనలతో యగశాల మార్మోగింది. ముఖ్యమంత్రి దంపతులు రాజశ్యామల యాగ మంటపంలో అర్చన, శరభ శాలువ జపాలు, హోమాలు, పారాయణాలు, హారతులు, మంత్ర పుష్పము, పూజ తదితర కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం బగుళాముఖి అమ్మవారి మంటపంలో జరిగిన పూజా కార్యక్రమములో పాల్గొన్నారు. ఆ తర్వాత పాంచాంగిక దీక్షలో ఆవాహిత దేవతా పూజనం,10 వేల జపం, సుహాసినీ పూజ, హారతీ మంత్ర పుష్పము, మూల మంత్ర హవనము, హరిద్రన్నాముతో 2 వేల మూల మంత్ర హవనం తదితర పూజా కార్యక్రమాలు జరిగాయి. మహారుద్ర యాగంలో భాగంగా శాంతి పాఠంతో ప్రారంభమై ఆవాహిత దేవతా పూజలు, రుద్ర జపాభిషేకాలు, 44 మంది ఋత్విక్కులతో 44 ఏకాదశ రుద్ర హోమాలు, అధ్యాక్త తిలలతో హోమము, ప్రదోష పూజ, నవగ్రహ జపాదులు, పంచ కాటకములు, పంచోపనిషత్తులు, సుందరాకాండ పారాయణం, సూర్య నమస్కారాలు, మహా మృత్యుంజయ జపం, హవనాలు తదితరాలను వైదిక పండితులు వైభవంగా పూర్తిచేశారు. భక్తజనం ఆనందంలో, ఆధ్యాత్మిక వాతావరణంలో మునిగిపోయారు.

బ్రహ్మ స్వరూపిణి బగళాముఖి మంటపంలో

ముఖ్యమంత్రి దంపతుల సమక్షంలో వేదపండితులు, ఋత్విక్కులు గౌరీ నారాయణ నమస్తుతే, పీతాంబర దేవీ నమస్తుతే, జయతే, విజయతే, జయ విమలే బగళే అంటూ దేవిని స్తుతించారు, ప్రత్యేక పూజలు చేశారు. శత మానం భవతే అంటూ పండితులు కెసిఆర్ దంపతులను ఆశీర్వదించారు. నవగ్రహ మంటపంలో ఆదిత్య హృదయం పఠనం, సూర్య నమస్కారాలు నిర్వహించారు. చండీమాత ప్రధాన యాగశాలలో రాజరాజేశ్వరి మాత ప్రార్థన చేశారు. భువనేశ్వరి, బ్రహ్మాండ కుటుంబినీ, శ్రీ గణనాధ పార్వతీ నందన, పాపవిమోచన అంటూ ప్రార్థనలు నిర్వహించారు . ఋత్విక్కులు 400 సార్లు చండీ సప్తశతి పారాయణము పఠించారు. వేదపండితులు యాగం వీక్షించడానికి వచ్చిన భక్తులకు సుభాషితాలు వినిపించారు. యాగ విశిష్టతను వివరించారు. మహాహారతితో ఉదయం పూట కార్యక్రమాలు ముగిశాయి. ప్రజలందరూ సంతోషంగా ఉండాలని, వానలు బాగా కురవాలని, పంటలు బాగా పండాలని ఆకాంక్షిస్తూ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు తలపెట్టిన అయిదు రోజుల సహస్ర చండీయాగం నభూతో నభవిష్యత్ అన్నట్లుగా వైభవంగా జరుగుతోందని పాల్గొన్నవారు సంతృప్తి వ్యక్తంచేశారు. ప్రాతఃకాల పూజలతో ప్రారంభమైన సహస్ర చండీ యాగం శ్రీ చక్రార్చన, 400 సప్త శతి పారాయణములు పూర్తి చేసుకొని మంగళహారతి, మంత్ర పుష్పం, భజన కార్యక్రమము, తీర్ధ ప్రసాద వితరణతో మాధ్యాహ్నిక కార్యక్రమం పూర్తయినది. సాయంకాలం నాలుగు గంటలకు యాగాన్ని తిరిగి ప్రారంభించిన వేద పండితులు నవార్ణ జపం ఒక లక్ష పూర్తి చేశారు. సాయంత్రం 6.30 గంటలకు ప్రదోషకాల పూజలు, హారతి, మంత్ర పుష్పం, భజన కార్యకమం, తీర్థ ప్రసాద వితరణముతో పూర్తిచేశారు. హారతి, మంత్ర పుష్పం తర్వాత జరిగిన భజన కార్యక్రమం భక్తులను విశేషంగా ఆకట్టుకున్నది. అన్ని మంటపాల్లో జరిగిన పూజా కార్యక్రమాల్లో ముఖ్యమంత్రి దంపతులు, కుటుంబ సభ్యులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కె జోషి, డిజిపి మహేందర్‌రెడ్డి, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు, సిఎంఓ అధికారులు భూపాల్‌రెడ్డి, శాంతి కుమారి, హైదరాబాద్ కలెక్టర్ యోగితా రాణా, వివిధ స్థాయిల్లోని ప్రజా ప్రతినిధులు, అధికారులు, టిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.


ఎసిబి వలలో సబ్‌రిజిస్ట్రార్ ఉద్యోగి



మనతెలంగాణ/హైదరాబాద్ : మలక్‌పేటలోని అజాంపురాలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ అజర్ రూ. 700 లంచం తీసుకుంటూ గురువారం ఎసిబి అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. వివరాల్లోకి వెళితే... చార్మినార్‌లో నివాసముంటున్న మహ్మద్ ఫరూఖ్ తన ఆస్తులకు సంబంధించిన పత్రాలను ఇవ్వాలని కోరుతూ జూనియర్ అసిస్టెంట్ అజర్‌ను సంప్రదించాడు. దీంతో ఆయా పత్రాలు ఇవ్వడానికి జూనియర్ అసిస్టెంట్ అజర్ రూ. 700 డిమాండ్ చేశాడు. ఈక్రమంలో మహ్మద్ ఫరూక్ తన పత్రాలు తనకు ఇచ్చేందుకు జూనియర్ అసిస్టెంట్ అజర్ రూ. 700 లంచం అడిగాడని ఎసిబి అధికారులను కలిసి ఫిర్యాదు చేశాడు. జూనియర్ అసిస్టెంట్ అజర్ చార్మినార్ నివాసి మహ్మద్ ఫరూఖ్ అనే వ్యక్తి నుంచి గురువారం రూ.700 తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. జూనియర్ అసిస్టెంట్ అజర్‌ను తనిఖీ చేయగా అతని వద్ద రూ.1.020 నగదు పట్టుబడింది. విధి నిర్వహణలో రికార్డులలో చూపించిన మొత్తాల కన్నా జూనియర్ అసిస్టెంట్ అజర్ వద్ద అధిక మొత్తాలు ఉన్నాయని ఎసిబి అధికారులు వివరించారు. ఈ క్రమంలో ఎసిబి అధికారులు జూనియర్ అసిస్టెంట్ అజర్‌ను అరెస్టు చేసి ఎసిబి కోర్టులో హాజరుపరిచారు. లంచాలను ఇవ్వటం, తీసుకోవడం రెండూ నేరమేనని ఎసిబి అధికారులు వివరిస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు లంచం డిమాండ్ చేసిన పక్షంలో 1064 టోల్ ఫ్రీ నంబరుకు వెంటనే ఫిర్యాదు చేయాలని అధికారులు వివరిస్తున్నారు. పెద్ద హోదాలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగుల విషయంలో ఫిర్యాదుదారుని వివరాలను అవసరమైతే గోప్యంగా ఉంచుతామని, కేసు నమోదు చేసిన అనంతరం వెల్లడిస్తామని ఎసిబి ఉన్నతాధికారులు వివరిస్తున్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో ఎసిబి టోల్ ఫ్రీ నంబర్లను స్టిక్కర్ల రూపంలో ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు లంచగొండుల ఆటకట్టిస్తామని, ఇందుకు ప్రజలు తమ వంతు సహకరించాలని ఎసిబి అధికారులు కోరుతున్నారు.

బాలిక సంరక్షణకు సర్కారు పెద్దపీట

రాష్ట్ర హోంశాఖ మంత్రి మహమూద్ ఆలీ



మనతెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్రంలో బాలిక సంరక్షణకు సర్కారు పెద్దపీట వేసిందని, బాలికలను అన్ని విధాల ఆదుకునేందుకు వినూత్న పథకాలు అమలు చేస్తున్న ఘనత కెసిఆర్‌కే దక్కిందని రాష్ట్ర హోంశాఖ మాత్యులు మహమూద్ ఆలీ పేర్కొన్నారు. హైదరాబాద్ నగరంలోని ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో గురువారం జరిగిన జాతీయ బాలికా సంరక్షణ దినోత్సవ కార్యాక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర హోంశాఖ మంత్రి మహబూద్ ఆలీ హాజరయ్యారు. ఈ సందర్భంగా హోంమంత్రి మాట్లాడుతూ బాలికల సంరక్షణకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతను ఇస్తోందని పేర్కొన్నారు. దేశంలో ఎక్కడ లేని విధంగా మహిళల రక్షణ కోసం షీటీమ్స్ ఏర్పాటు చేశామన్నారు. అనతికాలంలో షీ టీమ్స్‌ను జిల్లాల వారీగా విస్తరిస్తామన్నారు. హైదరాబాద్‌లో చోటుచేసుకుంటున్న హ్యూమన్ ట్రాఫికింగ్‌పై ఉక్కుపాదం మోపుతామన్నారు. మహిళల అభ్యున్నతికి అన్ని విధాల ప్రభుత్వం బాసటగా నిలుస్తోందన్నారు. అదేవిధంగా బాలికలకు విద్యకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఆడబిడ్డ పుట్టినప్పటి నుంచి విద్యవరకు అన్ని విధాలుగా సహాయం చేస్తున్నామని, బాల్య వివాహాల నిరోధానికి అవగాహన కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామన్నారు. కల్యాణలక్ష్మి పథకం ద్వారా రూ.లక్ష ఆర్థిక సహాయం అందిస్తున్నామన్నారు.

510 అడుగుల దగ్గర ఆగాల్సిందే

సాగర్‌లో కనీస నీటి మట్టానికి తెలంగాణ పట్టుదల



మన తెలంగాణ/హైదరాబాద్: జూలై మాసం వరకు నాగార్జునసాగర్‌లో 510 అడుగుల మేర కనీస నీటి మట్టం నిర్వహించాలని తెలంగాణ ప్రభుత్వం పట్టుదలగా ఉంది. హైదరాబాద్ తాగునీటితో పాటు, నల్లగొండ జిల్లా, ఆంధ్రాలోని కొన్ని ప్రాంతాల తాగునీటి అవసరాల కోసం నాగార్జునసాగర్‌లో కనీస నీటి మట్టం తప్పనిసరని ప్రభుత్వం భావిస్తుంది. కొత్త వాటర్ ఇయర్ మొదలైనా సకాలంలో వర్షాలు పడడం, ఎగువన జూరాల, శ్రీశైలం నిండి, నాగార్జున సాగర్ వరకు నీరు చేరడం ఆలస్యమైతే సాగునీరు దేవుడెరుగు, తాగునీటికే కష్టం ముంచుకొస్తుంది. గత నాలుగైదేళ్ల అనుభవాలతో తెలంగాణ ప్రభుత్వం ముందు జాగ్రత్త చర్యగా సాగర్‌లో నీటి నిల్వల నిర్వహణపై ఖచ్చితంగా ఉంది. ఫలితంగా కనీస నీటిమట్టాల దిగువకు వెళ్లైనా సరే తక్షణమే 5 టిఎంసిల నీటిని ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కోరింది. దీనిపై ఉన్నతస్థాయిలో చర్చలు జరుగుతున్నాయి. నీటి విడుదలపై తెలంగాణ ఉన్నతాధికారులు స్పష్టమైన అభిప్రాయంతో ఉన్నారు. నాగార్జునసాగర్ ఎడమ కాలువలో ఆంధ్రాకు వెళ్లే నీటిలో నష్టాలను పూర్తిగా తెలంగాణ ఖాతాలో వేయడంపైనా ప్రభుత్వం ఆగ్రహంగా ఉంది. గత సంవత్సరం కూడా ఇదేతీరులో కృష్ణాబోర్డు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వ్యవహరించింది. కనీస నీటిమట్టం ఎగువన ఉన్న నీటిలో ఆంధ్రప్రదేశ్ వాటా సంపూర్ణంగా వినియోగించుకుంది. ఇంకా 2 టిఎంసిల మేర అధికంగా వినియోగించుకున్నట్లు లెక్కలు స్పష్టం చేస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని స్థానిక రాజకీయ అవసరాల కోసం శ్రీశైలం రిజర్వాయర్ నుంచి పోతిరెడ్డిపాడు ద్వారా నీటిని ఈ సంవత్సరం చిత్తూరు జిల్లా వరకు తీసుకెళ్లారు. రాయలసీమలోని కడప, కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాలకు సాగు, తాగు నీరు, చెన్నైకి తాగు నీటిని మళ్లించారు. ఈ క్రమంలో వచ్చిన నీటిని వచ్చినట్లే మళ్లించారు. అదృష్టవశాత్తూ వర్షాకాలం తొలినాళ్లలోనే ఆల్మట్టి, నారాయణపూర్ రిజర్వాయర్లు నిండడం, దీనికి అనుబంధంగా చాలా కాలం తర్వాత తుంగభద్ర పొంగడంతో శ్రీశైలం ద్వారా విడుదల చేసిన నీటితో నాగార్జునసాగర్ పూర్తిస్థాయికి చేరడం గమనార్హం. అయితే ఈ మధ్యలో పోతిరెడ్డిపాడు ద్వారా లెక్కకు దొరకని రీతిలో నీటిని మళ్లించి, అక్రమంగా చేసిన వినియోగం లెక్కలు మాత్రం చిదంబర రహస్యంగా మారాయి. ఈ లెక్కలు గట్టిగా అడిగితే, జూరాలలో అక్రమాలంటూ ఆంధ్రప్రదేశ్ ప్రతి ఫిర్యాదు చేసింది కానీ, పోతిరెడ్డిపాడు గుట్టు మాత్రం విప్పడం లేదు. వీటన్నింటి నేపథ్యంలో నాగార్జునసాగర్‌లో కనీస నీటిమట్టంపై ప్రభుత్వం ఖచ్చితమైన అభిప్రాయంతో ఉంది. దీనిపై కృష్ణాబోర్డుకు నేడో, రేపో లేఖ రాయనున్నట్లు తెలిసింది.

కాంగ్రెస్ కార్టూన్‌పై అసదుద్దీన్ ఆగ్రహం




మన తెలంగాణ/ హైదరాబాద్ : ఎన్నికల యంత్రాంగాన్ని విమర్శిస్తూ రాష్ట్ర కాంగ్రెస్ రూపొందించిన పోస్టర్‌పై ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల సంఘం మీదా, ప్రజాస్వామ్యంమీదా అభ్యంతరం, అసంతృప్తి, వ్యతిరేకత ఉంటే దానిని చాలా రూపాల్లో నిరసనగా ప్రదర్శించవచ్చునని, కానీ ఒక మహిళ కేరికేచర్‌ను ఇందుకు వినియోగించుకోవడం ప్రజాస్వామ్య వ్యవస్థలో సమంజసం కాదని వ్యాఖ్యానించారు. ఎన్నికల వ్యవస్థను నిరసిస్తూ తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇందిరా పార్కు దగ్గర చేపట్టిన నిరసనలో ప్రదర్శించిన పోస్టర్‌ను ఒవైసీ తప్పుపట్టారు. ప్రజాస్వామ్యాన్ని ఒక మహిళగా ఆ కార్టూన్‌లో కాంగ్రెస్ పార్టీపేర్కొనిందని, ఎన్నికల సంఘం (యంత్రాంగం) ఆమె కట్టుకున్న దుస్తుల్ని విప్పుతూ ఉంటే రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న కెసిఆర్, ఆయన వెనకే తాను కూడా ఉన్నట్లుగా ఆ కార్టూన్‌లో పేర్కొనడాన్ని తప్పుపట్టారు. ఒక మహిళను వివస్త్రను చేసే తీరులో కార్టూన్‌ను రూపొందించడం ద్వారా కాంగ్రెస్ పార్టీ ఈ సమాజానికి ఏ సందేశాన్ని ఇవ్వాలనుకుంటోందని ఆయన తన నివాసంలో బుధవారం మీడియా ద్వారా ప్రశ్నించారు. తాజాగా ముగిసిన అసెంబ్లీ ఎన్నికల్లో కేంద్ర ఎన్నికల సంఘం పారదర్శకంగా వ్యవహరించడంలో విఫలమైందని కాంగ్రెస్ ఆ కార్టూన్ ద్వారా చెప్పాలనుకుంది. అయితే కెసిఆర్ కేరికేచర్ వెనకనే అసదుద్దీన్ ఒవైసీ బొమ్మ కూడా ఉండడంతో ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. నిజంగా ఎన్నికల వ్యవస్థమీద కాంగ్రెస్ పార్టీకి నమ్మకం పోయినట్లయితే నిరసన తెలియజేసే హక్కు ఆ పార్టీకి పుష్కలంగా ఉందని, కానీ మహిళను వివస్త్రను చేసే తీరులో కార్టూన్‌ను రూపొందించడం ఆ పార్టీ విజ్ఞతకే వదిలేస్తున్నానని అన్నారు.

చౌకీదార్లంతా దొంగలే

ఈ దేశంలో ఏడు దశాబ్దాల పాటు కేంద్రంలో పాలన సాగించిన రెండు ప్రధాన పార్టీలకు చెందిన ప్రధాన మంత్రులు వివిధ సామాజికవర్గాలకు సంపూర్ణ న్యాయం చేయలేకపోయారని, దేశానికి కాపలాగా ఉంటున్నట్లు చెప్పుకునే వీరంతా దొంగలేనని అసదుద్దీన్ ఒవైసీ వ్యాఖ్యానించారు. ఏడు దశాబ్దాల పాలనలో దళిత, ఆదివాసీ, ముస్లిం మైనారిటీల జీవితాల్లో పెద్దగా వచ్చిన మార్పేమీ లేదని అన్నారు. నిరక్షరాస్యత, పేదరికం, పోషకాహార లోపం తదితరాలన్నీ యధావిధిగా కొనసాగుతూనే ఉన్నాయని, గ్రామీణ పట్టణ ప్రాంతాల మధ్య అగాధం పెరిగిపోతూ ఉన్నదని అన్నారు.

వక్ఫ్‌బోర్డు భూములను కాపాడండి

కబ్జాదారులపై చట్టరీత్యా చర్యలు • అధికారులను ఆదేశించిన హోం మంత్రి



మనతెలంగాణ/హైదరాబాద్ : వక్ఫ్‌బోర్డు భూములను కబ్జా చేసిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని హోంమంత్రి మహమూద్‌అలీ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన సచివాలయంలోని తన ఛాంబర్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వక్ఫ్‌బోర్డు భూముల వివరాలతో పాటు కబ్జాదారులపై తీసుకున్న చర్యల గురించి ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ కబ్జాదారులను వదిలిపెట్టవద్దని న్యాయపరమైన సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని, కేసులు నమోదు చేసేటప్పుడు న్యాయ నిపుణులు సలహాలు తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. గజం వక్ఫ్‌బోర్డు భూమి కూడా కబ్జాకు గురికాకుండా చూసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ఆయన పేర్కొన్నారు. గతంలో కోర్టులో వేసిన కేసులకు సంబంధించి వాటి పరిస్థితి గురించి అధికారులు ఈ సందర్భంగా హోంమంత్రికి వివరించారు. ఈ సమావేశంలో వక్ఫ్‌బోర్డు చైర్మన్ మహ్మద్ సలీం, సీఈఓ షానవాజ్ ఖాసీం, డిసిపి విశ్వప్రసాద్‌లతో పలువురు అధికారులు పాల్గొన్నారు.

బస్టాండ్‌లలో మినీ థియేటర్లు

- ప్రాథమికంగా 23 బస్టాండ్ల గుర్తింపు
- వివరాలను వెల్లడించిన ఇంఛార్జి ఎండి సునీల్‌శర్మ



మన తెలంగాణ/ హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆర్థిక పరిస్థితిని మెరుగుకు ముందుడుగు పడింది. బస్సు స్టేషన్లలో మిని థియేటర్లను నిర్మించాలని సంస్థ గురువారం బస్ భవన్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకున్నారు. తెలంగాణ రాష్ట్ర చలన చిత్ర అభివృద్ధి సంస్థ ముందుకు వచ్చిందని ఇంఛార్జీ ఎండి సునీల్‌శర్మ వెల్లడించారు. ఇందుకోసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయవాడ పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ బస్టాండ్‌లో ఆ ప్రభుత్వం నిర్మించిన మినీ థియేటర్లను సంస్థ కార్యదర్శి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (రెవెన్యూ ఐటి) పురుషోత్తంతో పాటు పలువురు అధికారుల బృందం త్వరలోనే వాటిని పరిశీలించి, నిర్వహణపై అధ్యయనం చేయనుందని తెలిపా రు. సంస్థ ఆర్థిక పరిస్థితులను మెరుగుపర్చుకునేందుకు వీలుగా కార్యాచరణ ప్రణాళికతో ముందుకు సాగాలని నిర్ణయించిన అధికార యంత్రాంగం ఆ ప్రయత్నాన్ని మరింత ముమ్మరం చేసిందన్నారు. మినీ థియేటర్ల నిర్మాణం, నిర్వహణ సాధ్యాసాధ్యాలపై అధికారులు క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎండి వివరించారు. ఇప్పటికే సంస్థకు చెందిన ఖాళీ స్థలాల్లో పెట్రోల్ బంకుల నిర్మాణానికి నిర్మాణాలకు శ్రీకారం చుట్టిన అధికార యంత్రాగం మినీ థియేటర్ల నిర్వహణపై దృష్టి పెట్టిందన్నారు. ఆదాయ పెంపునకు సంబంధించి ఇతర అంశాలపై పరిశీలించిన తగిన నిర్ణయాలు తీసుకుంటామన్నారు.రాష్ట్రంలో మొత్తం 97 డిపోలు, 358 బస్ స్టేషన్లు, 10,504 బస్సులను కలిగిన సంస్థ 90 లక్షల మందిని వారి గమ్యస్థానాలకు చేర్చడం ద్వారా వచ్చే ట్రాఫిక్ ఆదాయంతో పాటు బస్టాండ్లలోని దుకాణాల అద్దెలు, అడ్వర్టైజ్‌మెంట్లతో ఆదాయాన్ని సమకూర్చుకుంటుందని తెలిపారు. కమర్షియల్ ఆదాయాన్ని పెంచుకునేందుకు వీలుగా 23 ప్రాంతాల్లో మినీ థియేటర్ల నిర్మించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఇందులో ఆదిలాబాద, అసిఫాబాద్, నిర్మల్, కొల్లూరు, కొత్త గూడెం, సత్తుపల్లి, కరీంనగర్, ధర్మపురి, హుజూరాబాద్, సిరిసిల్ల, పెద్దపల్లి, జడ్చర్ల, షాద్‌నగర్, నర్సాపూర్, సంగారెడ్డి, నాగార్జునసాగర్, కోదాడ, ఆర్మూర్, బోధన్, చెవెళ్ల, తాండూరు, వికారాబాద్ తదితర స్టేషన్లలోని ఖాళీ స్థలాల్లో మినీ థియేటర్లను నిర్మించాలని ప్రాథమికంగా గుర్తించినట్లు తెలిపారు. ఇందులో 15 ప్రాంతాల్లో చలన చిత్ర అభివృద్ధి సంస్థ థియేటర్ల నిర్మాణానికి ముందుకు వచ్చిందన్నారు.

కేంద్ర బడ్జెట్‌పై ఆశలు!

సంపాదకీయం

సార్వత్రిక ఎన్నికలకు ముందు వచ్చే కేంద్ర బడ్జెట్ మీద ప్రజలు ఎక్కువగా ఆశలు పెట్టుకోవడం, వాటిని రేకెత్తించే సూచన ప్రాయ సమాచారాన్ని కేంద్రంలోని పాలకులు అందుబాటులో ఉంచడం సహజం. వాస్తవంగా అసలు బడ్జెట్‌లో ఉండేది ఏమైనప్పటికీ అది వెలువడడానికి ముందు ఈ ఊహాగానాల పర్వం మాత్రం ముమ్మరంగా సాగుతుంది. ఎన్‌డిఎ అధికారంలోకి వచ్చిన తర్వాత మారిన సంప్రదాయం ప్రకారం ఫిబ్రవరి 1వ తేదీన కేంద్ర బడ్జెట్‌ను పార్లమెంటులో ప్రతిపాదిస్తున్నారు. అలా సమర్పించవలసిన బడ్జెట్ పత్రాల ముద్రణ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమై సాగుతున్నది. ఇంకొకవైపు రైల్వేలో మరి 2,30,000 ఉద్యోగాల ఖాళీలను భర్తీ చేయనున్నట్టు అందులో ఇటీవల చట్టమైన అగ్రవర్ణ పేదల కోటాను అమలు చేయనున్నట్టు ఆ శాఖ మంత్రి పీయూష్ గోయెల్ తాజాగా ప్రకటించారు. చికిత్స కోసం విదేశం వెళ్లిన ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ సకాలంలో తిరిగి రాలేకపోతే బడ్జెట్ సమర్పణ బాధ్యతను గోయెల్‌కే అప్పగిస్తారని కూడా వార్తలు వచ్చాయి. ఆ సమయానికి తాను స్వదేశానికి చేరుకుంటానని జైట్లీ వెల్లడించినట్టు తాజా సమాచారం. ఆర్థిక మంత్రిగా జైట్లీ ముద్ర బడ్జెట్‌పై ఉంటుందనేది సుస్పష్టం. ఆయన అయినా, ప్రధాని మోడీ అయినా మొత్తంగా బిజెపి ప్రభుత్వ బడ్జెట్ వ్యూహమే ఈసారి ఎంతోకొంత ప్రజానుకూలంగా ఉండే అవకాశమున్నది. అంటే పన్నులు పిండుకుంటూనే కొన్ని వర్గాల సాధారణ ప్రజలకు కొంత మేలు చేకూర్చే విధంగా కొత్త ప్రతిపాదనలు అందులో చోటు చేసుకునే అవకాశం ఉండవచ్చు.

లోక్‌సభ ఎన్నికలు మార్చి, ఏప్రిల్ మాసాల్లో జరిగిపోవలసి ఉంది కాబట్టి పూర్తి స్థాయి బడ్జెట్‌ను ఇప్పుడు ప్రవేశపెట్టే అవకాశం లేదు. అందుచేత తాత్కాలిక బడ్జెట్ ప్రతిపాదనే జరుగుతుంది. ఎన్నికలు ముగిసి కొత్త ప్రభుత్వం స్థిరంగా కొలువు దీరేవరకు అవసరమైన వ్యయం మేరకు మాత్రమే బడ్జెట్ రూపకల్పన జరుగుతుంది. అందులో ఎన్నికల్లో విజయావసరాల దృష్ట్యా భిన్న వర్గాలను అలరింపచేసే ప్రతిపాదనలను చేర్చగలరని భావిస్తున్నారు. ముఖ్యంగా రైతులు, మధ్యతరగతి నికరాదాయ వర్గాలు, పేదలు, చిన్న వ్యాపారులకు తాయిలాల ప్రకటన ఉండవచ్చని ఎదురు చూస్తున్నారు. విచ్చలవిడి సంస్కరణల నేపథ్యంలో దళారీ వ్యవస్థ విశ్వరూపం చూపించడంతోనూ, ప్రకృతి వైపరిత్యాలవల్లనూ దేశంలో రైతాంగం తీవ్రంగా దెబ్బతిని ఉన్నారు. అప్పుల బాధలు పడలేక ఆత్మహత్యల బాట పట్టడం అనేక సంవత్సరాలుగా నిరాఘాటంగా సాగిపోతున్నది. ఈ దుర్భర పరిస్థితుల్లో పలు రాష్ట్రాల్లోని రైతులు అపూర్వమైన రీతిలో సంఘటితమై దేశ, రాష్ట్ర రాజధానుల్లో నిరసన ర్యాలీలు పెద్ద ఎత్తున నిర్వహించిన విషయం విదితమే. దీనిని దృష్టిలో ఉంచుకొని కాంగ్రెస్ పార్టీ రైతు రుణ మాఫీ హామీని ఇచ్చి ఇటీవల ఎన్నికలు జరిగిన మూడు ఉత్తరాది రాష్ట్రాల్లో విజయం సాధించింది. ప్రధాని మోడీ కూడా కాంగ్రెస్ కంటే భిన్నమైన, మెరుగైన పథకాన్ని రైతుల కోసం ప్రకటించాలని దృఢ నిశ్చయానికి వచ్చినట్టు భావిస్తున్నారు. తెలంగాణలో టిఆర్ఎస్ ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన వినూత్న రైతు బంధు, రైతు బీమా పథకాలను ఆదర్శంగా తీసుకొని రైతుల క్షేమానికి నూతన వ్యూహాన్ని రచించి కేంద్ర బడ్జెట్‌లో పెట్టే అవకాశమున్నది. ఈ పథకానికి దాదాపు రూ. రెండు లక్షల కోట్లు కేటాయించవచ్చునని భావిస్తున్నారు. అలాగే ఆహార సబ్సిడీని భారీగా పెంచగలరని ఈ పెరుగుదల 20 శాతం వరకు ఉండగలదని అనుకుంటున్నారు. అన్నింటికంటే ముఖ్యంగా మధ్య తరగతిని ఆకట్టుకోడానికి ఆదాయ పన్ను వసూలుకు వర్తింపచేసే కనీస రాబడి పరిమితిని ఈసారి భారీగా సడలిస్తారనే ప్రచారం జరుగుతున్నది. ఈ పరిమితిని ప్రస్తుతమున్న రూ. 2.50 లక్షల నుంచి రూ. 5 లక్షలకు పెంచవచ్చని ఎదురు చూస్తున్నారు. కాని ఈ విషయంలో గత అనేక సంవత్సరాలుగా వెలువడిన ముందస్తు అంచనాలు, ఊహాగానాలేవీ వాస్తవ రూపం ధరించలేదు. ఒకటి, అర నామమాత్రపు రాయితీలిచ్చి కేంద్ర పాలకులు చేతులు దులుపుకున్నారు. కీలకమైన ఎన్నికల వేళ కాబట్టి ఈసారి ఆదాయపు పన్ను శ్లాబులో చెప్పుకోదగిన ఊరట ఉండగలదని ఆశిస్తున్నారు. అలాగే నిరుపేదలకు నెలవారీ చెల్లింపు పథకాన్ని ప్రకటించవచ్చుననే ఊహాగానం చక్కర్లు కొడుతున్నది. ఇటువంటి వాటికి అనుబంధంగా కొన్ని షరతులు, ఆ మేరకు వేరొకచోట ఇస్తున్న సాయాల ఉపసంహరణలు ఉండవచ్చు. సంక్షేమ పథకాల వ్యయాన్ని నెల వారీ నగదు చెల్లింపు విధానానికి మళ్లిస్తారని, పర్యవసానంగా రేషన్ సదుపాయం వంటివి మూతబడి పేదలకు నష్టమే జరగగలదనే విమర్శ కూడా ఉన్నది. ఏమైనప్పటికీ త్వరలో రానున్న కేంద్ర తాత్కాలిక బడ్జెట్ భిన్న వర్గాల ప్రజలను సంతోష పెట్టే ప్రయత్నం చేయగలదని ఎదురు చూద్దాం.

కాంగ్రెస్ ప్రియాంక కార్డు!

కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ తన సోదరి ప్రియాంక గాంధీని తూర్పు ఉత్తరప్రదేశ్ జనరల్ సెక్రటరీగా నియమించారు. ప్రధాని నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యనాథ్ వంటి ప్రముఖుల నియోజకవర్గాలన్నీ ఈ ప్రాంతంలోనే ఉన్నాయి. తన మిత్రుడు జ్యోతిరాదిత్య సింధియాను ఉత్తరప్రదేశ్ పశ్చిమ ప్రాంతం జనరల్ సెక్రటరీగా నియమించారు. వీరిద్దరు నలభైలలో ఉన్న నేతలు. ప్రియాంక గాంధీని రాజకీయాల్లోకి తీసుకురావడమంటే కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ అసమర్థ నాయకుడని ఒప్పుకున్నట్లే అంటూ సంబిత్ పాత్రా తదితర బిజెపి ప్రతినిధులు చెబుతున్న మాటలు బహుశా బిజెపికి నష్టం కలిగించవచ్చు. రాహుల్ గాంధీని పప్పుగా అవహేళన చేయడమే ఆయనకు కలిసి వచ్చిందా, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో ఆయన నాయకత్వంలోనే బిజెపిని కాంగ్రెస్ మట్టి కరిపించింది. చేసిన తప్పే మళ్ళీ బిజెపి చేస్తుందని చాలా మంది విశ్లేషిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీలో పార్టీ అంటే కుటుంబమే, అంతా కుటుంబ సభ్యులే మా పార్టీలో పార్టీయే కుటుంబం అంటూ మోడీ చెబుతున్న మాటలు కూడా అంతగా ఆకట్టుకునేవి కావు. ఎందుకంటే బిజెపిలో వారసత్వ రాజకీయాలు ఇప్పుడు ప్రజలకు కూడా బాగా తెలుసు.



మోడీ వారసత్వ రాజకీయాలపై తీవ్రమైన దాడి చేస్తుంటారు కాని బిజెపిలో వారసత్వ రాజకీయాల గురించి ఆయన మాట్లాడరు. బిజెపి సీనియర్ నాయకుడు యశ్వంత్ సిన్హా కుమారుడు జయంత్ సిన్హా ఇప్పుడు కేంద్రమంత్రి. హోంమంత్రి రాజ్ నాథ్ సింగ్ కుమారుడు పంకజ్ సింగ్ పార్లమెంటు సభ్యుడు. రాజస్థాన్ ముఖ్యమంత్రి వసుంధర రాజే కుమారుడు దుష్యంత్ సింగ్ లోక్ సభ సభ్యుడు. ఛత్తీస్ గఢ్ ముఖ్యమంత్రి రమణ్ సింగ్ కుమారుడు అభిషేక్ సింగ్ లోక్ సభ సభ్యుడు. దివంగత నాయకుడు ప్రమోద్ మహాజన్ కుమార్తె పూనం మహాజన్ లోక్ సభ సభ్యురాలు. కేంద్ర మంత్రి మేనకా గాంధీ కుమారుడు వరుణ్ గాంధీ లోక్ సభ సభ్యుడు. కేంద్రమంత్రి సుష్మా స్వరాజ్ సోదరి వందనా శర్మకు హర్యానాలో టిక్కట్టిచ్చారు. కాని ఆమె ఎన్నికల్లో ఓడిపోయింది. కర్నాటక మాజీ ముఖ్యమంత్రి యడ్యూరప్ప కుమారుడు రాఘవేంద్ర అక్కడ ఎమ్మెల్యే. సీనియర్ నాయకుడు లాల్జీ టాండన్ కుమారుడు అశుతోష్ ఎంఎల్ఎ. కేంద్రమంత్రి పీయూష్ గోయల్ వారసత్వంగా రాజకీయాల్లోకి వచ్చిన వాడే. ఆయన తండ్రి వేద ప్రకాష్ గోయల్. మధ్యప్రదేశ్ మంత్రి సురేంద్ర పట్వా, సీనియర్ నాయకుడు సుందర్ లాల్ పట్వా సోదరుడి కుమారుడు. బిజెపిలో ఇలాంటి పెద్ద జాబితా ఉంది. వారసత్వ రాజకీయాల గురించి విమర్శిస్తున్నప్పుడు ఈ జాబితాను బిజెపి మరిచిపోతుంటుంది.

చూపు

ప్రియాంక గాంధీ రాజకీయ ప్రవేశంపై బిజెపి విమర్శలు సంధిస్తున్నప్పటికీ మరోవైపు దాని మిత్రపక్షం శివసేన మాత్రం ప్రియాంక గాంధీ రావడం వల్ల కాంగ్రెసుకు లాభం కలుగుతుందని చెబుతుంది. ప్రియాంక గాంధీ కాంగ్రెసుకు ప్రచారం చేయడం ఇదే మొదటిసారి కాదు. 2014లో ఆమె ప్రచారంలో పాల్గొన్నారు. రాయబరేలీ, అమేథీల్లో ఆమె తప్పక ప్రచారం చేస్తుంటారు. అంతకు మించి ఆమె రాజకీయాల్లో చురుకుగా లేరు. ఇప్పుడామె పిల్లలు మిరయా, రైహాన్ ఇద్దరు టీనేజికి వచ్చారు. కాంగ్రెస్ కార్యకర్తలు భయ్యా జీ గా పిలుచుకునే ప్రియాంక గాంధీ ఇప్పుడు చురుకుగా పూర్తి స్థాయి రాజకీయాల్లోకి రావాలనే నిర్ణయం తీసుకున్నారు. ఇది బిజెపికి చేదు వార్త. బలమైన ఆకర్షణ శక్తి కలిగిన నేతగా ఆమెకు పేరుంది. మోడీకి పోటాపోటీగా ఆమె మాట తీరుతో ఆకట్టుకుంటారు. పైగా ఉక్కు మహిళగా పేరుపడిన నాయనమ్మ ఇందిరా గాంధీ పోలికలు ఆమెలో స్పష్టంగా కనిపిస్తాయి. ఇవన్నీ ఆమెకు ఉన్న సానుకూలాంశాలు. ప్రజలతో కలగలిసిపోతారు. ఆమె ఆగ్రహిస్తే అపరకాళీయే అన్న భయం కూడా కార్యకర్తల్లో ఉంది. అందువల్ల ఆమె చెప్పిన పని క్షణాల్లో జరిగిపోతుంది. 2014లో స్మృతి ఇరానీ ఇక్కడ బిజెపి ప్రచార బాధ్యత నిర్వహిస్తున్నప్పుడు ప్రియాంక మాటకు మాటగా ప్రచారంలో కాంగ్రెస్ ముందుండేలా చూశారు. 2008లో తన తండ్రి హంతకుడిని వెల్లూరు జైలుకు వెళ్ళి కలిసి వచ్చి సంచలనం సృష్టించారు.

ప్రియాంక 1989 నుంచి కాంగ్రెస్ కోసం ప్రచారం చేస్తున్నారు. అప్పుడు అమేథీలో ప్రచారం చేశారు. 1991లో తల్లి సోనియాతో పాటు రాజీవ్ గాంధీ కోసం ప్రచారం చేశారు. 1999లో మరోసారి ఆమె ప్రచార బాధ్యతలు నిర్వర్తించారు. అప్పుడు సోనియాగాంధీ బళ్ళారి, అమేథీ రెండు చోట్ల నుంచి పోటీ చేశారు. అప్పుడు కేంద్రంలో, రాష్ట్రంలో రెండు చోట్ల బిజెపి ప్రభుత్వం ఉంది. కఠినమైన పరిస్థితుల్లో అలుపెరుగక ప్రచారం నిర్వహించిందామె. ఆ ఎన్నికల్లో సోనియా గాంధీ మూడు లక్షల మెజారిటీతో గెలిచారు. ప్రియాంక గాంధీకి ఉన్న బలమైన ప్రజాకర్షణ గురించి బిజెపికి బాగా తెలుసు. అందువల్లనే ఇప్పుడు పార్టీలో కలవరం మొదలైంది.

ఇప్పుడు కాంగ్రెస్ ఉత్తరప్రదేశ్‌లో మరోసారి పూర్వవైభవం సాధించడానికి ప్రయత్నిస్తోంది. ప్రియాంక గాంధీ, జ్యోతిరాదిత్య సింధియా వంటి యువనేతలు రావడం వల్ల కొత్త ఉత్సాహం వచ్చింది. ఉత్తరప్రదేశ్‌లో మొత్తం 80 లోక్ సభ స్థానాలున్నాయి. రాష్ట్రంలో ఇప్పుడు కాంగ్రెసుకు సంస్థాగత బలం లేదు. పార్టీ నిర్మాణం బలహీనంగా ఉంది. పైగా ఇప్పుడు బిఎస్‌పి, ఎస్‌పి కూటమి రంగంలో ఉన్నందువల్ల ముస్లిం ఓట్లు ఆ కూటమికి పడతాయని అందరూ అనుకుంటున్నారు. ఇప్పుడు బలమైన నేతగా ప్రియాంక గాంధీ రంగంలో ఉంటే ముస్లిం ఓట్లు చీలిపోతాయమో అన్న భయాలు కూడా ఉన్నాయి. 2017 ఎన్నికల్లో బిజెపి 39.47 ఓట్ల శాతంతో గెలిచింది. కాంగ్రెసుకు కేవలం 6.2శాతం ఓట్లు లభించాయి. లోక్ సభ ఎన్నికల్లో కూడా కాంగ్రెసు ఓట్ల శాతం 7.50 మాత్రమే.

వారసత్వ రాజకీయాలే అయినా ప్రియాంక గాంధీ తనకు సురక్షితమైన నియోజకవర్గంలో నామినేషను వేసి గెలిచి రాజకీయాల్లోకి రావడం లేదు. అత్యంత కఠినమైన యుద్ధ రంగంలో ప్రవేశించిందంటే తప్పులేదు. గత ఎన్నికల్లో కాంగ్రెస్‌తో అఖిలేష్ యాదవ్ చేతులు కలిపి పోటీ చేశారు. కాని ఈ కూటమి ఓటమి పాలైంది. ఇప్పుడు అఖిలేష్ యాదవ్ మాయావతి కూటమి పోటీ చేస్తోంది. ఈ కూటమిలో కాంగ్రెస్ లేదు. కాని కాంగ్రెస్ విషయంలో కూటమి మెతకగా వ్యవహరిస్తుందని, స్నేహ పూర్వక పోటీ మాత్రమే ఉండవచ్చని చాలా మంది విశ్లేషిస్తున్నారు. కాంగ్రెస్ లోపాయికారీ ఒప్పందం ద్వారా బహుశా 60 వరకు స్థానాల్లో అభ్యర్థులను పోటీకి దించవచ్చు. ఇందులో చాలా చోట్ల బిజెపి ఓట్లకు గండికొట్టడమే అసలు వ్యూహమని, అందుకు బదులుగా కొన్ని స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు గెలిచేలా కూటమి సహకరిస్తుందన్న విశ్లేషణలు కూడా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రియాంక గాంధీ ప్రవేశం వల్ల చాలా చోట్ల బిజెపికి పోలయ్యే అగ్రవర్ణాల ఓట్లకు కాంగ్రెస్ గండికొట్టడం ఖాయమంటున్నారు వ్యాఖ్యాతలు. ఏది ఏమైనా ప్రియాంక గాంధీ రాజకీయ ప్రవేశం వల్ల జాతీయ రాజకీయాలు కొత్త మలుపు తిరుగుతాయనవచ్చు.

✻ జి. గోపాలకృష్ణ

యాగఫల సిద్ధిరస్తు!



ఇలపావులూరి
మురళీమోహన రావు
8143318849

తన రాజ్యంలో జీవించే ప్రజలందరూ సుఖశాంతులతో బతకాలని, నెలకు మూడు వానలు పడి, మొత్తం సుభిక్షంగా వెలగాలని, పూర్వకాలంలో రాజులు, మహారాజులు, చక్రవర్తులు యజ్ఞయాగాలు చేసేవారని మనం చరిత్రలో, పురాణాల్లో చదువుకున్నాము. వారు ఏమి చేసినా, అది లోక కళ్యాణం కోసమే తప్ప స్వార్ధంతో కాదు. తమ ప్రాబల్యాన్ని, రాజ్యవిస్తరణను కోరుకుంటూ అశ్వమేధయాగం, రాజ్యాలను జయించిన తరువాత రాజసూయ యాగం, పుత్రులను కోరుకుంటూ పుత్రకామేష్ఠి యాగం చేయబడ్డాయని రామాయణ మహాభారతాల్లో మనకు అనేక ఉదంతాలు కనిపిస్తాయి.

రాజ్యాలు, రాజులు అంతరించాయి. ప్రస్తుతం మనం ప్రజాస్వామ్య యుగంలో జీవిస్తున్నాము. నాటి రాజుల స్థానంలో ప్రజాప్రతినిధులు వచ్చారు. తమను ఎన్నుకున్న ప్రజలకు మేలు చెయ్యడం, ప్రజాభీష్టం మేరకు పరిపాలన చెయ్యడం, శాంతి భద్రతలు కాపాడటం, ఒక్కోసారి ప్రకృతి కరుణించకపోయినా, ప్రజలకు ఇక్కట్లు రాకుండా చూడటం, తమ పాలనాదక్షతతో ప్రజాభిమానాన్ని చూరగొనడం వీరి బాధ్యత. అయితే, మనం ఎంత చక్కగా పాలించినా, ఎన్ని సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసినా, ఎంత అభివృద్ధి చేసినా, ఇంకా ఇంకా ఏదో ఏదో చెయ్యాలని తపన ఉంటుంది కొందరు పాలకులకు. అందుకే దైవానుగ్రహం కూడా మనకు తోడ్పడాలని కాంక్షిస్తుంటారు. అలాంటివారిలో అగ్రగణ్యులు తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు.

స్వతహాగా అపారమైన దైవభక్తి కలిగిన కెసిఆర్ గతంలో ఒకసారి అయుత చండీయాగాన్ని దిగ్విజయంగా నిర్వహించారు. దేశంలో అధికారంలో ఉన్న ఒక ముఖ్యమంత్రి అలాంటి యాగాన్ని నిర్వహించడం అదే ప్రథమం. రాష్ట్ర, జాతీయస్థాయిల్లో అనేకమంది ప్రముఖులు ఆ యాగానికి హాజరయ్యారు. ఆ యాగ ఫలితం కావచ్చు...కాకపోవచ్చు .. తెలంగాణ అనేకరంగాల్లో ఎన్నదగిన అభివృద్ధిని సాధించి దేశాన్ని ఆశ్చర్యంలో ముంచెత్తింది. కెసిఆర్ తలపెట్టిన ప్రాజెక్టులు నిర్విఘ్నంగా సాగిపోతున్నాయి. చెప్పుకోదగిన స్థాయిలో వర్షాలు కురవకపోయినా, నీటి సంపదతో తెలంగాణ మొత్తం కళకళలాడింది. సేద్యం పెరిగింది. దిగుబడులు 2014 కు ముందుతో పోలిస్తే గణనీయంగా పెరిగాయి. రైతులందరూ ఆనందంగా ఉన్నారు. అంతకన్నా ఏమి కావాలి?

ఆ తరువాత మళ్ళీ రాజశ్యామల యాగాన్ని విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర స్వామిజీ వారి ఆధ్వర్యంలో కెసిఆర్ నిర్వహించారు. ఎన్ని యాగాలు చేసినా, అవి ముఖ్యమంత్రి వ్యక్తిగతంగానే చేస్తున్నారు. అధికార దుర్వినియోగం చేయడం లేదు. యాగానికయ్యే ఖర్చంతా కెసిఆర్ తన జేబులోనుంచే భరిస్తున్నారు. ప్రజల మీద నయాపైసా భారం మోపడం లేదు. పొరుగు రాష్ట్ర ముఖ్యమంత్రి దుబారా ఖర్చును చూస్తున్నాము. గతేడాది ఆయన కుటుంబం మంచినీళ్లు తాగడానికి అయిన ఖర్చు అక్షరాలా మూడున్నర లక్షల రూపాయలు. అదంతా ప్రభుత్వ ఖజానా నుంచే చెల్లించారు. అధికార దుర్వినియోగం ఆ స్థాయిలో జరుగుతుండటం చూసి ప్రజలు ఛీత్కరించుకుంటున్నారు. మరి కెసిఆర్ తన డబ్బు తాను ఖర్చు పెట్టుకుని ప్రజలకోసం యాగాలు యజ్ఞాలు చేసుకుంటే ఎవరికి నష్టం?



ప్రజలలో ఆధ్యాత్మిక భావాలు పెరిగితే అంతిమంగా అది రాష్ట్రాభివృద్ధికి అనేక విధాలుగా తోడ్పడుతుంది. ఆ సత్యం గ్రహించినవారు కాబట్టే కెసిఆర్ అధికారంలోకి రాగానే రాష్ట్రంలోని దేవాలయాలకు పూర్వ వైభవాన్ని తేవడానికి నడుము బిగించారు.

పురాణ ప్రాశస్త్యం కూడా కలిగిన యాదగిరి గుట్ట దేవాలయాన్ని అయిదువందల కోట్ల రూపాయలతో మరో తిరుమల వలె తీర్చి దిద్దారు. అయిదేళ్లక్రితం యాదగిరిగుట్టకు, నేటి యాదగిరిగుట్టకు శతసహస్రం తేడా కనిపిస్తుంది. దేవాలయాన్ని శిల్పకళాసంపదతో మెరిపింపజెయ్యడంతో భక్తులు విపరీతంగా పెరిగారు. ఒకప్పుడు పది నిముషాల్లో దైవ దర్శనం అయిపోయేది. కానీ, లక్షలమంది భక్తులు పోటెత్తుతుండటంతో నేడు దర్శనానికి సాధారణ దినాల్లో కూడా రెండు గంటలు, వారాంతంలో మూడు నుంచి అయిదు గంటలు పడుతున్నది. తత్ఫలితంగా దేవాలయానికి ఆదాయం ఊహించనంతగా పెరిగింది. చిరు వ్యాపారాలు చేసుకునేవారి ఆదాయం వృద్ధి చెందింది. భక్తులు సమర్పించే కానుకలతో సత్కార్యాలు చెయ్యడానికి దేవాలయానికి అవకాశం లభించింది. అంతకన్నా ఏమి కావలి? అలాగే అతి పురాతనమైన అనంతగిరిలోని పద్మనాభస్వామివారి దేవాలయాన్ని కూడా అద్భుతంగా అభివృద్ధి చేశారు. ఇంకా రాష్ట్రంలోని అనేక దేవాలయాలకు మహర్దశ పట్టింది అంటే అందుకు కారణం కెసిఆర్‌కు ఉన్న దైవభక్తి మాత్రమే. స్వాములకు, గురువులకు తన హోదా కూడా మరచి సాష్టాంగప్రమాణాలు ఆచరించడానికి ఆయన ఏమాత్రం సంకోచించరు. ఆ వినయవిధేయతలు, పెద్దలకు ఇచ్చే గౌరవాలు కెసిఆర్‌ను ఉన్నత స్థానాల్లో సుస్థిరం చేస్తున్నది. ఆయన చేత మరిన్ని ప్రజాహిత కార్యక్రమాలను చేయిస్తున్నది. దీనిఫలితంగా లాభపడేది తెలంగాణ ప్రజలు మాత్రమే తప్ప ఆయన కాదు అని గ్రహించాలి.

ఇక మళ్ళీ కెసిఆర్ సహస్ర మహా చండీయాగాన్ని ఐదురోజుల పాటు అనితరసాధ్యంగా నిర్వహిస్తున్నారు. ఎర్రవల్లిలోని తన వ్యవసాయక్షేత్రంలో సాధారణ ప్రజలకు ఏమాత్రం ఇబ్బంది లేకుండా మూడు వందలమంది వేదపండితులు, ఋత్విజులతో నిరాటంకంగా జరుపుతున్న ఈ యాగం కేవలం లోకకల్యాణం కోసమే అని కెసిఆర్ వినమ్రంగా ప్రకటించారు. తాను కలలుకన్న బంగారు తెలంగాణ కోసం ప్రకృతి, దేవతల ఆశీస్సులను కోరుతూ ఐదురోజులపాటు పరమనిష్ఠగా కెసిఆర్ సతీసమేతంగా ఈ చండీయాగంలో పాల్గొని స్వరూపానందేంద్ర స్వామిజీ ఆధ్వర్యంలో యజ్ఞాన్ని ఆచరించారు. మూడు వందలమంది బ్రాహ్మణోత్తములకు భూరి సంభావనలను ఇచ్చి సత్కరించారు. ఆహూతులకు భోజన వితరణ చేశారు. గోమాతలను పూజించారు. అయిదు రోజులపాటు ఋత్విక్కుల వేదఘోషతో ఎర్రవల్లి పరిసర ప్రాంతాలు మార్మోగాయి. హవిస్సులు అందుకోవడానికి దేవతలే దిగివచ్చారా అన్నంత భక్తిభావంతో జరిగిన సహస్ర మహా చండీయాగం కెసిఆర్ నైర్మల్యానికి అద్దం పట్టింది.

కొందరు అవివేకులు కెసిఆర్ యాగాలపట్ల సంకుచిత భావంతో విమర్శలు చేశారు. కెసిఆర్‌కు ఏమి తక్కువ? ఆయనకేమైనా ఆస్తిపాస్తులకు లోటు ఉన్నదా? నిన్ననే కదా ప్రజలు భారీ మెజారిటీతో ఆయనకు పునఃపట్టాభిషేకాన్ని చేశారు? కొత్తగా ఆయనకు ఇంకా పదవులు ఏమి కావాలి? ఏమి స్వార్ధం ఉంది దానిలో? యాగాల వలన పదవులు వచ్చేట్లయితే ప్రతివారూ యాగాలు చేయలేరా? దేశంలో లక్షల కోట్ల రూపాయల అధిపతులు ఉన్నారు. పదవులు వస్తాయంటే వారు కెసిఆర్ కంటే వెయ్యిరెట్లు అంగరంగ వైభవంగా యజ్ఞాలు చేయలేరా? కెసిఆర్ వ్యక్తిగత విశ్వాసాలను హేళన చేసి శునకానందం పొందటం తప్ప మరేమైనా ఉందా? హైందవం గూర్చి ఊకదంపుడు ఉపన్యాసాలు దంచే పెద్దమనుషుల కంటే, అసలైన హైందవాన్ని ఆచరిస్తూ, ప్రజాక్షేమాన్ని కాంక్షించే కెసిఆర్ వెయ్యిరెట్లు నయం కదా!

ఎవరేమనుకున్నా కెసిఆర్ సంకల్పబలం గొప్పది. అందుకే ఆయన ఎన్ని ఆటంకాలు ఎదురైనా, ఎవరెంతగా విమర్శించినా, గజరాజు వెళ్తున్నప్పుడు కుక్కలు మొరగడం సహజమే అని సామెత చెప్పినట్లు భావించి ప్రతివిమర్శలు చెయ్యడం లేదు. తన మనసు చెప్పిన పని చేసుకుని వెళ్తున్నారు. అందుకే అప్రతిహతంగా విజయాలు ఆయనకు సొంతం అవుతున్నాయి. ఏమాత్రం టెన్షన్ పడకుండా ఒక రాష్ట్రాన్ని పరిపాలిస్తున్న ముఖ్యమంత్రి నాకు తెలిసి దేశంలో కెసిఆర్ ఒక్కరే. ఆయన పాలనాదక్షుడే కాదు...యాగదక్షుడు, సంకల్పదక్షుడు, దీక్షాదక్షుడు కూడా. చండీయాగం ఫలితాలు తెలంగాణ రాష్ట్రానికే కాదు, దేశం మొత్తం అనుభవించాలని కోరుకుంటున్నాను. లోక కళ్యాణం అంటే ప్రపంచం మొత్తం సుఖంగా ఉండటం అని అర్థం... కెసిఆర్ మానసిక సంకల్పం అదే.

ఈ పేజీకి రచనలు పంపవలసిన మెయిల్ : editor@manatelangana.org

నిర్బంధ ఓటు వినియోగ బాధ్యత!

ఎడిటర్‌కు లేఖలు

రాజకీయ ప్రజాస్వామ్యం సామాన్యులకు అందకపోతే బాధితులు ఈ రాజ్యాంగ వ్యవస్థను కూల్చేస్తారని నవంబర్ 26, 1949న భారత రాజ్యాంగాన్ని పార్లమెంట్‌కు సమర్పిస్తూ అంబేద్కర్ హెచ్చరించారు. ఎన్నికల ప్రక్రియను విజయవంతంగా కొనసాగించడంలో పౌరసమాజం పాత్ర గణనీయమైనది. ప్రజాస్వామ్య దేశమైన భారతదేశంలో ప్రజలే పరిపాలకులు. మనం వేసే ఓటు మన భవిష్యత్తు, రాబోయే తరాల మనుగడ నిర్ణయిస్తాయి. మన దేశంలో ఓటింగ్ రోజును చాలామంది కేవలం సెలవు దినంగా మాత్రమే చూస్తారు. ఓటు ప్రాముఖ్యతను గురించి ఎంతమంది ఎన్ని రకాలుగా ప్రచారం చేపట్టినా పట్టించుకునే నాథులు మనదేశంలో చాలా అరుదు. మన భారతదేశంలో ఓటు వేయడం తప్పనిసరి కాదు. అందుకే ఇప్పటివరకు మన దేశంలో 60 శాతం మించి పోలింగ్ జరగలేదు. మన దేశంలో ఓటును తప్పని సరి చేయాలంటూ కొంతమంది ప్రజాస్వామ్యవాదులు బలంగా డిమాండ్ చేస్తున్నారు. ఇటు ఎన్నికల సంఘం కూడా ఓటు హక్కుపై అందరూ బాధ్యతగా వ్యవహరించాలని ప్రచారం చేస్తుంది. గంటలు గంటలు క్యూ లైన్లలో నిలబడి తీరా మన వంతు వచ్చేసరికి నీకు ఓటు లేదు, నీ ఓటు ఎవరో వేసి వెళ్ళారు అనే మాటలు తరచూ వింటుంటాము. అలాగే కొన్ని చోట్ల గుండగుత్తగా కొందరి ఓట్లు తొలగిస్తున్నారు . వీటి వల్ల ఎన్నికలంటే సామాన్య జనాలకు కొంత నిర్లిప్తత ఏర్పడడం సహజం. ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్క పౌరుడు తప్పని సరిగా ఓటు హక్కు వినియోగించుకోనేలా తప్పని సరి చట్టం తీసుకొని రావాలి. నిలబడ్డ అభ్యర్థులు నచ్చక పోతే నోటా ఎలాగూ ఉంది. కాబట్టి ఖచ్చితంగా ఓటు హక్కు వినియోగించేలా ప్రతి పౌరున్ని మేల్కొనేలా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్, ప్రభుత్వ పెద్దలు చూడాలి. అపుడే మన దేశంలో ప్రజాస్వామ్యం విజయవంతమైనట్లు.

– కాళంరాజు వేణుగోపాల్
8106204412

ఓటు ఆయుధంతోనే పోరాటం

ఓటు అనేది ఓటర్లకు గొప్ప ఆయుధం. అలాంటి ఆయుధాన్ని డబ్బుకు, మద్యానికి, అవినీతికి తాకట్టు పెట్టకుండా ఈ సమాజానికి ఉపయోగపడేలా ఉండాలి. అడవిలో ఆయుధాలు పట్టి పోరాడే కాలం మారింది. సాయుధ పోరాటం చేసే సమయం కాదు. ఓటు అనే ఆయుధంతో జనారణ్యంలో జంగ్‌సైరన్ ఊదే సమయం వచ్చింది. ప్రజాస్వామ్యానికి మూలం ఓటు, ప్రజాస్వామ్యానికి పునాది ఓటు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోడానికి ఓటు ఒక వజ్రాయుధం. నాయకుల రాతను మార్చే అస్త్రం ఓటు. సరైనోడు లేకుంటే ఉపయోగించే ఆయుధం నోటా. నోటుకు ఓటెయ్య వద్దు. ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటును సద్వినియోగం చేసుకున్నప్పుడే నేతను నిలదీయగలరు. అభ్యర్థి ఏ పార్టీ వాడని కాదు ఏపాటివాడో చూడాలి. ఎన్నుకుంటే వెలగబెట్టడం కాదు ఇప్పటి దాక ఏం చేశాడో చూడాలి. బ్రతకటానికి రాజకీయాల్లోకి రావద్దు బ్రతుకులను మార్చడానికి రాజకీయాల్లోకి రండి అని ఓటుతో చెప్పాలి. రాజకీయాలు ఉద్యోగం కాదు ఒక సామాజిక బాధ్యత అని ఓటుతో చాటాలి. ఓటర్లు దేశ ప్రగతిని మార్చే షూటర్లు. మంచి చెడులు ఆలోచన చేయకుండా ఓటు వేసి అవినీతిలేని సమాజం కావాలంటే ఎక్కడి నుండి వస్తుంది? అందుకే మన చేతిలో ఉన్న అత్యంత శక్తివంతమైన ఆయుధం ఓటు. 18 సంవత్సరాలు నిండినవారు మొదలు ప్రతి ఒక్కకరు ఓటు హక్కు నమోదు చేసుకొని తప్పక ఓటు వేయాలి. వేయించాలి. నిజాయితీపరులు, సేవ చేయాలనే తపన, నియోజకవర్గ సమస్యలపై అవగాహన, ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వారి భవితకు, భవిష్యత్‌కు భద్రత కల్పించేవారిని ఎన్నుకోవాలి. సమ సమాజ సామాజిక న్యాయం కోసం, నిర్మాణం కోసం కృషి చేయాలి.

– వూకే రామకృష్ణ దొర
9866073866

సకుటుంబం





మూడ్‌ను నియంత్రిద్దాం..!

ఒక చిన్న చిరునవ్వు మన చుట్టూ నవ్వుల వర్షం కురిపిస్తుంది. ఒక మంచి మాట అద్భుతమైన స్నేహ సంబంధాలను దగ్గర చేస్తుంది. మనం కొంచెం దేన్నయినా ఇవ్వగలిగితే చుట్టూ వంద చేతులు మన కోసం ఏమైనా ఇచ్చేందుకు సిద్ధంగా ఉంటాయి. కానీ ఇన్ని మంచి పనులు చేసేందుకు కొన్నిసార్లు మూడ్ సహకరించకుండా విసిగిస్తుంది. ఎన్నో కారణాలతో, వర్క్ టెన్షన్లతో అలసటతో స్తబ్ధుగా అయిపోతూ ఉంటాము. మరెలా ఇందులోంచి బయట పడటం? ఉత్సాహం తెచ్చుకోవడం ఎలా?

మంచి ఆహార పదార్థాలు మూడ్‌ని నియంత్రిస్తాయని చెబుతున్నారు నిపుణులు. స్తబ్ధుగా ఉన్నట్లు అనిపిస్తే కాస్త చక్కెర మూడ్‌ని సరిచేయగలుగుతుంది. రక్తంలో చక్కెర శాతం పెరిగి ఉత్సాహం వస్తుంది. అయితే ఇది తాత్కాలికం. శరీరం మనసు ఉత్తేజం పుంజుకునేందుకు అవసరమైన ఆహారం తీసుకునేలోపు చాక్లెట్ తీసుకోవచ్చు. మానసిక వత్తిడికి గురికావడం ఇవాల్టి వేగంతో కూడిన జీవన విధానంలో సర్వసాధారణం. అందుకే బాగా వత్తిడిగా అనిపిస్తే మూడ్ కంట్రోల్‌లోకి తెచ్చుకోవడం కోసం బేగ్‌లో ఒక డార్క్ చాక్లెట్‌ను సిద్ధంగా ఉంచుకోవాలి. పంచదార హాని చేస్తుంది. కానీ డార్క్ చాక్లెట్ వల్ల వత్తిడిని కలిగించే హార్మోన్లు తగ్గిపోయి శరీరం మనసు ఉత్తేజం పొందుతాయి.

ఒక్కోసారి ఆఫీస్ పని ఇంటికి కూడా మనతోపాటు వచ్చేస్తూ ఉంటుంది. తీరిక లేని శ్రమ చిరాకు పెడుతూ ఉంటుంది. ఒక కప్పు గ్రీన్ టీ తో మనసు కుదుట పడుతుంది. గ్రీన్‌టీలో ఉండే థియామిన్ మనసుని శాంతపరిచి కేంద్రీకరణకు దోహదం చేస్తుంది. గ్రీన్‌టీలో కెఫీన్ చాలా తక్కువ కనుక శరీరానికి కలిగే హాని కూడా ఏమీ ఉండదు. మానసిక ఉపశమనానికి ఇవన్నీ ఉపయోగపడితే దీర్ఘకాల సంతోషానికి విటమిన్ డి ఎంతైనా ఉపయోగం. మానసిక ఉల్లాసాన్ని కలిగించే సెరోటిక్ హార్మోన్ ప్రశాంతతను , ఆనందాన్ని కలిగిస్తుంది.

తక్కువ ఫ్యాట్ ఉన్న పాలలో ఓట్స్ కలుపుకొని తినాలి. స్ట్రాబెర్రీస్ కూడా మంచి ఫలితాన్ని ఇస్తాయి. కాయధాన్యాల్లో లభించే విటమిన్ డి మనోవ్యాకులతను తగ్గిస్తుంది. ఉడికించిన సాల్మన్, లేదా సార్డిక్ చేపలు, ముడి గోధుమ బ్రెడ్ తినడం వల్ల కూడా మనసు వేగంగా ఉత్తేజం చెందుతుంది.

మనసు మొద్దు బారినట్లు ,నీరసంతో కళ్లు మూతలు పడుతూ ఉంటే ఒక కప్పు కాఫీ, ఆకుపచ్చని ఆకుకూరల సలాడ్, ఆకుకూరల శాండ్ విచ్ తీసుకున్నట్లయితే మూడ్ సరై, మనకు ఉత్సాహంగా ఉంటుంది.

బంగాళా దుంపలు , బాఠాణీ, పుట్టగొడుగులు కూడా శరీరానికి అవసరమైన పోషకాలను అందించి ఉత్సాహం నిండేలా చేస్తాయి. క్రీమ్, పాస్తా, కేండీబార్ తిన్నవెంటనే మూడ్ మెరుగవుతుంది. ప్రపంచవ్యాప్తంగా ఈ విధానం పాటిస్తారు. అధిక కార్బోహైడ్రేట్‌లుండే తియ్యని పదార్థాలతో మనసు వెంటనే ఉత్సాహం తెచ్చుకుంటుంది. మంచి ఆహార ప్రణాళికతో మూడ్స్‌ను మన కంట్రోల్‌లో ఉంచుకోవచ్చు.





చిట్కాలు

* కొబ్బరి ముక్కను పెరుగులో వేస్తే తొందరగా పాడవదు.
* బిస్కెట్ ప్యాకెట్లను బియ్యం డబ్బాలో ఉంచితే మెత్తబడవు.
* బ్రెడ్ ప్యాకెట్లో ఆలుగడ్డ ఉంచితే బ్రెడ్ తొందరగా పాడవదు.
* పండిన టొమోటాలను ఉప్ప నీళ్లలో వేస్తే పగిలిపోవు.
* కారంపొడి డబ్బాలో చిన్న ఇంగువ ముక్క ఉంచితే పురుగు పట్టదు.
* కూరగాయ ముక్కల్ని పసుపు నీటిలో ఉంచితే క్రిములు నశిస్తాయి.



మిమ్మల్నే అనుకరిస్తారు..!

పిల్లలకు తల్లిదండ్రులే మొదటి గురువులు. క్రమశిక్షణ మొదలు, కొన్ని నియమాలు పాటించడం.. ఇలా ప్రతిదీ తల్లిదండ్రుల నుంచే పిల్లలు చూసి నేర్చుకుంటారు. అందుకే వాళ్లు పెరిగే వయసులో.. పెద్దవాళ్లు చేయకూడని పనులు కొన్ని ఉంటాయంటారు. అవేంటంటే...

మనం వేసుకునే దుస్తులూ, చేసుకునే అలంకరణను బట్టి మన ఆత్మవిశ్వాసం ఆధారపడి ఉంటుందనేది పిల్లలకు తెలియకుండానే అందిస్తుంటాం చాలా సందర్భాల్లో. ఎలాగంటే.. మనల్ని మనం చూసుకుని 'ఇవాళ అస్సలు బాగాలేను.. ఈ డ్రెస్ లేదా చీర నాకు నప్పలేదు, బాగా లావైపోతున్నాను..' అని మనల్ని మనం అనుకుంటుంటే పిల్లలు ముఖ్యంగా అమ్మాయిలు గమనిస్తారు. దాంతో ఆకట్టుకునేలా కనిపించడం తప్పనిసరి అని అనుకుంటారు. అలా భావించడమే కాదు, ఎదిగేకొద్దీ డైటింగ్, ఫ్యాషన్లకు ఎక్కువగా ప్రభావితమయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.

కంప్యూటరు లేదా టీవీ ముందు ఎక్కువసేపు గడిపే పిల్లలు నిద్రలేమితో బాధపడటంతో పాటూ చదువుల్లోనూ వెనుకబడి ఉంటారనీ, బరువూ పెరుగుతారని ఎన్నో అధ్యయనాలు తేల్చాయి. అందుకే ముందుగా మీరు ఆ పని చేయొద్దు. కుటుంబం అంతా కలిసి ఉన్నప్పుడూ, కలిసి భోజనం చేస్తున్నప్పుడు టీవీ చూడటం, ల్యాప్‌టాప్‌ని పక్కన పెట్టుకోవడం వంటివాటికి దూరంగా ఉండండి. పిల్లలకూ ఆ విధంగా జాగ్రత్త చెప్పండి.



ఆలూ రసంతో మచ్చలు మాయం!



మహిళలు తమ చర్మ సౌందర్యాన్ని మెరుగు పరుచుకునేందుకు, చర్మం కాంతివంతంగా, మృదువుగా కనిపించేందుకు అనేక రకాల క్రీములు, పౌడర్లు, సబ్బులు వాడుతుంటారు. అయితే అవి అందరికీ పడవు. రసాయనాలతో తయారు చేసినందున వాటిని వాడితే చర్మానికి మేలు జరగకపోగా కొన్ని సార్లు చర్మం వాపులకు లోనై దద్దుర్లు, దురదలు వచ్చి, ఇన్‌ఫెక్షన్ బారిన పడేందుకు అవకాశం ఉంటుంది. కనుక ఆ ఇబ్బందులు ఎదురవ్వకుండా సహజ సిద్ధమైన పద్ధతిలోనే చర్మ సౌందర్యాన్ని పొందాలంటే అందుకు ఏం చేయాలో తెలుసుకుందాం.

మంచి గంధం చర్మాన్ని మెరిసేలా చేస్తుంది. కొద్దిగా గంధం పొడి తీసుకుని అందులో కొన్ని చుక్కల నిమ్మరసం, కీరదోస రసం, టమాటా రసం కలిపి దాన్ని పేస్ట్‌లా చేసి ముఖానికి రాయాలి. ఆరిపోయిన తర్వాత గోరు వెచ్చని నీటితో ముఖాన్ని శుభ్రం చేస్తేసరి. ఇలా తరచూ చేస్తే ముఖం కాంతిని సంతరించుకుంటుంది.

పాలపొడి, నిమ్మరసం, తేనెలను ఒక్కొక్కటి 15 ఎంఎల్ చొప్పున తీసుకుని ఒక పాత్రలో వాటిని వేసి బాగా కలపాలి. ఆ మిశ్రమానికి అర టేబుల్ స్పూన్ బాదం నూనె కలిపి పేస్టులా చేసి ముఖానికి పట్టించాలి. 10 నిమిషాల పాటు ఆగాక చల్లని నీటితో ముఖాన్ని కడగాలి. దీంతో మంచి నిగారింపు వస్తుంది.

నాలుగు లేదా ఐదు బాదం పప్పును రాత్రంతా నీటిలో నానబెట్టాలి. పై పొట్టు తీసి వాటిని పేస్ట్‌లా చేసుకోవాలి. ఆ పేస్ట్‌కు కొద్దిగా తేనె కలిపి ముఖానికి రాయాలి. బాగా ఆరాక నీటితో కడగాలి. ఇలా తరచూ చేస్తే ముఖ సౌందర్యం పెరుగుతుంది.పెరుగు, నారింజ రసం సమాన భాగాల్లో తీసుకుని బాగా కలిపి ఆ మిశ్రమాన్ని ముఖానికి రాయాలి. లేదా తేనెనిమ్మ రసం, కీరదోసనిమ్మరసం కాంబినేషన్లను కూడా ట్రై చేయవచ్చు. వాటిని రాసి కొద్ది సేపు ఆగాక కడిగేయాలి. ఇలా తరచూ చేస్తే ముఖం కాంతిని సంతరించుకుంటుంది.ఆలుగడ్డలను పొట్టు తీసి వాటిని జ్యూస్‌లా పట్టి ఆ మిశ్రమాన్ని ముఖానికి రాయాలి. ఇలా చేయడం వల్ల ముఖంపై ఉండే మచ్చలు పోతాయి.

ఇంటి అందం పెంచండి

ఇంట్లోని గదులన్నీ కళకళలాడుతూ కనిపించాలని ఏవేవో అలంకరణల పద్ధతులన్నీ పాటిస్తాం. కానీ బాల్కనీపై మాత్రం ఏదో అశ్రద్ధ. కొందరైతే ఆ ప్రదేశాన్ని బట్టలు ఆరేసేందుకో లేక పాత వస్తువులన్నీ ఉంచేందుకో ఉపయోగిస్తుంటారు. కొంచెం దృష్టిపెట్టగలిగితే.. బాల్కనీని ఇంట్లో మీకు నచ్చిన ప్రదేశంగా మార్చే యొచ్చు. అదెలాగంటే..బాల్కనీ ప్రదేశం స్థలం తక్కువగా ఉందను కున్నప్పుడు గ్రిల్‌కి మధ్యలో చిన్న చెక్కను అమర్చితే స్థలం ఆక్రమించ కుండానే మీకో టీపాయ్ సిద్ధమవుతుంది. కాస్త పెద్దదయితే చిన్నగా ఉండే పాత ఫర్నిచర్‌కు మెరుగులు దిద్దుకుని బాల్కనీలో పెట్టుకోవడం వల్ల కూడా కొత్తదనం వస్తుంది.

* నిజానికి పూల మొక్కలు ఏ ప్రదేశానికైనా కొత్త వన్నెను తీసుకువస్తాయి. అందమైన లతలు, వేలాడే కుండీలు, ఆకర్షణీయమైన ఆకులు కలిగిన మొక్కలు ఉండేలా ఏర్పాటుచేసుకోవాలి. ప్రదేశం తక్కువైనా సరే! గోడకు అమర్చుకునేందుకు వీలుగా చెక్కతో ఫ్రేమ్ చేయిస్తే సరి. బాల్కనీ గ్రిల్స్‌కూ పూల కుండీలను అమర్చుకోవచ్చు. దానిపై చిన్నా, పెద్దా కుండీలను ఓ క్రమపద్ధతిలో పెట్టుకుంటే సరి.
* చక్కటి చెక్క, టెర్రకోట, ఇత్తడి, రాగి పాత్రలనూ అలంకరణ వస్తువులుగా అందంగా బాల్కనీల్లో ఉపయోగించుకోవచ్చు. వెడల్పాటి పాత్రల్లో నీళ్లుపోసి పూలను పరిస్తే అందంగానూ కనిపిస్తాయి. బాల్కనీ ఇందుకు తగిన స్థలమే. బాల్కనీనే కదా! అనుకుని ఏదో ఒక రంగులే అనుకోవద్దు.



చేపా.. చేపా నిన్నెందుకు తినట్లేదు!

● రాష్ట్రంలో సగటున 5కిలోలే వినియోగం ● డబ్ల్యుహెచ్ఒ ప్రకారం 13కిలోలు తినాలి ● వినియోగం పెంచేందుకు ఫిబ్రవరి 1నుంచి 3వరకు ఫిష్ ఫెస్టివల్

మన తెలంగాణ/హైదరాబాద్ : అటు దేశంలో, ఇటు రాష్ట్రంలో చేపలు, వాటి ఉత్పత్తులతో కూడిన ఆహార పదార్థాల వినియోగం తక్కువగా ఉంది. దేశవ్యాప్తంగా 60 శాతం మంది మాంసాహారుల్లో సగటున ఒక వ్యక్తి ఏడాదికి 5 కేజీల చేపలు మాత్రమే తింటున్నట్లు జాతీయ మత్స్య అభివృద్ధి సంస్థ తెలిపింది. వీరు కూడా సందర్భోచితంగానే తింటున్నట్లు గుర్తించారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం సగటున ప్రతి వ్యక్తి 13 కిలోల చేపలు తినాల్సి ఉంది. ఇక ఎక్కువ మొత్తంలో చేపలు తినే వారు కూడా సగటున 9 నుంచి 10 కిలోలు మాత్రమే తింటున్నారు. మన రాష్ట్రంలో 3 కోట్ల మంది చేపలు తింటారని, వారంతా ఏడాదికి సరాసరి ఒక్కరు 6.21 కిలోల చొప్పున తింటారని అంచనా. ఇందుకు అనేక కారణాలున్నాయి. ముళ్లు తీసే పరిజ్ఞానం లేకపోవడం, పరిశుభ్రం చేసి విక్రయించకపోవడం, ధరలు ఎక్కువగా ఉండటం, అలాగే తినాలని అనుకున్న వెంటనే అందుబాటులో లేకపోవడం వంటివి ఉన్నాయి. చేపల కూరలో ఎంతో ఆరోగ్యం దాగుందని, వాటిని వివరిస్తూ దేశవ్యాప్తంగా చేపల వినియోగం పెంచడమే ధ్యేయంగా పనిచేస్తున్నామని ఎన్ఎఫ్‌డిబి ముఖ్య కార్యానిర్వహణ



అధికారి(సిఇ) రాణి కుముదిని అన్నారు. ఇందులో భాగంగానే ఫిబ్రవరి 1వ తేదీ నుంచి 3వరకు హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్‌లో ఫిష్ ఫెస్టివల్‌ను నిర్వహించనున్నట్లు ప్రకటించారు. బేగంపేటలోని హరితా ప్లాజాలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఫిష్ ఫెస్టివల్స్ విజయవంతం కావడంతో దేశవ్యాప్తంగా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించాలని ఎన్ఎఫ్‌డిబి నిర్ణయించిందన్నారు. ప్రజలకు చేపల ఆహారాన్ని దగ్గర చేయడానికి చేస్తున్న ప్రయత్నానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఫెస్టివల్స్‌లో స్టాల్స్ ఏర్పాటు, వంట సదుపాయాల కల్పన సహా వినియోగదారులను ఆకట్టుకునేలా ఏర్పాట్లు చేస్తామన్నారు. చేపల్లో ముళ్లను తొలగించి, శుభ్రం చేసే డీ బోనింగ్ యంత్రాలను దేశవ్యాప్తంగా అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ఎన్ఎఫ్‌డిబి చర్యలు తీసుకుంటుందన్నారు. పశుసంవర్ధక, మత్స్య శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా మాట్లాడుతూ మత్స్యరంగ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టిందన్నారు. రూ.1850 కోట్లు ఖర్చు పెట్టి ఉచితంగా చేప పిల్లల పంపిణీ, మత్స్యకారులకు అసవరమైన సదుపాయాలు సమకూరుస్తున్నామన్నారు. రెండేళ్లుగా చేప పిల్లల పంపిణీతో ఉత్పత్తి పెరిగిందని, అదే స్థాయిలో వినియోగం పెరగాల్సి ఉందన్నారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో 150 మొబైల్ వాహనాల ఏర్పాటుకు కసరత్తు చేస్తున్నామన్నారు.

మళ్లీ బ్యాలట్ ప్రసక్తి లేదు

(మొదటిపేజీ తరువాయి)

వినియోగిస్తున్న ఇవిఎంలను ఎవరూ హ్యాక్ చేయలేరని స్పష్టం చేశారు. ఎవరు ఎంతగా ఒత్తిడి చేసినా, ఎలాంటి బెదిరింపులకు పాల్పడినా ఇవిఎంలను వదిలి తిరిగి బ్యాలట్ పత్రాలకు వెళ్లే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఈ అంశంపై దురుద్దేశపూరితంగా బురద చల్లేందుకు కొన్ని వర్గాలు ఇవిఎంలను ఫుట్‌బాల్‌లాగా వాడుకుంటున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అయితే ఇలాంటి వాటికి భయపడి ఎన్నికల కమిషన్ మళ్లీ బ్యాలెట్ పత్రాలకు వెళ్లే ప్రసక్తి లేదని స్పష్టం చేయదలచినట్లు ఆయన తెలిపారు. శుక్రవారం జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని దేశంలో ఎన్నికల నిర్వహణపై జరిగిన అంతర్జాతీయ సదస్సు సందర్భంగా అరోరా ఈ వ్యాఖ్యలు చేశారు. 'ఎన్నికల ప్రక్రియకు సంబంధించి రాజకీయ పార్టీలే అతి పెద్ద భాగస్వాములు కనుక వారితో సహ భాగస్వాములనుంచి ఎలాంటి విమర్శలు, సూచనలు వచ్చినా స్వాగతిస్తాం. అయితే అదే సమయంలో ఇవిఎంలను వదిలేసి తిరిగి బ్యాలట్ పత్రాల కాలానికి వెళ్లాలంటూ వచ్చే ఎలాంటి ఒత్తిళ్లకు, బెదిరింపులకు లొంగే ప్రసక్తి లేదని స్పష్టం చేయదలిచాను' అని ఆరోరా అన్నారు. అంతేకాదు, ఇవిఎంలను ఎందుకు ఫుట్‌బాల్‌లాగా చేస్తున్నారో, వాటి విషయమై ఎందుకు దురుద్దేశపూరితంగా ఇసిపై ఎందుకు బురదచల్లుతున్నారో అర్థం కావడం లేదని కూడా ఆయన అన్నారు. బిఇఎల్, ఇసిఐఎల్ రూపొందించే ఇవిఎంలను ఎవరూ హ్యాక్ చేయలేరని ఆయన స్పష్టం చేశారు. అత్యంత కట్టుదిట్టమైన భద్రత నడుమ నిపుణుల కమిటీ సమక్షంలో వీటిని కఠినమైన పరీక్షలకు లోను చేస్తారని అరోరా చెప్పారు. 2014 లోక్‌సభ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ ఇవిఎంలను హ్యాక్ చేయడంద్వారానే విజయం సాధించిందని సయ్యద్ షుజా అనే సైబర్ నిపుణుడు చేసిన ఆరోపణలుతీవ్రసంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. ఈ ఆరోపణల తర్వాత వివిధ రాజకీయ పక్షాలు రాబోయే లోకసభ ఎన్నికల్లో ఇవిఎంల స్థానంలో తిరిగి బ్యాలెట్ పత్రాలను ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశాయి. ఈ నేపథ్యంలో అరోరా ఈ వ్యాఖ్యలు చేశారు. అంతేకాదు,2014 లోక్‌సభ ఎన్నికల్లో ఒక విధంగా ఫలితం రాగా అయిదు నెలల తర్వాత జరిగిన ఢిల్లీ లోక్ సభ ఎన్నికల్లో పూర్తి భిన్నమైన ఫలితం వచ్చిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఆ తర్వాత హిమాచల్‌ప్రదేశ్, గుజరాత్, కర్నాటక, త్రిపుర, మిజోరాం, తాజాగా ఛత్తీస్‌గఢ్,మధ్యప్రదేశ్, తెలంగాణ, రాజస్థాన్ రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరిగాయని, ఒక్కో రాష్ట్రంలో ఒక్కో రకమైన ఫలితం వచ్చిందని ఆయన అన్నారు.అంతేకాదు ఒక పార్టీ గెలిస్తే ఐవిఎం కరెక్ట వేరే పార్టీ గెలిస్తే తప్పా? అని కూడా ఆయన ప్రశ్నించారు. ఇటీవల జరిగిన అయిదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో ఇవిఎంల లోపాలకు సంబంధించి మొత్త ఆరు సంఘటనలు మాత్రమే వెలుగు చూశాయని ఆయన అంటూ, అయితే తాను వీటిని సమర్థించడం లేదని చెప్పారు. ఇక పేపర్ ట్రయల్ యంత్రాల విషయాన్ని ప్రస్తావిస్తూ, వీటిలో కూడా లోపాలున్నాయని, అయితే లోపాల నుంచి పాఠాలు నేర్చుకున్నామని అరోరా చెప్పారు.

66 మంది ఫారెస్టు అధికారులు

కొత్త రేంజ్ ఆఫీసర్లుగా ఎంపిక

మన తెలంగాణ / హైదరాబాద్: కొత్తగా 66 మంది ఫారెస్టు రేంజ్ అధికారులు ఎంపికయ్యారు. ఇందులో 21 మంది మహిళలున్నారు. వీరంతా 18 నెలల పాటు వివిధ రాష్ట్రాల్లో శిక్షణకు వెళ్ళనున్నారని ఆయన తెలిపారు. శిక్షణలో భాగంగా 41 మందికి అస్సాంలో, 25 మందికి కర్ణాటకలోని ధార్వాడ్‌లో శిక్షణను అందించనున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి రెండవ వారం నుంచి వీరి శిక్షణ ప్రారంభమవుతుందని వివరించారు. ఫారెస్టు రేంజ్ అధికారులుగా నియామి తులైన వారికి పిసిసిఎఫ్ పి.కె.ఝూ గురువారం అరణ్య భవన్‌లో నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కొత్తగా ఎంపికైన అధికారులకు ప్రభుత్వ ప్రాధాన్యతలతో పాటు విధుల నిర్వహణలో చూపాల్సిన చొరవను తెలిపారు. విధుల నిర్వహణ సందర్భంగా నిర్వర్తించాల్సిన బాధ్యతలు పలురకాల సూచనలు, సలహాలు కూడా చేశారు. నూతన అధికారులంతా శిక్షణను పూర్తి చేసుకున్న తర్వాత నిబద్ధతతో పనిచేసి రాణించాలని సూచించారు. విధుల నిర్వహణ సందర్భంగా ప్రభుత్వానికి పేరు తెచ్చేలా నడుచుకుంటామని కొత్తగా ఎంపికైన అధికారులు హామీ ఇచ్చారు. దేశంలో అడవులకు ఏ ప్రభుత్వం ఇవ్వని ప్రాధాన్యతను తెలంగాణ ప్రభుత్వమిస్తోందని అటవీ సంరక్షణ ముఖ్య అధికారి ప్రశాంత్ కుమార్ ఝూ తెలిపారు. ఇందుకోసం భారీగా నిధులను కూడా విడుదలను చేస్తోందని చెప్పారు. కార్యక్రమంలో పిసిసిఎఫ్. రఘువీర్, అదనపు పిసిసిఎఫ్ మునీంద్ర పాల్గొన్నారు.

వారి సేవలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి



మన తెలంగాణ/తిరుమల ప్రతినిధి : తెలంగాణ రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టిబి రాధాకృష్ణ గురువారం తిరుమల వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. బుధవారం రాత్రి తిరుమలకు విచ్చేసిన న్యాయమూర్తికి టిటిడి జేఈవో కేఎస్ శ్రీనివాసరాజు పుష్పగుచ్ఛంతో సాదరంగా స్వాగతం పలికి వసతి ఏర్పాట్లు చేపట్టారు. అనంతరం రాత్రి తిరుమలలోని ప్రధాన న్యాయమూర్తి రాధాకృష్ణ గురువారం ఉదయం విఐపి ప్రత్యేక దర్శనాలు సమయంలో వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. స్వామివారి దర్శనానంతరం ఆలయంలోని రంగనాయకుల మండపంలో వేదపండితులు న్యాయమూర్తికి ఆశీర్వచనాలు అందించారు.

ప్రియాంక రాకతో మరింత బలం : జగ్గారెడ్డి

మన తెలంగాణ/హైదరాబాద్ : ప్రత్యక్ష రాజకీయాల్లోకి ప్రియాంకగాంధీ రావడం వల్ల కాంగ్రెస్ పార్టీకి అదనపు బలం సమకూరినట్లయిందని ఆ పార్టీ శాసనసభ్యుడు జగ్గారెడ్డి వ్యాఖ్యానించారు. దేశంలో ప్రియాంకగాంధీకి ప్రజల్లో, పార్టీ కార్యకర్తల్లో క్రేజీ ఉందన్నారు. ప్రియాంక రాక కోసం ప్రజలు చాలా కాలంగా ఎదురుచూస్తున్నారని, ఆలస్యమైనా ఇప్పుడు అధికారిక నిర్ణయం రావడం పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని కలిగించిందని, అదే సమయంలో బిజెపిలో కొత్త భయం మొదలైందని గురువారం మీడియాతో వ్యాఖ్యానించారు. రాహుల్‌లో రాజీవ్‌గాంధీ, ప్రియాంకలో ఇందిరాగాంధీని ప్రజలు చూసుకుంటున్నారన్నారు. రాహుల్ రాజకీయ సమర్థతకు రాజస్థాన్, మధ్యప్రదేశ్, చత్తీస్‌ఘడ్ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ సాధించిన విజయాలే నిదర్శమన్నారు.

కారుకే పదహారు

(మొదటిపేజీ తరువాయి)

అధ్యయనం చేశాయి. ఆ ప్రకారం తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల్లో ప్రభంజనం సృష్టించినట్లుగానే లోక్‌సభ ఎన్నికల్లోనూ టిఆర్ఎస్ ప్రభంజనం తప్పదని స్పష్టం చేశాయి. టిఆర్ఎస్ ఏకంగా 42.4% మేర ఓటు బ్యాంకును కైవశం చేసుకుని 16 స్థానాల్లో గెలుస్తుందని పేర్కొన్నాయి. ఇక రెండవ స్థానంలో 29% ఓట్ల వాటాతో కాంగ్రెస్ నిలుస్తున్నప్పటికీ ఒక్క సీటును కూడా గెల్చుకోవడం కష్టమేనని, బిజెపికి 12.7% మేర ఓట్లు వస్తాయని అంచనా వేసింది. ఎంఐఎంకు 7.7% మేర మాత్రమే ఓట్లు వచ్చినా ఒక సీటును గెల్చుకుంటుందని పేర్కొన్నాయి. ఇక దేశం మొత్తం మీద ఎన్‌డిఏ కూటమికి 194 సీట్లు, యుపిఏ కూటమికి 162 సీట్లు, ఇతరులకు 58 చొప్పున వస్తాయని పేర్కొనింది. మిగిలిన సీట్లు ఆయా రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలకు దక్కుతాయని పేర్కొన్నాయి. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో స్పందించినట్లుగానే ఓటర్లు రానున్న పార్లమెంటు ఎన్నికల్లోనూ స్పందిస్తారని, అత్యధికంగా 42.4% మేర ఓట్లు వస్తాయని అంచనా వేశాయి. తాజా అసెంబ్లీ ఎన్నికల ఓటింగ్ సరళినిగానీ, ఎన్నికల ఫలితాల విశ్లేషణనుగానీ పరిశీలిస్తే రాష్ట్రంలోని మొత్తం 17 నియోజకవర్గాల పరిధిలో టిఆర్ఎస్‌కు చాలా స్పష్టంగా 15 పార్లమెంటు స్థానాల్లో సునాయాసంగా గెల్చుకునే తరహాలో ఓట్ల శాతం కనిపించింది. ఖమ్మం పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో ఉన్న అసెంబ్లీ స్థానాల్లో టిఆర్ఎస్‌కు కొంత ఇబ్బంది ఉన్నప్పటికీ దాన్ని గుర్తించిన పార్టీ అధిష్టానం రానున్న పార్లమెంటు ఎన్నికల్లో భర్తీ చేసుకునే ప్రక్రియను ఇప్పటికే ప్రారంభించింది. మొదటి నుంచీ టిఆర్ఎస్ భావిస్తున్నట్లుగానే రాష్ట్రంలో ఒక్కటి మినహా మిగిలిన పదహారు స్థానాలూ గెలుస్తామన్న ధీమా ఇప్పుడు ఈ రెండు సంస్థల సర్వేలోనూ వెల్లడైంది. ఖమ్మం జిల్లాలో పరిస్థితి సైతం మెరుగుపడడంతో ఆ పార్లమెంటు నియోజకవర్గం కూడా టిఆర్ఎస్ గెల్చుకునే తీరులో మారిపోయింది.

విజయ భయోగ్నస్టిక్

(మొదటిపేజీ తరువాయి)

స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సునీల్ కథనం ప్రకారం...నగరంలోని గోల్కొండ ప్రాంతానికి చెందిన ఓ యువతి(20) డిగ్రీ చదువుతోంది. స్పైనల్ కార్డు సమస్యతో బాధపడుతుండడంతో కుటుంబ సభ్యులు విజయనగర్ కాలనీలోని విజయ డయాగ్నస్టిక్స్‌కు సిటీ స్కానింగ్ తీసేందుకు తీసుకువచ్చారు. స్కానింగ్ తీసే సమయంలో ల్యాబ్ టెక్నీషియన్ వీరబాబు యువతి పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. ఈ విషయం యువతి ఇంటికి వెళ్లిన తర్వాత కుటుంబ సభ్యులకు చెప్పింది. వారు వెంటనే వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు. హిమాయత్ నగర్‌కు చెందిన వీరబాబుపై పోలీసులు కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేశారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హుమాయున్ నగర్ ఇన్‌స్పెక్టర్ సునీల్ తెలిపారు.

ఆదుకున్న కెటిఆర్

(మొదటిపేజీ తరువాయి)

స్పందించారు. ఖర్చుతో కూడిన వ్యాధితో బాధపడుతున్న తన కుమార్తెకు సాయం చేయాల్సిందిగా తండ్రి వివిఎస్ ప్రసాద్ ట్విట్టర్ ద్వారా కెటిఆర్‌కు విజ్ఞప్తి చేయడంతో తగిన రీతిలో చర్యలు తీసుకోవాల్సిందిగా పార్టీ కార్యాలయ సిబ్బందిని ఆదేశించారు. చిన్నారి కుటుంబ సభ్యులకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని అందించాలని పేర్కొన్నారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారికి ఏయే అవసరాల నిమిత్తం ఎంత ఖర్చవుతుందో వైద్యులు ధృవీకరించి ఇచ్చిన ప్రతిపాదనలను లిఖితపూర్వకంగా టిఆర్ఎస్ కార్యాలయంలో ప్రసాద్ అందజేశారు. అత్యవసర వైద్య సేవల నిమిత్తం ట్విట్టర్ ద్వారా విజ్ఞప్తి చేస్తున్నవారికి కెటిఆర్ తనదైన శైలిలో స్పందించి ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి వైద్య సహాయ నిధి నుంచి ఆర్థిక సాయం అందిస్తున్నారు. ఇటీవల రామగుండానికి చెందిన దివ్యాంగ బాలుడు శివసాయి వైద్య చికిత్సకయ్యే ఖర్చు కోసం పార్టీ తరఫున తగిన ఆర్థిక సాయం చేస్తానని హామీ ఇచ్చిన తర్వాత నగర టిఆర్ఎస్ నాయకుడు కట్టెల శ్రీనివాస్ యాదవ్ సహకారంతో ఆసుపత్రిలో తగిన వైద్యపరీక్షలు చేయించారు. ఫిబ్రవరి మొదటి వారంలోశస్త్ర చికిత్స జరుగుతోంది.

ప్రాంతీయ తేడాల్లేకుండా కెటిఆర్ సాయం : ప్రసాద్

ఆంధ్ర, తెలంగాణ అనే ప్రాంతీయ విబేధానికి తావు లేకుండా తాను ట్విట్టర్ ద్వారా సాయం ఆశించగానే కెటిఆర్ సానుకూలంగా స్పందించారని చిన్నారి తండ్రి ప్రసాద్ మీడియాకు తెలిపారు.ఆంధ్రకు చెందిన తాము గత పన్నెండేళ్ళుగా హైదరాబాద్‌లోనే ఉంటున్నామని, తన కుమార్తె కూడా హైదరాబాద్ పుట్టిందని, ఇప్పుడు వైద్య చికిత్స కోసం లక్షల రూపాయలు ఖర్చుపెట్టే ఆర్థిక స్తోమత లేకపోవడంతో కెటిఆర్‌ను సాయం కోరానని తెలిపారు.

కాలేయచికిత్సకోసం విజ్ఞప్తి

జనగామ జిల్లా కు చెందిన పాతికేళ్ళ నిరుపేద గీతకార్మికునికి కూడా పార్టీ తరఫున కొంత, సిఎంఆర్ఎఫ్ తరఫున కొంత చొప్పున తగిన ఆర్థిక సాయం చేయాల్సిందిగా కార్యాలయ సిబ్బందిని కెటిఆర్ ఆదేశించారు. కాలేయ సంబంధ వ్యాధితో సికింద్రాబాద్‌లోని సన్‌షైన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న డి.సాగర్ అనే గీత కార్మికుడిని ఆదుకోవాల్సిందిగా మాజీ మంత్రి కడియం శ్రీహరి సిఫార్సు చేశారు. ఖరీదైన వైద్యం చేయించే ఆర్థిక స్థోమతలేని ఆ కుటుంబాన్ని ఆదుకోవాల్సిందిగా కెటిఆర్‌కు ఆ లేఖలో విజ్ఞప్తి చేసిన కడియం శ్రీహరి సిఎంఆర్ఎఫ్ నుంచి సహాయం అందించాల్సిందిగా కోరారు. స్పందించిన కెటిఆర్ తన కార్యాలయ సిబ్బందిని ఆదేశిస్తూ అవసరమైన వైద్య చికిత్స కోసం సిఎంఆర్ఎఫ్ నిధులు అందేవిధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు.

పింఛన్లకు 3,174కోట్లు?

(మొదటిపేజీ తరువాయి)

అందజేస్తామని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఇటీవల ప్రకటించిన విషయం తెలిసిందే. అందుకు అనుగుణంగా ఆర్థిక శాఖకు సంబంధిత ప్రభుత్వ విభాగం నుంచి ప్రతిపాదనలు చేరినట్లు తెలిసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పింఛన్‌లకు బడ్జెట్‌లో రూ.5048 కోట్లు చూపారు. అప్పుడు వయస్సు పరిమితి 60 ఏళ్లు నిండి ఉండాలనే నిబంధన ఉంది. ఇప్పుడు దానిని 57 ఏళ్లకు కుదించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీని ప్రకారం ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో దాదాపు అరకోటి మందికి వివిధ రకాల పింఛన్‌లకు రూ. 3174 కోట్లు ప్రతిపాదించినట్లు తెలిసింది. కేవలం మూడు నెలలకు మాత్రమే ఇంత మొత్తంలో ఖర్చు అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇక ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న రైతుబంధు పథకానికి భారీ మొత్తంలో కేటాయింపులు చూపాల్సి ఉంది. రానున్న ఖరీఫ్‌లో మే నెలలోనే ఎకరాకు రూ.5 వేల చొప్పున ఇవ్వాల్సి ఉంది. దాదాపు 1.40 కోట్ల ఎకరాకు రూ.5 వేల చొప్పున దాదాపు రూ. 7.50 వేల కోట్లు అవసరమౌతాయి. రబీకి కూడా కలుపుకుంటే రూ.15 వేల కోట్లకు చేరుతుంది. రాష్ట్ర వ్యవసాయ శాఖ రూ. 15 వేల కోట్లకు రైతుబంధు బడ్జెట్ ప్రతిపాదనలు రూపొందించి ఆర్థిక శాఖకు పంపింది. ఇందులో రూ.7.50 వేల కోట్ల ఖర్చుకే ఆమోదం తీసుకోనున్నారు. రుణమాఫీకి కూడా బడ్జెట్ ప్రతిపాదనలు రూపొందించినప్పటికీ, సమగ్ర అధ్యయనం తరువాతే వాటిని పూర్తిస్థాయిలో బడ్జెట్‌లో చూపే అవకాశం ఉందని ఆర్థిక శాఖ అధికారులు చెబుతున్నారు. ఇక ప్రభుత్వ ప్రాధాన్య రంగమైన సాగునీటి శాఖకు ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో అధిక మొత్తంలోనే కేటాయింపులు చేయనున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ. 21 వేలు ఇరిగేషన్‌కు కేటాయించారు. ఓటాన్ ఖర్చుల్లో భాగంగా రూ.6 వేల కోట్ల వరకు అంచనాలు ఉన్నాయని, ఇంకా పూర్తిస్థాయిలో ఇరిగేషన్ శాఖ నుంచి ప్రతిపాదనలు అందలేదని ఆర్థిక శాఖ అధికారులు తెలిపారు. ఇక ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఇఎన్‌టి, డెంటల్ పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించిన నేపథ్యంలో ఓటాన్‌లో



ఖర్చులకు ఎక్కువ మొత్తంలోనే ఆమోదం తీసుకోనున్నట్లు తెలిసింది. కెసిఆర్ కిట్, అమ్మఒడి, ఆరోగ్య శ్రీకి రూ.1500 కోట్ల వరకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కేవలం మూడు లేదా నాలుగు నెలలకు మాత్రమే ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌కు శాసనసభ, మండలి ఆమోదం తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తున్న విషయం తెలిసిందే. అయితే రాబడి అంచనాల ఆధారంగానే ఓటాన్ అకౌంట్ బడ్జెట్ నుంచే అప్రెపిషయన్ బిల్లు ఆమోదం ద్వారా నిధులు ఖర్చు చేయనున్నారు. అయితే దీనిపై ఇంకా స్పష్టత రాలేదు. 2018–19 ఆర్థిక సంవత్సరానికి మొత్తం బడ్జెట్ రూ.1.74 లక్షల కోట్లుగా ఉంది. ఇందులో ప్రగతి పద్దు కింద రూ.1.04 లక్షల కోట్లు, నిర్వహణ పద్దు కింద రూ.69 వేల కోట్లు కేటాయించారు. ఈసారి మొత్తం రూ.2 లక్షల కోట్లకు చేరువలో ఉంటుందని ఆర్థిక శాఖ అంచనా.

కమలానికి కష్టమే



(మొదటిపేజీ తరువాయి)

ఫలితాలు మారే అవకాశముంది. కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటుకు కావాల్సిన మేజిక్ ఫిగర్ 272. ఎన్‌డిఏ, యుపిఏలో భాగస్వాములు కానీ పార్టీలు దేనికి మద్దతు ఇస్తే ఆ కూటమే ప్రభుత్వం ఏర్పాటు చేయగలుగుతుందని సర్వే ద్వారా స్పష్టమైంది. మరోవైపు దేశ ప్రజలు ఎన్‌డిఏకు మరో ఛాన్స్ ఇవ్వాలని భావిస్తున్నారని, 60శాతం ప్రజలు నరేంద్ర మోడీ నాయకత్వంలోని ప్రభుత్వాన్నే కోరుకుంటారని సర్వే తెలిపింది. ఉత్తరాది రాష్ట్రాలు ఢిల్లీ, హర్యానా, ఉత్తర్‌ప్రదేశ్, పంజాబ్, రాజస్థాన్‌లలో ఎన్‌డిఏకు 60శాతం ఓట్లు కురుస్తాయని, అయితే వాటితో 66సీట్లు మాత్రమే గెలుచుకోగలదని సర్వే తేల్చి చెప్పింది. ఇక యుపిఏ 23శాతం ఓట్లతో ఇదే రాష్ట్రాల్లో 20సీట్లు సంపాదిస్తుందని పేర్కొంది. దేశవ్యాప్తంగా చూసుకుంటే ఎన్‌డిఏకు ఈ రోజే ఎన్నికలు జరిగితే 60శాతం ఓట్లు పడతాయని వివరించింది. ఇక మోడీకి వ్యతిరేకంగా రాహుల్, మాయావతి, అఖిలేశ్, మమత చేతులు కలిపితే ఎన్‌డిఏకు తిరిగి అధికారం కల్లనేనని పేర్కొంది. ఈ నలుగురు కనీసం 269 స్థానాలు సాధిస్తారని సర్వే వెల్లడించింది.

యుపిలో ఎస్‌పి, బిఎస్‌పి ద్వయానికి 58

వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బిజెపికి గడ్డుకాలమేనట. ఎస్‌పి, బిఎస్‌పి, ఆర్‌ఎల్‌డి కూటమి 58 సీట్లు గెలుచుకుంటుందని సర్వే పేర్కొంది. బిజెపి, దాని మిత్ర పక్షం అప్నాదళ్ కలిసి 18 సీట్లకే పరిమితమవుతాయని, కాంగ్రెస్ 4 సీట్లు గెలుచుకుంటుందని వెల్లడించింది. హస్తం పార్టీ కూడా జతకడితే కూటమి మరింత బలపడి 75 స్థానాలు గెలుచుకుంటుందని, అప్పుడు బిజెపి కేవలం 5 స్థానాలే వస్తాయని అంచనా వేసింది. రాష్ట్రవ్యాప్తంగా సేకరించిన 2,478 శాంపిళ్లను విశ్లేషించిన సర్వే సంస్థలు బుధవారం ఆ వివరాలను వెల్లడించాయి.యుపిలో మొత్తం 80 లోక్‌సభ స్థానాలకు 2014లో బిజెపి 71, అప్నాదళ్ 2 స్థానాలను గెలుచుకున్నాయి. వీటికి 43% ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ 2 (7.53% ఓట్లు), ఎస్‌పి 5 (22.4%) స్థానాలను గెలుచుకున్నాయి. 19.6% ఓట్లు సాధించిన బిఎస్‌పి, 1% ఓట్లు సాధించిన ఆర్‌ఎల్‌డి ఖాతా తెరవలేదు. అయితే, ఈసారి ఫలితాలు భిన్నంగా ఉంటాయని తాజా సర్వే పేర్కొంది.

కెసిఆర్, జగన్, పళని, నవీన్ మద్దతు పలికినా..

రానున్న ఎన్నికల్లో ఒకవేళ ఎన్‌డిఏకు గణనీయంగా సీట్లు తగ్గినా టిఆర్ఎస్, వైఎస్‌ఆర్‌సిపి, అన్నాడిఎంకె, బిజూ జనతాదళ్ సాధించే సీట్లు కీలకం కానున్నాయి. వీరి మద్దతుపై ప్రభుత్వాలు నిలబడే అవకాశం ఉందని సర్వే వివరించింది. అయితే ఈ నలుగురు రెండు కూటములకు దూరం పాటిస్తూ వస్తున్నారని, ఒకవేళ కెసిఆర్, జగన్, పళనిస్వామి, నవీన్ పట్నాయక్ చివరిక్షణంలో ఎన్‌డిఏకు మద్దతు పలికినా మోడీ ప్రభుత్వాన్ని గట్టెక్కించలేరని, వీరు సాధించే సీట్లు ప్రభుత్వ ఏర్పాటుకు సరిపడవని అభిప్రాయపడింది.

చందాకొచ్చర్‌పై సిబిఐ కేసు

(మొదటిపేజీ తరువాయి)

సిబిఐ ముంబయి, ఔరంగాబాద్‌లలోని వీడియోకాన్ కార్యాలయాలతో పాటు దీపక్ కొచ్చర్‌కు చెందిర న్యూపవర్ రెన్యువబుల్స్, సుప్రీమ్ ఎనర్జీ సంస్థలకు చెందిన కార్యాలయాలపై దాడులు జరిపింది. వీడియోకాన్ గ్రూపునకు ఐసిఐసిఐ బ్యాంక్ మంజూరు చేసిన రుణాల అవకతవకల వివాదం కారణంగా చందా కొచ్చర్ ఐసిఐసిఐ సిఇఓ బాధ్యతలనుంచి తప్పుకొన్న విషయం తెలిసిందే. 2012 లో వీడియోకాన్ రూ.3,250 కోట్ల రుణాలు పొందిందని, దీనివల్ల కొచ్చర్ కుటుంబం లాభపడిందని ఆరోపణలురావడం వివాదాస్పదం అయింది. చందాకొచ్చర్ భర్తకు చెందిన కంపెనీలో వీడియోకాన్ ఎండి వేణుగోపాల్ కోట్ల రూపాయలు పెటుబడి పెట్టిన తర్వాత వీడియోకాన్‌కు ఐసిఐసిఐ బ్యాంక్‌నుంచి రుణం మంజూరైనట్లు ఆరోపణలు వచ్చాయి. దీంతో ఈ అంశంపై సిబిఐ విచారణ చేపట్టింది.

రెండో విడత ధీ

(మొదటిపేజీ తరువాయి)

7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. ఆ తరువాత వార్డుల వారీగా సభ్యులకు, పంచాయతీ సర్పంచ్‌కు వచ్చిన ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. అన్ని జిల్లాల్లో రెండో విడతలో ఎన్నికలు జరిగే గ్రామ పంచాయతీల్లో 29,964 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. సర్పంచ్ పదవికి 10,668 మంది, వార్డు మెంబర్‌కు 63,480 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. దాదాపు 61 వేల మంది పోలింగ్ సిబ్బంది (బూత్) ఎన్నికల నిర్వహణలో పాల్గొననున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీస్ శాఖ కూడా తగిన బందోబస్తు ఏర్పాటు చేసింది. పోలింగ్ సామాగ్రి ఆయా మండలాల్లో అందుబాటులో ఉండగా, ఏయే పంచాయతీలకు, వార్డులకు ఎన్నికలు జరుగుతున్నాయో వాటికి అనుగుణంగా పోలింగ్ సిబ్బందికి బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్‌లను అధికారులు అందించారు. వాస్తవానికి రెండో విడతలో 4135 పంచాయతీలకు నోటిఫికేషన్ విడుదల చేశారు. ఇందులో 5 పంచాయతీలకు నామినేషన్లు రాకపోవడం, వచ్చినవాటిలో తిరస్కరణకు గురికావడంతో వాటికి ఎన్నిక నిర్వహించడం లేదు. 788 ఏకగ్రీవం కావడంతో 3342 పంచాయతీలకు ఎన్నిక నిర్వహించనున్నారు. అలాగే 36,602 వార్డులకు నోటిఫికేషన్ ఇవ్వగా 94 వార్డులకు నామినేషన్లు రాలేదు. 10,317 ఏకగ్రీవం కావడంతో 26,191 వార్డులకు ఎన్నిక నిర్వహించనున్నారు.

673 పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌క్యాస్టింగ్

మొత్తం 29,964 పోలింగ్ కేంద్రాలకు గాను సమస్యాత్మక కేంద్రాలైన అన్నిజిల్లాల్లోని 673 కేంద్రాల్లో వెబ్‌క్యాస్టింగ్ చేయాలని నిర్ణయించారు. నేరుగా రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాలయంతో పాటు, డిజిపి, జిల్లా ఎస్‌పి కార్యాలయాల్లో పోలింగ్, ఓట్ల లెక్కింపును పరిశీలించనున్నారు. వెబ్‌క్యాస్టింగ్ కాకుండా మిగతా చోట్ల వీడియో రికార్డింగ్ చేయనున్నారు. మొదటి విడత పోలింగ్ నాడు ఎదురైన ఇబ్బందులు, సమస్యలను దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ఎన్నికల సంఘం మరింత పకడ్బందీ ఏర్పాట్లను చేసింది.

పల్లీ టోపీరాయుడు పాత కెడియే

(మొదటిపేజీ తరువాయి)

మరికొందరిని సంస్థలో సభ్యులుగా చేర్పించడం జరిగింది. కొందరు బాధితులు తమ సమీప బంధువులను సైతం చేర్పించారు. రూ.లక్షకు నెలకు 10వేల రూపాయలు వస్తున్నాయన ప్రచారం జరగడంతో కొందరు రూ.10లక్షలు పెట్టుబడులుగా పెట్టారు. ఈక్రమంలో కొద్దికాలం కమీషన్లు చెల్లించిన సంస్థ డిసెంబర్ నెలలో బోర్డు తిప్పేసింది. దీంతో అనుమానం వచ్చిన బాధితులు పోలీసులను ఆశ్రయించడంతో వేరుశనగ గింజల నుంచి నూనె తీసే యంత్రాలను ఇస్తామని నమ్మించి వేలాది మంది నుంచి కోట్ల రూపాయలు వసూలు చేసిన గ్రీన్‌గోల్డ్ బయోటెక్ సంస్థ ఎండి శ్రీకాంత్ వ్యవహారం వెలుగు చూసింది. బాధితుల ఫిర్యాదు మేరకు ఉప్పల్ పోలీసులు బుధవారం గ్రీన్‌గోల్డ్ బయోటెక్ సంస్థ ఎండి శ్రీకాంత్‌ను అరెస్ట్ చేశారు. గతంలో కూడా శ్రీకాంత్‌పై పలు చీటింగ్ కేసులు ఉన్నట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. నాలుగు రాష్ట్రాలలో ఏజెంట్ల ద్వారా వీటికి ప్రచారం కల్పించి వేలాది మందిని మోసం చేశారు. ఈ మోసంపై ఇంద్రకుమార్ అనే బాధితుని ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులకు ఆసక్తికరమైన విషయాలు వెలుగుచూశాయి. తెలంగాణతోపాటు ఇతర రాష్ట్రాలలో కూడా మోసాలకు పాల్పడినట్లు పోలీసులు వివరిస్తున్నారు. గ్రీన్‌గోల్డ్ పేరిట 6వేల మంది బాధితులు ఉన్నట్లు పోలీసు ఉన్నతాధికారులు వివరిస్తున్నారు. అయితే బాధితులలో అత్యధికులు కర్నాటక వాసులుగా పోలీసుల విచారణలో తేలింది.

ఏజెంట్లపైనా కేసులు : గ్రీన్‌గోల్డ్ బయోటెక్ సంస్థ ఎండి శ్రీకాంత్ కేసులో కీలక పాత్ర వహించిన ఏజెంట్లపైనా పోలీసులు కేసు నమోదు చేయన్నారు. కేవలం కమీషన్ల కక్కుర్తి కోసం వందలాది మందిని గ్రీన్‌గోల్డ్ బయోటెక్ సంస్థలో సభ్యులుగా చేర్పించారని పోలీసులు వివరిస్తున్నారు. గ్రీన్‌గోల్డ్ బయోటెక్ సంస్థలో దాదాపు 200 మంది ఏజెంట్లుగా ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక, తమిళనాడు రాష్ట్రాలలో ఉన్న ఏజెంట్ల వివరాలు సేకరిస్తున్నారు. హైదరాబాద్ నగరంలో కొందరు ఏజెంట్లు వందలాది మందిని చేర్పించారని, ఏజెంట్లు సైతం తమ కమీషన్లను గ్రీన్‌గోల్డ్ బయోటెక్ సంస్థలో పెట్టుబడి పెట్టినట్లు తమ విచారణలో తేలిందని పోలీసు అధికారులు వివరిస్తున్నారు.



పడిపోతున్న మిరప ధర

● ఆందోళనలో రైతులు.. ● ఏనుమాముల మార్కెట్‌కు పోటెత్తిన మిర్చి బ్యాగులు



మనతెలంగాణ/వరంగల్ బ్యూరో: ఒకవైపు ప్రకృతి కన్నెర్ర.. మరొకవైపు పండించిన పంటకు గిట్టుబాటు ధర లేకపోవడం కలిసి రైతుకు కంట కన్నీరే మిగిల్చింది. ఆరుగాలం శ్రమించి పండించిన పంటకు మధ్య దళారులు గిట్టుబాటు కల్పించకపోవడం రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. వరంగల్ ఉమ్మడి జిల్లాకు పెద్ద మార్కెట్‌గా వరంగల్ ఏనుమాముల మార్కెట్ మాత్రమే అందుబాటులో ఉంది. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఇనామ్ ద్వారా రైతుకు మద్దతు ధర కల్పించడం కోసం దేశంలోని 20 మార్కెట్ల ధరలను అందుబాటులోకి తీసుకొచ్చే పద్ధతిని అమలు చేస్తున్న వరంగల్ ఏనుమాముల మార్కెట్‌లో రైతులకు సరైన గిట్టుబాటు ధర కావడం లేదు. వారం రోజుల నుండి ఏనుమాముల మార్కెట్‌కు మిర్చి ఉత్పత్తి అమ్మకం కోసం రైతులు భారీ ఎత్తున తీసుకొస్తున్నారు. డిసెంబర్‌లో రూ.10 నుండి రూ.12 వేలు ఉన్న మిర్చి ధర సంక్రాంతి పండుగ తరువాత రూ.8 వేల రూ.9 వేల వరకు పడిపోయింది. నెంబర్ వన్ క్వాలిటీ కలిగిన మిర్చికే రూ.8800 ధర పలుకుతుందని ఆ పేరుతో క్వాలిటీ కలిగిన మిర్చికి కూడా రూ.7 వేల ధర కూడా పలకడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గురువారం వరంగల్ ఏనుమాముల మార్కెట్‌కు ఉమ్మడి జిల్లాలోని భూపాలపల్లి జయశంకర్ జిల్లాలోని వెంకటాపురం, వాజేడు, తాడ్వాయి, ములుగు, వరంగల్ రూరల్ జిల్లాలోని నల్లబెల్లి, దుగ్గొండి, పరకాల మహబూబాబాద్ జిల్లాలోని రైతులు భారీ ఎత్తున మిర్చిని మార్కెట్‌కు తీసుకువచ్చారు. తీసుకొచ్చిన మిర్చికి గిట్టుబాటు ధర రాకపోవడంతో తీవ్ర ఆందోళనలకు గురవుతున్నారు. డిసెంబర్‌లో ప్రకృతి కోపానికి చేతికొచ్చిన పంట వర్షం ,తుఫాను, ఈదురుగాలులకు మిర్చి కాయ బరువుకు పంట నేలవాలి తీవ్రంగా నష్టపోయిం ది. మిగిలిన పంట నుండి ఉత్పత్తి తీసినా గిట్టుబా టు ధర రాకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రభుత్వం మిర్చి పంటకు గిట్టుబాటు ధర వచ్చే విధంగా మార్క్‌ఫెడ్‌తో కొనుగోలు చేయించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

పడిపోతున్న ధర.. మిగిలిన పంట 75 శాతం

ఉమ్మడి వరంగల్ జిల్లా మిర్చి పంటకు కేంద్రంగా ఉంది. ప్రధానంగా వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్ జిల్లాల్లో మిర్చి పంట ఎక్కువగా సాగవవుతుంది. ఒక్కొక్క రైతు 5 నుండి 20 ఎకరాల వరకు సాగు చేస్తున్నారు. పంట మొదటి దశ నుండి చివరి దశ వరకు చీడపీడల నుండి పంటను రక్షించుకోవడానికి భారీ ఎత్తున పెట్టుబడి పెట్టాల్సి వచ్చింది. పెట్టిన పెట్టుబడి పోనూ రైతుకు నికర లాభం రావాలంటే పంట దిగుబడి అనుకున్న మేరకు రావడంతో పాటు గిట్టుబాటు ధర కూడా కలిసివస్తే నికర లాభం వచ్చే అవకాశం ఉంది. ఈ సంవత్సరం మిర్చి పంట పండించిన రైతులకు ప్రకృతి శాపం కొంతయితే గిట్టుబాటు ధర మరికొంత ఎదురై మరికొంత నష్టాన్ని కలిగిస్తుంది. దీని వల్ల రైతులు పెట్టిన పెట్టుబడే చేతికొచ్చే పరిస్థితులు లేకుండా పోతున్నాయి. ఇప్పటి వరకు రైతులు మార్కెట్‌కు తీసుకొచ్చిన దిగుబడి 25 శాతమే కాగా మిగిలిన పంట దిగుబడి 75 శాతం పంట చేలల్లోనే ఉంది. ఫిబ్రవరి నుండి ఏప్రిల్ వరకు మిర్చి పంటను తీస్తారు. జనవరి నెలల్లోనే మిర్చి ధర రూ.8 వేలకు పడిపోవడం రైతులను తీవ్ర నిరాశకు గురి చేస్తుంది. ఫిబ్రవరి, మార్చి వరకు గిట్టుబాటు ధర రూ.10 వేల వరకు లేకుంటే రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశాలున్నాయి. దీన్ని దృష్టిలో పెట్టుకొని రైతు సమన్వయ కమిటీలు రైతు పండించిన మిర్చి పంటకు గిట్టుబాటు ధర కల్పించేలా జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లను పరిగణనలోకి తీసుకొని వచ్చిన ఉత్పత్తిని రైతు సమన్వయ కమిటీల ద్వారానే కొనుగోలు చేయించి ప్రపంచ మార్కెట్‌లో అమ్మేందుకు చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది.

ఒకే ఇంట్లో ఐదుగురి విజయం

భర్త సర్పంచ్, భార్య ఉప సర్పంచ్
తల్లి, అన్న, వదిన వార్డు సభ్యులు



మన తెలంగాణ/కౌటాల: మొదటి విడత పంచాయతీ ఫలితాల్లో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు గెలుపొంది జిల్లాలో ఆదర్శంగా నిలిచారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలం బోదంపల్లిలో సోమవారం విడుదలైన పంచాయతీ ఫలితాల్లో టిఆర్ఎస్ బలపర్చిన రెడ్డి శంకర్ సర్పంచ్‌గా, ఆయన భార్య కమల ఉప సర్పంచ్‌గా ఎన్నికైయ్యారు. అదే కుటుంబానికి చెందిన శంకర్ తల్లి రెడ్డి దుర్గమ్మ సోదరుడు రెడ్డి భీమయ్య , వదిన రెడ్డి సుశీల, శంకర్ భార్య కమల వార్డు సభ్యులుగా గెలుపొందారు. బోదంపల్లి గ్రామంలో 8 వార్డు సభ్యులు ఉండగా ఒకే కుటుంబానికి చెందిన నలుగురు వార్డు సభ్యులుగా గెలుపొందారు. దీంతో ఉప సర్పంచ్ పదవి కూడా ఒకే కుటుంబానికి దక్కడం విశేషం.

పాఠశాల ఆరవ అంతస్థు పైనుంచి దూకి

విద్యార్థి ఆత్మహత్య

- సిసి కెమెరా పుటేజీలో స్పష్టంగా కనిపించిందంటున్న పోలీసులు
- మా కొడుకు ఆత్మహత్య చేసుకునేంత పిరికివాడు కాదు : తల్లిదండ్రులు
- విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం : సి.పి



మన తెలంగాణ/కరీంనగర్ క్రైం : నగర శివారులో ఉన్నటువంటి ప్రైవేట్ పాఠశాల భవనంపై నుండి దూకి ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నటువంటి సంఘటన గురువారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. కరీంనగర్ టూటౌన్ సిఐ సి.హెచ్.దేవారెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. జగిత్యాల జిల్లా మోతె గ్రామానికి చెందిన గొల్ల సుదర్శన్–రేఖ దంపతులకు ఇరువురు కుమారులు సంతానం. సుదర్శన్ పొలాస అగ్రికల్చర్ యూనివర్శిటీలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తుండగా తన ఇరువురు కుమారుల్లో చిన్న కుమారుడైన గొల్ల ఆశ్విన్ (14)ను విద్యాభ్యాసం కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఓ ప్రైవేట్ పాఠశాలలో ఈ సంవత్సరం తొమ్మిదవ తరగతిలో చేర్పించారు. అయితే జగిత్యాల నుండి వచ్చి పోవడం ఇబ్బందిగా భావించి తన కుమారుడిని పాఠశాల హాస్టల్‌లో చేర్పించి విద్యాభ్యాసం కోసం ఏర్పాట్లు చేశారు. ఇటీవల సంక్రాంతి పండగ కోసం ఇంటికి వెళ్ళిన ఆశ్విన్ వారం రోజుల క్రితమే హాస్టల్‌కు తిరిగి వచ్చాడు. ఈ నేపథ్యంలో గురువారం తెల్లవారుజామున హాస్టల్ సిబ్బంది నిద్ర నుండి లేచి చూసే సరికి పాఠశాల ముందు ఆవరణలో ఉన్నటువంటి సంప్ పైకప్పు పగిలి ఉండగా లోపల ఆశ్విన్ మృతదేహం కనిపించింది. వెంటనే వారు పాఠశాల యాజమాన్యానికి సమాచారం అందించగా వారు హుటాహుటిన అక్కడికి చేరుకుని విద్యార్థి మృతదేహాన్ని కరీంనగర్ ప్రభుత్వ ఆసుప్రతికి తరలించి విషయాన్ని వివరిస్తూ కరీంనగర్ టూటౌన్ పోలీసులకు సమాచారం అందించడం జరిగింది. సిఐ సి.హెచ్.దేవారెడ్డి తన సిబ్బందితో పాఠశాలలో సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేసి సంఘటనపై కేసు నమోదు చేసుకుని విచారణ ప్రారంభించారు. ఇదిలా ఉండగా విద్యార్థి ఆత్మహత్య విషయం తెలిసిన వెంటనే కరీంనగర్ పోలీస్ కమీషనర్ వి.బి.కమలాసన్‌రెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని ఆశ్విన్ మృతదేహాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఆనంతరం పాఠశాలకు చేరుకున్న ఆయన ఘటన స్థలాన్ని పరిశీలించారు. సిసి కెమెరా పుటేజీలను పరిశీలించిన తరువాత ఆయన విలేకరుతో మాట్లాడుతూ అందరు విద్యార్థులతో పోల్చి చూస్తే ఆశ్విన్ తెలివైన విద్యార్థి అని తోటి విద్యార్థులు తెలిపారన్నారు. పాఠశాల భవనం 4వ అంతస్తులో ఉండేటువంటి ఆశ్విన్ గురువారం తెల్లవారుజామున 3 గంటలకు లేచినట్లు అతని గదిలో ఉండేటువంటి మిగితా విద్యార్థులు తెలిపారన్నారు. అంతేకాకుండా 4 గంటల ప్రాంతంలో తోటి విద్యార్థిని టైం అడిగినట్లు ఆయన వివరించారు. ఆనంతరం 4వ అంతస్తు నుండి ఆరవ అంతస్తుకు వెళ్ళిన ఆశ్విన్ అక్కడి నుండి కిందకు దూకినట్టు సిసి కెమెరాల పుటేజీల్లో స్పష్టంగా కనిపిస్తుందన్నారు. దీనిని అనుసరించి అతని మానసిక పరిస్థితి బాగా లేని కారణంగానే ఆరవ అంతస్తు పైనుండి ఆత్మహత్య చేసుకుని ఉంటాడనే అభిప్రాయాన్ని సిపి వి.బి. కమలాసన్‌రెడ్డి వ్యక్తం చేశారు. ఏదిఏమైనా ఈ విషయమై సమగ్రమైన విచారణ జరిపించి ఆశ్విన్ మృతికి బాధ్యులేవరైనా ఉంటే వారిమీద చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా తమ కుమారుడు ఆత్మహత్య చేసుకునేంత పిరికివాడు కాదని అతనికి మానసిక స్థితి బాగానే ఉందని విద్యార్థి తల్లిదండ్రులైన సుదర్శన్, రేఖలు రోధిస్తూ తెలిపారు. ఒకవేళ పాఠశాల బిల్డింగ్ పైనుండి సంప్‌లో పడితే ఈత తెలిసిన తమ కుమారుడు ఏలా చనిపోతాడని వారు ప్రశ్నించారు. సంప్‌పై ఉండే కప్పు పగిలి పోయే అవకాశం లేదని వారు అనుమానం వ్యక్తం చేశారు. తమ కుమారుడి మృతి పట్ల అనుమనాలు ఉన్నాయని సమగ్రమైన విచారణ జరిపించి న్యాయం చేయాలని వారు పోలీసులను కోరారు. విద్యార్థి ఆత్మహత్య ఘటనపై పాఠశాల యాజమాన్యం మాట్లాడుతూ ఆశ్విన్ మృతి పట్ల విచారం వ్యక్తం చేస్తున్నట్లు పేర్కొంటూ ఇందులో తమ నిర్లక్ష్యం ఏమీ లేదన్నారు. అన్ని విధాలుగా భద్రతా చర్యలు తీసుకుంటామని తెలిపారు. వార్డెన్‌కు కళ్ళుకప్పి ఆశ్విన్ బంగ్లాపైకి వెళ్లాడని అనంతరం అక్కడికి నుండి దూకి ఆత్మహత్య చేసుకుని ఉంటాడనే అనుమానాన్ని వ్యక్తం చేశా రు. చదువులో ముందుండే ఓ విద్యార్థి ఈ విధమైన చర్యకు పాల్పడటం దురదృష్టకరమని వారు అవేదన చెందారు.

రూ. 7లక్షల విలువ చేసే గుట్కాల స్వాధీనం



మన తెలంగాణ/ఖమ్మం క్రైం: ఖమ్మం నగరపాలక సంస్థ పరిధిలోని మున్సిపాల్టీ రోడ్డులోని కిరాణా షాపు నిర్వహకుడు డి. వాసుదేవరావు నుంచి గురువారం రూ. 7లక్షల విలువ చేసే గుట్కాలను స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే... నగరంలోని టాస్క్ ఫోర్స్ ఏసీపీ రెహమాన్, వన్‌టౌన్ పోలీసుల ఆధ్వర్యంలో ఈ దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో రూ. 7.30 లక్షల విలువ చేసే 97 గుట్కా, అంబర్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. వన్‌టౌన్ సీఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం వాసుదేవరావుకు సంబంధించిన ఇండ్లు, గోదామును తనిఖీ చేయగా అందులో ఉన్న విలువైన గుట్కా, అంబర్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని అతన్ని ఆదుపులోకి తీసుకున్నారు. స్వాధీనం చేసుకున్న నిషేధిత గుట్కాను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ దాడుల్లో టాస్క్‌ఫోర్స్ సీఐ తిరుపతిరెడ్డి, ఆర్ఎస్సై నాగుల్ మీరా, హెడ్ కానిస్టేబుల్ వెంకటరెడ్డి, కానిస్టేబుళ్లు శ్రీనివాస్,వెంకట్, ఆదినారాయణ, పార్థులు పాల్గొన్నారు.

ముగ్గురు అటవీ అధికారుల సస్పెన్షన్

విధి నిర్వహణలో అలసత్వమే కారణం

మన తెలంగాణ/నిజామాబాద్: నిజామాబాద్ జిల్లాలో పనిచేస్తున్న ముగ్గురు అటవీ శాఖాధికారులపై సస్పెన్షన్ వేటు పడింది. విధి నిర్వహణలో అలసత్వం వహించడమే కాకుండా కలప అక్రమ రవాణా సమాచారం అందినప్పటికీ స్పందించకపోవడంతో అధికారులపై వేటు పడినట్లు తెలుస్తోంది. సస్పెండ్ అయిన అధికారులలో నిజామాబాద్ అటవీ డివిజన్ అధికారి టి.వేణుబాబు, అటవీ రేంజ్ అధికారి బి.రామ్మోహన్, డిప్యూటీ రేంజ్ అధికారి ఎ.శ్రీనివాసుల ఉన్నారు. గత రెండు వారాల్లో అటవీశాఖలో 8 మందిని సస్పెండ్ చేసి శాఖాపరమైన చర్యలు తీసుకోవడానికి అటవీశాఖ ఉన్నతాధికారులు ఉపక్రమించారు. కాగా ఇప్పటి వరకు ముగ్గురు కలప అక్రమ రవాణా దారులను అరెస్టు చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఆదేశాల మేరకు తనిఖీలను ముమ్మరం చేయడంతో ఈ తతంగం బయటపడింది. నిజామాబాద్ జిల్లాలో కలప అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టే చర్యల్లో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. జిల్లాలో అటవీ శాఖలో విధులు నిర్వర్తిస్తున్న మరి కొంతమందికి కలప అక్రమ రవాణాలో ప్రమేయం ఉన్నట్లు రాష్ట్ర అటవీశాఖ ఉన్నతాధికారులకు సమాచారం వెళ్ళినట్లు తెలుస్తోంది.

ఆర్‌టిసి బస్సు, లారీ ఢీ

నలుగురికి తీవ్ర గాయాలు

మన తెలంగాణ/ఖమ్మం జిల్లా/కొణిజర్ల : ఆర్‌టిసి బస్సు, లారీ ఢీ కొని నలుగురికి గాయాలైన సంఘటన గురువారం ఖమ్మం జిల్లా కొణిజర్ల చోటుచేసుకుంది. కొణిజర్ల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మధిర డిపోకు చెందిన టిఎస్ ఆర్‌టిసి బస్సు ప్రయాణీకులను ఎక్కించుకుని ఖమ్మం వస్తుండగా మార్గ మధ్యలో ఎదురుగా వస్తున్న లారీని ఢీ కొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్ నరేష్, కండక్టర్ రాధికకు స్వల్ప గాయాలయాయి. ప్రయాణీకులు కొణిజర్లకు చెందిన మంగతాయమ్మతో పాటు వెంకన్న, పద్మ, మరియమ్మలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను హుటాహుటిన ఖమ్మంకు తరలించి వైద్య సేవలు అందించారు. లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



> క్రికెటర్ రోహిత్ శర్మతో ఒకప్పుడు నేను ప్రేమలో ఉన్నమాట నిజమే. 2012లో మేం ప్రేమించుకున్నాం. లండన్‌లోని ఓ క్లబ్‌లో రోహిత్‌ను తొలిసారి కలిశాను. నేను క్రికెట్ ఎక్కువగా చూడను. అతను ఓ క్రికెటర్ అన్న విషయం నాకు తెలి-యదు. నా స్నేహితురాలు అతన్ని నాకు పరిచయం చేసింది. ఆతర్వాత మా ఇద్దరి మధ్య స్నేహం కుదిరి అది ప్రేమగా మారింది.
>
> – బాలీవుడ్ నటి సోఫియా హయత్

రిపబ్లిక్ డే రోజున..


రవితేజ

రవితేజ హీరోగా వి.ఐ.ఆనంద్ దర్శకత్వంలో ఎస్‌ఆర్‌టి ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లో నూతన చిత్రాన్ని మొదలుపెట్టబోతున్నారు. నిర్మాత రామ్ తళ్లూరి ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించనున్నారు. ఈ క్రేజీ కాంబినేషన్‌లో సినిమా అనగానే ట్రేడ్ వర్గాల్లో అప్పుడే ఆసక్తి మొదలైంది. జనవరి 26న రిపబ్లిక్ డే రోజున, రవితేజ పుట్టిన రోజు సందర్భంగా ఈ చిత్రం పేరును అధికారికంగా ప్రకటించడంతో పాటు టైటిల్ లోగోను విడుదల చేయనున్నారు. ఈ సినిమాలో రవితేజకు జోడీగా ముగ్గురు హీరోయిన్లు నటించనున్నారు. త్వరలోనే ఈ సినిమా తొలి షెడ్యూల్‌ను ప్రారంభించబోతున్నట్లు నిర్మాత రామ్ తళ్లూరి తెలిపారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రాఫర్: సాయి శ్రీరామ్, మ్యూజిక్: థమన్, ఎడిటర్: నవీన్ నూలి.

మరోసారి ఆ ఫీట్ కోసం ప్రయత్నాలు


దిల్‌రాజు

రెండేళ్ల క్రితం ఒకే సంవత్సరంలో ఆరు సినిమాలను విడుదల చేసి హిట్‌లు కొట్టి సంచలనం సృష్టించారు నిర్మాత దిల్‌రాజు. కానీ గత ఏడాది ఆ ఫీట్ సాధ్యం కాలేదు. ఇప్పుడు మళ్లీ 2019లో అదే ఫీట్ చేయాలని ప్రయత్నాలు ప్రారంభించారు. ఆయన నిర్మించిన 'ఎఫ్2' బ్లాక్‌బస్టర్ కావడంతో వచ్చిన ఉత్సాహంతో సినిమాల నిర్మాణాన్ని స్పీడప్ చేయాలని దిల్‌రాజు నిర్ణయించుకున్నారు. ఈ ఏడాది ఇప్పటికే 'ఎఫ్2' అందించారు. ఆతర్వాత మహేష్‌బాబుతో నిర్మిస్తున్న 'మహర్షి' రాబోతోంది. త్వరలో శర్వానంద్, సమంతల కాంబినేషన్‌లో '96' రీమేక్‌ను ప్రారంభించబోతున్నారు. అంటే మూడు సినిమాలు ఈ ఏడాది ప్రథమార్థంలోనే ప్రేక్షకుల ముందుకు వస్తాయి. ఇవికాకుండా తన దగ్గర పెండింగ్‌లో ఉన్న స్క్రిప్ట్‌లను ఒక్కోటి తీసి ఎలా మెటీరియలైజ్ చేయాలని దిల్‌రాజు చర్చలు ప్రారంభించారు. వీటిలో ఒకటి వేణుశ్రీరామ్ దర్శకత్వంలో ఉంటుంది. ఈమేరకు చర్చలు ప్రారంభించారు. అలాగే ఈ సినిమాకు మిక్కీ జె.మేయర్‌ను సంగీత దర్శకుడిగా తీసుకుంటున్నారు. ఇంకో రెండు సినిమాల గురించి కూడా ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇందులో ఓ స్క్రిప్ట్‌ను చేయమని ఓ పాపులర్ దర్శకుడిని దిల్‌రాజు కోరినట్టు తెలిసింది. మొత్తమ్మీద 2019లో దిల్‌రాజు బ్యానర్‌లో ఆరు సినిమాలు రాబోతున్నాయి.

ఆ విద్యతో మైమరపిస్తోంది


అదాశర్మ

యంగ్ బ్యూటీ అదాశర్మ సోషల్ మీడియాలో జోరుగా దూసుకుపోతోంది. ఈ అమ్మడు సామాజిక మాధ్యమాల్లో తనను తాను ప్రమోట్ చేసుకునే తీరు ఎంతో క్రియేటివ్‌గానూ ఉంటుంది. నిరంతరం రకరకాల ఫొటోలు, వీడియోలతో యూత్‌కు గాలం వేస్తుంటుంది. ఇప్పటికే ఇన్‌స్టాగ్రామ్, ట్విట్టర్‌లో ఈ అమ్మడికి విపరీతమైన ఫాలోయింగ్ ఏర్పడింది. గత కొంతకాలంగా పలు అంశాలపై ప్రత్యేకంగా వీడియోలను రూపొందిస్తూ అభిమానులను అలరిస్తోంది.

27న తమిళ్ రీమేక్ ప్రారంభం


వరుణ్‌తేజ్

యంగ్ హీరో వరుణ్‌తేజ్ తన కెరీర్ ప్రారంభం నుంచి కంటెంట్ బేస్డ్ సినిమాల్లో నటిస్తూ మెగా ఫ్యామిలీ హీరోలలో తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపును సంపాదించుకున్నారు. ఇటీవల సీనియర్ స్టార్ వెంకటేష్‌తో కలిసి వరుణ్ నటించిన మల్టీస్టారర్ 'ఎఫ్2' ఘన విజయం సాధించింది. ఈ సినిమా తర్వాత కూడా ఈ యంగ్ స్టార్ ఆసక్తికరమైన ప్రాజెక్టులను లైన్‌లో పెట్టారు. అందులో ఒకటి తమిళ సూపర్ హిట్ ఫిలిం 'జిగార్తాండ' రీమేక్. హరీష్ శంకర్ దర్శకత్వంలో తెరకెక్కనున్న ఈ సినిమాలో బాబీ సింహా పాత్రలో వరుణ్‌తేజ్ నటిస్తారని తెలిసింది. ఈ సినిమాకు తాజాగా ఈ యంగ్ స్టార్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని సమాచారం. ఈ చిత్రాన్ని ఈనెల 27న ప్రారంభించబోతున్నారట. ఈ సినిమాలో వరుణ్ విలన్ షేడ్స్ ఉన్న డాన్ పాత్రలో నటిస్తారు. మరి సిద్ధార్థ్ పాత్రలో నటించే మరో హీరో వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. దర్శకుడు హరీష్ శంకర్‌కు కమర్షియల్ ఎలిమెంట్స్‌తో సినిమాలను తీయడంలో మంచి పట్టుంది. రాక్‌స్టార్ దేవిశ్రీ ప్రసాద్ ఈ సినిమాకు సంగీతాన్ని అందిస్తారు. బాలీవుడ్ సినిమాటోగ్రాఫర్ అయనాంక బోస్ ఈ సినిమాకు పనిచేస్తారు. రామ్ ఆచంట, గోపీ ఆచంట ఈ సినిమాను 14 రీల్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై నిర్మిస్తారు.

అంతా తానే అన్నట్టు..


కంగనారనౌత్

ఝాన్సీ లక్ష్మీబాయ్ జీవితంపై తెరకెక్కిన 'మణికర్ణిక' సినిమా క్రిష్ దర్శకత్వంలో రూపొందింది. కానీ కొంత భాగం షూటింగ్ మిగిలి ఉండగానే క్రిష్ దర్శకత్వ బాధ్యతల నుండి తప్పుకోవంతో ఈ సినిమాలో టైటిల్ రోల్ పోషిస్తున్న కంగనానే ఆ బాధ్యతలు చేపట్టింది. ఆమె ఎంట్రీతో కొన్ని మార్పులు జరిగాయి. ఆతర్వాత సినిమాలో 30 శాతం భాగానికి కంగనారనౌత్ దర్శకత్వం వహించి సినిమాను పూర్తి చేసింది. శుక్రవారం ఈ చిత్రం విడుదలకానుంది. కారణాలు తెలియదు కానీ ఈ సినిమా ప్రమోషన్స్‌లో ఎక్కడా కూడా క్రిష్ కనిపించడం లేదు. అప్పుడెప్పుడో హైదరాబాద్‌లో జరిగిన తెలుగు వర్షన్ ట్రైలర్ లాంచ్‌కు మాత్రం క్రిష్ హాజరయ్యారు. ఆతర్వాత అతను ఈ సినిమాకు దూరంగా ఉన్నారు. మరోవైపు 'మణికర్ణిక' ప్రమోషన్స్‌లో కంగన తన జోరు చూపిస్తోంది. అసలు అంతా తానే అన్నట్టుగా వ్యవహరిస్తోంది. ఇటీవల ముంబయ్‌లో సెలబ్రిటీల కోసం ప్రీమియర్లు ప్రదర్శించినప్పుడు ప్రశంసలన్నీ కంగనాకే వస్తున్నాయట. తాను తీసింది 30 శాతం సినిమా అయితే క్రెడిట్ మాత్రం వందశాతం అన్నట్టుగా ఉంది. ఒకవేళ సినిమా హిట్ అయితే తన దర్శకత్వ ప్రతిభ వల్లే ఇది జరిగిందని కంగనారనౌత్ చెప్పినా ఆశ్చర్యపడవలసిన పనేలేదని కూడా కామెంట్స్ వినిపిస్తున్నాయి.


'లవర్స్ డే' ఆడియో వేడుకలో అల్లు అర్జున్, ప్రియా ప్రకాష్ వారియర్, ఒమర్ లులు, ఎ.గురురాజ్, సి.హెచ్.వినోద్ రెడ్డి తదితరులు

అల్లు అర్జున్ అంటే చాలా ఇష్టం: ప్రియా వారియర్

ప్రియా ప్రకాష్ వారియర్ నటించిన మలయాళ చిత్రం 'ఒరు ఆధార్ లవ్'ను తెలుగులో 'లవర్స్ డే' పేరుతో సుఖీభవ సినిమాస్ బ్యానర్‌పై నిర్మాతలు ఎ.గురురాజ్, సి.హెచ్.వినోద్ రెడ్డిలు విడుదల చేస్తున్నారు. ఒమర్‌లులు దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రానికి షాన్ రెహమాన్ సంగీతాన్ని అందించారు. ఈ సినిమా ఆడియో విడుదల కార్యక్రమం హైదరాబాద్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన అల్లు అర్జున్ ఆడియో సీడీలను విడుదల చేశారు. ఈ సందర్భంగా అల్లు అర్జున్ మాట్లాడుతూ ''సౌతిండియన్ సినిమాల్లో దేశ, విదేశాల్లో బాగా వైరల్ అయిన వీడియోస్‌లో కొలవెరి డీ, 'బాహుబలి'లో హు కిల్డ్ కట్టప్ప... ఈమధ్య కాలంలో 'ఒరు ఆదార్ లవ్'లోని వీడియో బాగా వైరల్ అయింది. ఇక నేను దక్షిణాదికి చెందిన వాడినని చెప్పుకోవడానికి గర్వపడతాను. నేను పుట్టింది చెన్నైలో, పెరిగింది హైదరాబాద్‌లో. అలాగే మలయాళం వాళ్లు, కర్నాటక వాళ్లు కూడా నన్ను ఆదరిస్తున్నారు. ఇక నా సినిమాలను కేరళవాళ్లు తమ సొంత సినిమాల్లాగా ఆదరిస్తున్నారు. ఓ ల్యాండ్ మార్క్ ఉన్న మలయాళ సినిమా తెలుగులోకి వస్తున్నప్పుడు నేను సపోర్ట్ చేయాలని భావించి ఈ వేడుకకు వచ్చాను. ఈ సినిమా ద్వారా మలయాళ ఇండస్ట్రీకి వెల్‌కమ్ చెబుతున్నాను. ఈ సినిమాకు సోషల్ మీడియా ద్వారా బజ్ క్రియేట్ చేసిన ప్రియావారియర్‌కు అభినందనలు. ఈ క్రెడిట్ డైరెక్టర్ ఒమర్ లులుదే. ఈ సినిమా వాలెంటైన్స్ సందర్భంగా విడుదలవుతోంది''అని అన్నారు. ప్రియా ప్రకాష్ వారియర్ మాట్లాడుతూ ''అల్లు అర్జున్ అంటే నాకు చాలా ఇష్టం. ఆయనతో కలిసి స్టేజ్‌పై నిలబడే అవకాశం వస్తుందని అనుకోలేదు. ఆయనను కలుసుకునే అవకాశమిచ్చిన అందరికీ థాంక్స్. సినిమా విడుదలకంటే ముందే మమ్మల్ని సపోర్ట్ చేసిన ప్రేక్షకులకు థాంక్స్''అని చెప్పారు. నిర్మాత ఎ.గురురాజ్ మాట్లాడుతూ ''నేను బన్నీకి పెద్ద అభిమానిని. మాకు సపోర్ట్ చేయడానికి ఈ వేడుకకు వచ్చిన ఆయనకు థాంక్స్. సినిమాల మీద మక్కువతోనే ఇండస్ట్రీకి వచ్చాను. అయితే నేను నటుడిని కాలేకపోయాను. ఆతర్వాత రియల్ ఎస్టేట్ రంగంలోకి వచ్చి ఈ స్థాయికి ఎదిగాను. ఇక 'లవర్స్ డే' సినిమాను తెలుగులో విడుదల చేస్తున్నందుకు ఆనందంగా ఉంది''అని తెలిపారు. దర్శకుడు ఒమర్ లులు మాట్లాడుతూ ''మలయాళంలో ఎంత మంది స్టార్స్ ఉన్నా కూడా మా సినిమా వీడియోను ఎవరూ షేర్ చేయలేదు. కానీ అల్లుఅర్జున్ మాత్రమే షేర్ చేశారు. ఇక చాలా మంది కొత్త వాళ్లను ఈ సినిమా ద్వారా పరిచయం చేస్తున్నాం''అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వినోద్ రెడ్డి, భాస్కర్, చైతన్య ప్రసాద్, చంటి అడ్డాల, రోషన్ తదితరులు పాల్గొన్నారు.

బన్నీకి కన్ను కొట్టిన ప్రియా వారియర్


అల్లు అర్జున్‌తో ప్రియా ప్రకాష్ వారియర్

అందాల భామ ప్రియా ప్రకాష్ వారి యర్‌కి పెద్దగా పరిచయం అక్కర్లేదు. 'ఒరు ఆధార్ లవ్' సినిమాలో కన్ను గీటిన సీన్‌తో సోషల్ మీడియాలో ప్రకంపనలు సృష్టించింది ఈ బ్యూటీ. 'లవర్స్ డే' పేరుతో తెలుగులో విడు దలవుతున్న ఈ సినిమా ఆడియో వేడుకలో ప్రియా ప్రకాష్ సందడి చేసింది. ఈ వేడుకలో యాంకర్ సుమ కోరిక మేరకు స్టార్ హీరో అల్లుఅర్జున్‌కు కన్ను కొట్టింది ఈ భామ. సినిమాలో హీరోకు గురి చూసి కన్ను గీటినట్లే బన్నీకి కూడా లైవ్‌గా కన్ను గీటింది. ప్రియా ప్రకాష్. దీంతో బన్నీ ఆనందంతో చిరున వ్వులు చిందించాడు.

జీవితంలో జరిగే సంఘటనలను గుర్తుచేసేలా...


ఆర్.కె. మామ, అజీజ్, ఫరా, సూఫీఖాన్

ఆర్.కె. మామ, అజీజ్ నాజర్, అలీ రాజా, ఫరా, సూఫీ ఖాన్ ప్రధాన పాత్రధారులుగా రూపొందుతున్న చిత్రం 'హైదరాబాద్ నవాబ్స్ 2'. ఉటోపియా ఎంటర్‌టైనర్స్ పతాకంపై స్వీయ దర్శకత్వంలో ఆర్.కె.మామ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రం టీజర్, ట్రైలర్ విడుదల కార్యక్రమం హైదరాబాద్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆర్.కె. మామ మాట్లాడుతూ ''2006లో వచ్చిన 'హైదరాబాద్ నవాబ్స్' ఎంతటి ఘన విజయాన్ని సాధించిందో అందరికీ తెలిసిందే. 13 ఏళ్ల తర్వాత దీనికి సీక్వెల్‌ను తీసుకొస్తున్నాం. ప్రతి ఒక్కరు తమ జీవితంలో జరిగే సంఘటనలను గుర్తుచేసేలా ఈ చిత్రం ఉంటుంది. చాలా రియలిస్టిక్‌గా ఉంటూ ఆద్యంతం కామెడీని పంచుతుంది''అని అన్నారు. ఈ కార్యక్రమంలో అజీజ్, అలీ రాజా, ఫరా, సూఫీ ఖాన్ పాల్గొన్నారు.

భానుప్రియపై పోలీసులకు ఫిర్యాదు



సీనియర్ నటి భానుప్రియపై తూర్పు గోదావరి జిల్లా సామర్లకోట పోలీస్‌స్టేషన్‌లో ఓ కేసు నమోదైంది. భానుప్రియ ఇంట్లో పనికోసం 14 ఏళ్ల తన కూతురును పంపానని... ఇంతవరకు జీతం ఇవ్వకపోగా ఆమె సోదరుడు గోపాలకృష్ణ తన కుమార్తెను లైంగికంగా వేధింపులకు గురి చేస్తున్నాడని ప్రభావతి అనే మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ప్రభావతి మాట్లాడుతూ ''ఏడాదిన్నరకాలంగా భానుప్రియ ఇంట్లో పని చేస్తున్న నా కుమార్తెను ఇంటికి పంపించడం లేదు. నెలకు రూ.10 వేల జీతం ఇస్తానని చెప్పి ఒక్క నెల జీతం కూడా ఇవ్వలేదు. కనీసం తన కూతురితో ఫోన్‌లో కూడా మాట్లాడనీయడం లేదు. ఇంట్లోనే ఆమెను నిర్బధించారు. గట్టిగా మాట్లాడినా, గొడవ చేసినా చోరీ కేసులు పెడతామని బెదిరుస్తున్నారు''అని పేర్కొంది. దీంతో చిల్డ్రన్ హెల్ప్ లైన్ సభ్యుల సహకారంతో సామర్లకోట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని ప్రభావతి చెప్పింది. అయితే పిల్లలతో పనిచేయించడం చట్టరీత్యానేరం. లైంగిక వైధింపులు, బెదిరింపులకు పాల్పడితే మరో కేసు నమోదవుతుంది. ఇక సామర్లకోట పోలీస్‌స్టేషన్‌లో తనపై నమోదైన కేసుపై భానుప్రియ స్పందించారు. తనపై వస్తున్న ఆరోపణలు అవాస్తవమని, తమ ఇంట్లో పనిచేయడానికి వచ్చిన ఆ బాలిక దొంగతనానికి పాల్పడిందని ఆమె ఆరోపించారు. తమ ఇంట్లో నుంచి దాదాపు ఒక లక్ష 50 వేల డబ్బును, బంగారాన్ని, కెమెరా, ఐప్యాడ్‌ను ఆ బాలిక దొంగిలించిందని భానుప్రియ చెప్పారు. అయితే దొంగతనం చేసిన కొన్ని వస్తువులను బాలిక తిరిగి తీసుకొచ్చిందని... ఆతర్వాత బాలికను తీసుకెళ్లమని ఆమె తల్లికి ఫోన్ చేశామని పేర్కొంది. మిగిలిన వస్తువులను తీసుకొస్తామని ఇంటికి వెళ్లిన ఆమె తల్లి చివరికి తమపైనే కేసు పెట్టడం ఆశ్చర్యానికి గురిచేసిందని భానుప్రియ చెప్పింది. అయితే భానుప్రియపై తన తల్లి చేసిన ఫిర్యాదుపై బాలిక మీడియాతో మాట్లాడింది. భానుప్రియ ఇంట్లో తాను డబ్బు, నగలు దొంగిలించి తల్లికి ఇచ్చానని పేర్కొంది. వాటిని తిరిగి తీసుకొస్తానని చెప్పి వెళ్లిన తల్లి భానుప్రియపై కేసు పెట్టిందని బాలిక పేర్కొంది.

బికినీలో జలకాలాటలు

హాట్ బ్యూటీ లక్ష్మీరాయ్ బికినీ సొగసులకు కొదవే లేదు. మొదటి నుంచి స్కిన్ షోలో ముందుండే ఈ భామ మెగాస్టార్ చిరంజీవితో కలిసి స్టెప్పులు వేసిన 'రత్తాలు రత్తాలు...' ఐటమ్ సాంగ్‌తో మంచి క్రేజ్‌ను సంపాదించింది. ఆతర్వాత తెలుగులో వరుసగా అవకాశాలను దక్కించుకుంటోంది. ప్రస్తుతం తెలుగులో రెండు, మూడు సినిమాల్లో నటిస్తోంది. అలాగే తమిళంలో ఓ సినిమా కోసం నాగిని పాత్ర కూడా పోషిస్తోంది లక్ష్మీరాయ్. అలాగే ఐటమ్‌సాంగ్స్ కోసం కూడా ప్రయత్నాలు చేస్తోంది. ఇదిలాఉండగా సోషల్ మీడియాలో తన హాట్ ఫోజులతో కుర్రకారును మైమరపిస్తోంది. తాజాగా స్విమ్మింగ్‌పూల్‌లో హాట్ హాట్ క్లీవేజ్‌తో బికినీలో జలకాలాడుతున్న తన ఫొటోను సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. చిరునవ్వులు చిందిస్తున్న ఈ బ్యూటీ అందాలు యూత్‌ను ఆకట్టుకుంటున్నాయి.


లక్ష్మీరాయ్



యస్ బ్యాంక్‌కు కొత్త బాస్

- ఎండి, సిఇఒగా రవ్‌నీత్ గిల్
- మార్చి 1 నుంచి బాధ్యతలు
- ఆమోదం తెలిపిన ఆర్‌బిఐ





న్యూఢిల్లీ : ఎట్టకేలకు యస్ బ్యాంక్‌లో కొత్త బాస్ ఎంపికపై చోటుచేసుకుంటున్న హంగామాకు తెరపడింది. డచ్ బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ రవ్‌నీత్ సింగ్ గిల్ తాజాగా యస్ బ్యాంక్ పగ్గాలు చేపట్టనున్నారు. ఈమేరకు బ్యాంక్ ఎక్స్ఛేంజ్‌కు తెలియజేసింది. యస్ బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ ఎగ్జిక్యూటివ్‌గా 2019 మార్చి 1 నుంచి గిల్ బాధ్యతలు చేపట్టనున్నారని వెల్లడించింది. దీనికి గాను ఆర్‌బిఐ(భారతీయ రిజర్వు బ్యాంక్) కూడా ఆమోదం తెలిపింది. యస్ బ్యాంక్‌కు సిఇఒగా రాణా కపూర్‌ను మరోసారి పదవీకాలం పొడిగించేందుకు అక్టోబర్‌లో ఆర్‌బిఐ తిరస్కరించింది. రాణా 2019 జనవరి 31 వరకు బాధ్యతలు చేపడతారు.

వివాదాస్పదమైన సిఇఒ వ్యవహారం

వాస్తవానికి బ్యాంకు సిఇఒగా ఉన్న రాణా కపూర్ పదవీ కాలం గతేడాది ఆగస్టు 31తో ముగిసింది. అయితే సిఇఒగా రాణాను పునర్నియమిస్తూ బ్యాంకు బోర్డు నిర్ణయం తీసుకుంది. అలాగే మరో మూడేళ్ల పాటు రాణా ఈ పదవిలో కొనసాగుతారని గతంలో బ్యాంకు ప్రకటించడంతో ఆర్‌బిఐ ఆగ్రహం వ్యక్తం చేసింది. యస్ బ్యాంక్ ఆర్‌బిఐ నిబంధనలను ఉల్లంఘించినట్లు ఆరోపణలు రావడంతో మరోసారి రాణా పదవీ కాలం పొడిగించేందుకు రిజర్వ్ బ్యాంక్ తిరస్కరించింది. వచ్చే ఏడాది జనవరి చివరి వరకు రాణా పదవిలో కొనసాగేందుకు ఆర్‌బిఐ అనుమతిస్తూ.. ఈ లోగా కొత్త సిఇఒను ఎంపికచేయాలని ఆదేశించింది. దీంతో బ్యాంక్ కొత్త సారిథి కోసం వేట మొదలుపెట్టి తీవ్ర కసరత్తు చేసి ఆఖరికి గిల్‌ను ఎంపిక చేసింది.

14 శాతం పెరిగిన షేరు విలువ

రవ్‌నీత్ నియామకం వార్తతో యస్ బ్యాంకు షేర్లు ఒక్కసారి పైపైకి ఎగశాయి. ఒక దశలో షేరు ధర 20 శాతం వరకు పెరిగింది. ప్రస్తుతం ఎన్‌ఎస్‌ఇలో బ్యాంకు షేరు ధర 14.32 శాతం పెరిగి రూ. 225.50 వద్ద స్థిరపడింది. ఎట్టకేలకు యస్ బ్యాంక్‌కు గడ్డు పరిస్థితులు పోయి సానుకూల సమయం మొదలైంది. ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో మెరుగైన ఫలితాలు, కొత్త సిఎండి ప్రకటన వెరసి యస్‌బ్యాంకు కౌంటర్లో ఉత్సాం నెలకొంది. ఈ ఏడాది క్యూ3(అక్టోబర్–డిసెంబర్)లో యస్ బ్యాంకు రూ.1,001 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. నికర వడ్డీ ఆదాయం(ఎన్‌ఐఐ) రూ. 2667 కోట్లు, రూ. 2297 కోట్లమేర స్లిప్పేజెస్ నమోదయ్యాయి. స్థూల నిరర్థక ఆస్తులు (ఎన్‌పిఎలు) 1.6 నుంచి 2.1 శాతానికి పెరిగాయి. నికర ఎన్‌పిఎలు 0.86 శాతం నుంచి 1.18 శాతానికి చేరాయి.

ఇండిగో సిఇఒగా రోనోజాయ్ దత్తా



న్యూఢిల్లీ: ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్‌కు చెందిన దేశీయ అతిపెద్ద విమాన సంస్థ ఇండిగో కొత్త సిఇఒగా రోనోజాయ్ దత్తా నియమితులయ్యారు. ఆయన ఐదేళ్లపాటు పదవిలో కొనసాగనున్నారు. అదే సమయంలో సంస్థ చైర్మన్‌గా మేలెవీటిల్ దామోదరన్ నియామకానికి కంపెనీ ఆమోదం తెలిపింది. ఇద్దరి నియామకం జనవరి 24 నుంచి అమల్లోకి వస్తుందని ఇంటర్‌గ్లోబ్ ప్రకటించింది. దత్తా ఇంతకుముందు యునైటెడ్ ఎయిర్‌లైన్స్ ఎగ్జిక్యూటివ్‌గా, ఎయిర్ సహారా ప్రెసిడెంట్‌గా సేవలందించారు. గతేడాది డిసెంబర్‌లో ఇండిగోలో ప్రధాన సలహాదారుగా దత్తా చేరారు. అదే సమయంలో ఇండిగో ఆయనకు సిఇఒగా కీలక బాధ్యతలను అప్పగించింది. ఐదేళ్లపాటు సంస్థ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించగలరనే నమ్మకంతో దత్తాను ఎంపిక చేసింది. సంస్థ నుంచి గ్రెగ్ టేగెగ్ రాజీనామా చేసిన తర్వాత ఒక నెలకు దత్తాను నియమించారు.

రెనాల్ట్ చైర్మన్‌గా జీన్ డోమినిక్



న్యూఢిల్లీ : ఆటోమొబైల్ దిగ్గజం రెనాల్ట్ చైర్మన్‌గా జీన్ డోమినిక్ సెనార్డ్ నియమితులయ్యారు. ఆర్థిక అవకతవకలకు పాల్పడ్డారనే ఆరోపణలతో ఇటీవల రెనాల్ట్ బాస్ కార్లోస్ ఘోస్‌ను తొలగించారు. అప్పట్లో ఈ కుంభకోణం ఫ్రెంచ్ కారు తయారీ సంస్థ, అనుబంధ సంస్థ అయిన జపాన్‌కు చెందిన నిస్సాన్‌ను కుదిపేసింది. జీన్ డోమినిఖ్ నియామకం తక్షణమే అమల్లోకి వస్తుందని కంపెనీ వెల్లడించింది. ఇప్పటి వరకు డిప్యూటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ థీరీ బొలెరె సంస్థ బాధ్యతలను చూసుకున్నారు. తాజా నియామకంతో రెనాల్ట్–నిస్సాన్ నాయకత్వ సంక్షోభానికి తెరపడినట్లయింది. జపాన్‌లో నవంబర్ 19న ఘోస్‌ను అరెస్టు చేయగా, నిస్సాన్ చైర్మన్‌గా ఆయన్ని సంస్థ తొలగించింది.

2020 ఏప్రిల్ నుంచి 'నానో' నిలిపివేత

మన తెలంగాణ/ హైదరాబాద్: రతన్ టాటా కలల కారు 'నానో'ను బిఎస్(భారత్ స్టేజ్)–6 నిబంధనలకు అనుగుణంగా రూపొందించి, పెట్టుబడులు పెట్టే ఆలోచన ప్రస్తుతానికైతే లేదని టాటా మోటార్స్ పాసెంజర్ వెహికిల్ బిజినెస్ యూనిట్ ప్రెసిడెంట్ మయాంక్ పరీక్ తెలిపారు. వచ్చే 2020 సంవత్సరం నుంచి నానో ఉత్పత్తి, సేల్స్‌ను ఆపనున్నామని ఆయన సంకేతాలిచ్చారు. నానో కారును 2009 సంవత్సరంలో ప్రవేశపెట్టినప్పుడు లక్ష రూపాయలు ఉంది. అయితే బిఎస్–6 నిబంధనల కారణంగా టాటా మోటార్స్‌కు చెందిన కొన్ని ఉత్పత్తులను కూడా నిలిపివేసే అవకాశముందని మయాంక్ స్పష్టం చేశారు.

తెలంగాణ మార్కెట్లోకి 'హరియర్'



ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్న ఎస్‌యువి వెహికిల్ 'హరియర్'ను టాటా మోటార్స్ రాష్ట్ర మార్కెట్లోకి విడుదల చేసింది. గురువారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టాటా మోటార్స్ ప్రెసిడెంట్ మయాంక్ ఫరేక్ 'హారియర్'ను ఆవిష్కరించారు. ఈ వాహనం ధర 12.69 లక్షల నుంచి రూ.16.25 లక్షల వరకు ఉంటుంది. ఈ ఆర్థిక సంవత్సరంలో టాటా మోటార్స్ మార్కెట్లోకి విడుదల చేసిన నాలుగో కారు ఇది. ఈ కొత్త కారు మొత్తం నాలుగు వేరియంట్లలో లభిస్తుంది. ఎక్స్ఈ, ఎక్స్ఎం, ఎక్స్‌టి, ఎక్స్ జెడ్ అనే వేరియంట్లలో ఇది లభ్యమవుతుంది. ఈ సందర్భంగా పాసెంజర్ వెహికిల్ బిజినెస్ యూనిట్ ప్రెసిడెంట్ మయాంక్ పరీక్ మాట్లాడుతూ, సరికొత్త హారియర్ కొనుగోలుదారులను ఎంతగానో ఆకట్టుకుంటుందని అన్నారు. లాండ్ రోవర్ లెజెండరీ డి8 ఆర్కిటెక్చర్ నుంచి పొందిన ఒమెగా ఆర్క్‌పై నిర్మితమైన హారియర్ అందరి ఆకాంక్షలను నెరవేర్చేలా ఉంటుందని అన్నారు. ప్రస్తుతం ఉన్న అన్ని ప్రమాణాలను అధిగమించడం, దేశంలో ఎస్‌యువిలకు నూతన ప్రమాణాలను నిర్దేశించడం ద్వారా హారియర్ తమ ఉనికిని మరింత పటిష్టం చేయనుందని అన్నారు. కాగా ఈ కారులో నాలుగు సిలెండర్ల 2.0 లీటర్ టర్బోఛార్జ్‌డ్ డీజిల్ ఇంజిన్‌ను అమర్చారు. ఈ ఇంజిన్ 350 ఎన్‌ఎం టార్క్‌ను 138 బిహెచ్‌పి శక్తిని విడుదల చేస్తుంది.

మే 12న యూనిగేజ్ ఎగ్జామ్

మన తెలంగాణ/ హైదరాబాద్: ఇంజినీరింగ్ బిఇ/ బి.టెక్ కోర్సులకు సంబంధించిన కోమెడ్ కె యుగెట్, యూని–గేజ్ ప్రవేశ పరీక్ష మే 12న నిర్వహించనున్నారు. దేశవ్యాప్తంగా 140నగరాల్లో 400 పరీక్ష కేంద్రాల్లో కోమెడ్, యుని–గేజ్ పరీక్ష నిర్వహించనున్నారు. ఈ పరీక్షకు 180కి పైగా విద్యా సంస్థలు, 21 యూనివర్సిటీల ఆమోదం లభించడంతో అది జెఇఇ తర్వాత దేసంలోనే రెండో అతిపెద్ద మల్టీ వర్సిటీ ప్రైవేటు ఇంజినీరింగ్ ఎగ్జామ్‌గా నిలిచింది. ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీలు/వర్సిటీలను ఒకే పరీక్షలోకి ఏకీకృతం చేయాలన్న సరళమైన ఆలోచనతో 4ఏళ్ల క్రితం ఇది ప్రారంభమైంది.

పర్యాటకుల కోసం సదరన్ ట్రావెల్స్ హాలిడే బజార్



మన తెలంగాణ/హైదరాబాద్: దేశ, విదేశాలకు విహార యాత్రలకు వెళ్లదలచిన పర్యాటకుల కోసం డిస్కౌంట్ రేట్లతో సదరన్ ట్రావెల్స్ 'హాలిడే బజార్'ను నిర్వహించనున్నది. జనవరి 26, 27వ తేదీల్లో హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, ఖమ్మం, సూర్యాపేటలలో ప్రత్యేక డిస్కౌంట్లు, క్యాష్‌బ్యాక్ ఆఫర్లతో హాలిడే బజార్ నిర్వహిస్తున్నట్లు సంస్థ జెఎండి ఎవి ప్రవీణ్ కుమార్ తెలిపారు. హాలిడే బజార్‌లో భాగంగా పర్యాటక రంగానికి చెందిన నిపుణులతో నేరుగా మాట్లాడే అవకాశం కల్పిస్తున్నామని, దీంతో దేశ, విదేశాలలో, అక్కడి పరిస్థితులను తెలుసుకోవచ్చన్నారు. పర్యాటక రంగంలో గత 48 ఏళ్లుగా విశేష అనుభవం ఉన్న తెలుగు సంస్థ సదరన్ ట్రావెల్స్ అని, న్యూఢిల్లీ ప్రధాన కార్యాలయంగా ఉండి దేశంలోని అన్ని ప్రధాన నగరాల్లో విభాగాలు నడుపుతున్నామన్నారు. టికెట్ బుకింగ్ నుంచి మొదలుకొని వసతి, సైట్ సీయింగ్, తిరుగు ప్రయాణం వరకు అనుభవజ్ఞులైన సిబ్బంది సేవలు అందిస్తారని, ఫలితంగా పర్యాటకులకు మధురానుభూతులతో సొంతింటికి చేరుకుంటారని చెప్పారు. పర్యాటకులకు సరక్షితమైన, సుఖవంతమైన ప్రయాణమే ధ్యేయంగా సదరన్ ట్రావెల్స్ విశేష సేవలు అందిస్తుందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలచే ఉత్తమ టూర్ ఆపరేటర్‌గా ఇప్పటి వరకు 8 సార్లు పురస్కారం తమ సంస్థకు లభించిందన్నారు. నగరంలో జరిగిన మీడియా సమావేశంలో ఎజిఎం శ్రీనివాసరావు, శ్రీనివాస గుప్త తదితరులు పాల్గొన్నారు.

మూడేళ్లలో వేదాంత రూ.60 వేల కోట్ల పెట్టుబడులు



న్యూఢిల్లీ : వచ్చే మూడేళ్లలో భారత్‌లో దాదాపు రూ. 60,000 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు వేదాంత రిసోర్సెస్ ఛైర్మన్ అనిల్ అగర్వాల్ ప్రకటించారు. భారత్, ఆఫ్రికాల్లో జింక్ వ్యాపారాన్ని విస్తరించనున్నామని ఓ వార్తా చానెల్‌తో ఆయన చెప్పారు. తద్వార ప్రపంచ వ్యాప్తంగా సంవత్సరానికి రెండు మిలియన్ టన్నుల జింక్‌ను ఉత్పత్తి చేయటమే లక్ష్యమని అన్నారు. చమరు, లోహ వ్యాపార దిగ్గజం వేదాంత లిమిటెడ్ యూనిట్ ద్వారా చమురు, సహజ వాయు రంగాల్లో మూడు బిలియన్ డాలర్ల మేరకు ఇన్వెస్ట్ చేయనున్నట్టు తెలిపారు. అలాగే భారత్‌లో 1,400 టన్నుల వెండిని ఉత్పత్తి చేసే దిశగా కంపెనీ పనిచేయబోతుందని, మహారాష్ట్రలో గ్లాస్ తయారీ యూనిట్‌ను నెలకొల్పనున్నామని అన్నారు. దక్షిణాఫ్రికాలో 1.5 బిలియన్ డాలర్ల పెట్టుబడులను వేదాంత పెట్టాలని నిర్ణయించిందన్నారు.



రేటు తగ్గింపునకే ఆర్‌బిఐ మొగ్గు

నిపుణుల అభిప్రాయం

న్యూఢిల్లీ: స్థూల ఆర్థిక గణాంకాల, ఇతర అంశాల దృష్ట్యా ఈసారి ఆర్‌బిఐ(భారతీయ రిజర్వు బ్యాంక్) వడ్డీ రేట్లను తగ్గించే అవకాశాలు ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. ఫిబ్రవరి నెల ద్రవ్యపరపతి సమీక్షా సమావేశంలో ఆర్‌బిఐ తన ఆలోచనను మార్చుకోవచ్చని, జూన్ నుంచి రేట్ల తగ్గింపు మొదలుబెట్టవచ్చని రాయిటర్స్ పోల్‌లో పాల్గొన్న విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. వచ్చే త్రైమాసికం నుంచి ఆర్‌బిఐ రేట్లను పెంచుతుందని ఎక్కువమంది ఆర్థికవేత్తలు గత నెల సర్వేలో అభిప్రాయపడ్డారు. అయితే ఉర్జిత్ రాజీనామా అనంతరం వీరి అంచనాలు మారాయి.

స్టాక్ మార్కెట్

ఈ రోజు మార్కెట్ ముగింపు		మార్పు	%
సెన్సెక్స్	36,195.10	86.63	(0.24%)
నిఫ్టీ	10,849.80	18.30	(0.17%)

బులియన్



బంగారం ధర

నగరం	ధర (రూ / 10 గ్రాములు)		
	22 క్యారట్	24 క్యారట్	మార్పు(%)
చెన్నై	30890	33037.43	0.13%
ముంబై	31720	33925.13	0%
ఢిల్లీ	31550	33743.32	0.16%
కోల్‌కతా	31860	34074.87	0.41%
కేరళ	30100	32192.51	0%
బెంగళూరు	30300	32406.42	0.17%
హైదరాబాద్	30890	33037.43	0.13%
గల్ఫ్	136.28	145.75	0.17%

వెండి ధర (రూ./ కిలో)

చెన్నై	₹ 42259.00
ముంబై	₹ 42259.00
ఢిల్లీ	₹ 42259.00
కోల్‌కతా	₹ 42259.00
హైదరాబాద్	₹ 42259.00



మధ్యంతర బడ్జెట్-2019లో సామాన్యుడు కోరుకునేదేమిటి?





న్యూఢిల్లీ: కొద్ది నెలల్లో లోక్‌సభ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ప్రభుత్వం ఆఖరి బడ్జెట్ కోసం తీవ్ర కసరత్తు చేస్తోంది. కేంద్రం ప్రవేశపెట్టబోయే బడ్జెట్ ఎలా ఉండబోతుంది? ఈ బడ్జెట్ నుంచి సామాన్య ప్రజలు కోరుకునేదేమిటి? అనే సందేహా లు నెలకొన్నాయి. ఇటీవల 'లోకల్ సర్కిల్స్' సంస్థ చేపట్టిన సర్వేలో అనేక అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఎక్కువ మంది పౌరులు.. ఓటాన్ అకౌంట్‌కు బదులు పూర్తి బడ్జెట్ కావాలని కోరుకుంటున్నారు. దాదాపు 66 శాతం మంది ప్రజలు ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ మధ్యంతర బడ్జెట్‌లో పన్నులకు సంబంధించిన నిర్ణయాలు ఉండాలని 64 శాతం మంది, వ్యవసాయానికి ఎక్కువ ప్రాధాన్యతనివ్వాలని 43 శాతం, మౌలిక సదుపాయాలకు 23 శాతం పౌరులు కోరుతున్నారు. వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి పైనే ఈమధ్యంతర బడ్జెట్–2019లో ఎక్కువగా ఫోకస్ పెట్టాలని 43 శాతం ప్రజలు కోరుతున్నారు. రైల్వేలో శుభ్రత, భద్రత, ఉత్తమ సేవలు, సమయ పాలన వంటివి ఉండాలని చాలా వరకు పౌరులు భావిస్తున్నారు. వేగవంతమైన వృద్ధి కోసం ఈ బడ్జెట్‌లో ప్రభుత్వ పెట్టుబడులు పెంచాలని 35 శాతం ప్రజ లు కోరుకుంచున్నారు. అలాగే అంకుర సంస్థలను గుర్తించి, వాటికి పన్నుల విషయంలో ప్రోత్సాహకాలు అందివ్వాలని 73 శాతం పౌరులు కోరుకుంటున్నారు. ఇంకా ఆరోగ్య సంరక్షణ కోసం ప్రభు త్వం అత్యధిక ప్రాధాన్యతనివ్వాలని, ప్రభుత్వ–ప్రైవేటు ఆసుపత్రులు మెరుగైన పర్యవేక్షణ, బాధ్యతను కల్గివుండేలా పెట్టుబడులను పెంచాలని 43 శాతం పౌరులు కోరుకుంటున్నారు. తొలిసారి గృహ కొనుగోలుదారులకు వడ్డీ రేటులో తగ్గింపునివ్వాలని 31 శాతం ప్రజలు భావిస్తున్నారు.

మధ్యతరగతి ప్రజలను ఆకర్షించేలా!



అయితే ఈ బడ్జెట్‌తో మధ్యతరగతి ప్రజలను ఆకర్షించాలని ప్రభుత్వం భావిస్తోంది. దీనికి కారణం కొద్ది నెలల్లో ఎన్నికలు ఉండడమే. అరుణ్ జైట్లీ క్యాన్సర్ చికిత్స నిమిత్తం అమెరికా వెళ్లడంతో ఆయన స్థానంలో రైల్వే మంత్రి పీయూష్ గోయల్ బాధ్యతలు చేపట్టారు. గోయల్ బడ్జెట్ ఎలా ఉండనుందనే ఆసక్తి నెలకొంది. కేంద్రం ప్రవేశ పెట్టబోయే బడ్జెట్ మీద కొన్ని అంచనాలను మాత్రం మార్కెట్ విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఈ ఫిబ్రవరి 1న బడ్జెట్ కు ముందస్తు కసరత్తులైన ఓట్ ఆన్ అకౌంట్‌ను ప్రవేశపెడ్తారు. ఆ తరువాత ఫిబ్రవరి 28న డైరెక్ట్ ట్యాక్స్ కోడ్ రిపోర్ట్‌ను ఆవిష్కరిస్తారు. ఈ నివేదిక లో పన్ను రేట్ల సవరణ, లేదా రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పన్ను మినహాయింపులు వంటివి ఉంటే వివాదాలకు దారి తీస్తుందని తెలుస్తోంది. ఇప్పటికే ప్రభుత్వం తరపున ఇస్తున్న సబ్సీడీలు, రాయితీలు, రుణ మాఫీల వంటి పథకాలను ఏ రాజకీయ పార్టీ కూడా అడ్డుకోలేదు. ఎందుకంటే వారికి ఓటు బ్యాంక్ ముఖ్యం తప్ప రిజర్వ్ బ్యాంక్ ముఖ్యం కాదు. అలాగే రానున్న బడ్జెట్‌లో గ్రామీణ ప్రజలకు ఉపశమన చర్యలు ఉండొచ్చు, వ్యాపారులు, వారి బిజినెస్‌ల మీద తీవ్ర ప్రభావం చూపే చర్యలు మాత్రం ఉండకపోవచ్చనే ఆర్థిక విశ్లేషకులు భావిస్తున్నారు. దేశంలో జిఎస్‌టి పన్నులు తగినంతగా వసూలు కాలేదు. గత సంవత్సరం లక్ష్యం 57శాతం పెట్టుకోగా వసూలు మాత్రం 49.4శాతమే అయ్యాయి. టెలికాం రంగం నుండి ఆదాయం, ఉప సంహరణల నుండి వచ్చే ఆదాయాలు, ప్రత్యక్ష పన్నుల నుండి వచ్చే ఆదాయం వంటి వాటిలో కొరత ఉన్నందున ఈసారి ప్రవేశ పెట్టబోయే బడ్జెట్‌లో అనుకున్నంతగా నిధుల కేటాయింపులు జరగకపపోవచ్చు. బడ్జెట్ కు కేటాయించే నిధుల కన్నా ఖర్చులు ఎక్కువగా ఉండొచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ సంవత్సరం ఏప్రిల్ , మే నెలల్లో జరగబోయే సార్వత్రిక ఎన్నికలతో బాటు ఐదు రాష్ట్రాల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఇటీవల జరిగిన నాలుగు రాష్ట్రాల ఎన్నికల్లో గ్రామీణ సంక్షోభం ఎక్కువగా ప్రభావం చూపింది. గ్రామీణ ప్రాంత ఓటర్లే ఈ సారి కూడా కీలకంగా మారనున్నారు. అందువల్ల కేంద్రం ఈ చివరి బడ్జెట్‌ను పూర్తిగా రైతుల ప్రయోజనాలు, గ్రామీణ ఆవాస్ యోజన వంటి పథకాలు, రుణ మాఫీలు వంటి జిమ్మిక్కుల బడ్జెట్ ను ప్రవేశపెట్టవచ్చని ఆర్థిక విశ్లేషకులు పేర్కొంటున్నారు.

జనవరికెందుకు జరిపారంటే..!



ఆర్థిక సంవత్సరం ఇక 1 జనవరి – 31 డిసెంబర్ • లాభనష్టాల బేరీజు...వ్యవసాయ కోణంలో కీలకం

న్యూఢిల్లీ : ఆర్థిక సంవత్సర కాలాన్ని జనవరి – డిసెంబర్‌కు మార్చాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తోంది. ఇప్పటి వరకూ బ్రిటిష్ ఆర్థిక క్యాలెండర్ ప్రకారం దేశ ఆర్థిక సంవత్సరం ప్రతి ఏటా ఎప్రిల్ నుంచి మరుసటి ఏడాది మార్చి వరకూ కొనసాగుతుంది. అయితే కొత్త సంవత్సరం ఆరంభం నుంచే సరికొత్త బడ్జెట్ ఉండాలని, ఈ దిశలో బడ్జెట్ ప్రక్రియ తేదీలను మార్చేందుకు కేంద్రం యోచిస్తోంది. దీనిపై కేంద్రం త్వరలోనే అధికారిక ప్రకటన వెలువరిస్తుందని ఆర్థిక విశ్లేషకులు తెలిపారు. ఆర్థిక సంవత్సర గమకాన్ని మార్చడం ఎందుకు? దీని వల్ల ప్రయోజనాలు ఏమిటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి కూడాదేశంలో ఆర్థిక సంవత్సరాన్ని బ్రిటన్ ఆర్థిక క్యాలెండర్‌కు అనుగుణంగా ఎప్రిల్ నుంచి మార్చి వరకూ ఉండే పద్ధతిలోనే సాగిస్తున్నారు. ఇక అమెరికాలో ఆర్థిక సంవత్సరం ప్రతి ఏటా అక్టోబర్ 1వ తేదీన ప్రారంభం అవుతుంది. ఇక జపాన్, దక్షిణాఫ్రికా, న్యూజీలాండ్, హాంగ్‌కాంగ్ వంటి దేశాలు బ్రిటన్ పద్ధతినే అనుసరిస్తూ ఎప్రిల్ 1 – మార్చి 31వ తేదీని పాటిస్తున్నాయి.భారతదేశంలోని పలు కార్పొరేట్ సంస్థలు ఎప్రిల్ 1 – మార్చి 31 ఆర్థిక సంవత్సర క్యాలెండర్‌నే పాటిస్తూ వస్తున్నాయి.

ఆర్థిక సంవత్సరం మార్పు ఎందుకు?

దేశంలో ఆర్థిక సంవత్సరాన్ని జనవరి 1 – డిసెంబర్ 31 కాలంగా మార్చాలని ఎందుకు అనుకుంటున్నారనేది కీలకంగా మారింది. ఆర్థిక సంవత్సరానికి కేటాయింపులు, వ్యయాలుతో కూడిన బడ్జెట్ చిట్టానే ఆయువు పట్టు అవుతుంది. దీని చుట్టూరా ఆర్థిక సంవత్సరం పరిభ్రమిస్తుంది. ప్రభుత్వ బడ్జెట్, నగదు నిర్వహణ వంటివి ఆర్థిక సంవత్సర గమనానికి కీలక కేంద్ర బిందువులుగా ఉంటాయి. ఆదాయం, వ్యయం పొందుపర్చాల్సి ఉంటుం ది. బడ్జెట్ అంచనాలపై రుతుపవనాల ప్రభావం, పనికాలాలు, బడ్జెట్‌కు పార్లమెంట్ ఆమోద ప్రక్రియకు పట్టే సమయం వంటివి అన్ని కూడా ఆర్థిక సంవత్సరంలో ప్రధానంగా ఇమిడి ఉంటాయని మైగవ్ సైట్ గతంలో పేర్కొంది.

మార్పుతో ఏం జరుగుతుంది?

ఇప్పుడున్న ఆర్థిక సంవత్సర కాలాన్ని మార్చడం వల్ల ఏం జరుగుతుందనేది కీలక ప్రశ్నగా మారింది. ఆర్థిక సంవత్సరం కాలం మార్పిడితో జనం సార్వత్రిక ఆర్థిక వ్యవహారాలలో స్వతహసిద్ధంగా మార్పులు చోటుచేసుకుంటాయి. ప్రత్యేకించి కార్పొరేట్ వర్గాలు, ఆదాయపు పన్నుల పరిధిలోకి వచ్చే వారు దీనికి అనుగుణంగా తమ డైరీలలో పనులు చక్కదిద్దుకోవల్సి ఉంటుంది. ఆదాయపు పన్ను దాఖలు, వ్యాపార కార్యకలాపాలను నూతన ఆర్థిక సంవత్సర కాలానికి తగ్గట్టుగా మార్చుకోవల్సి ఉంటుంది. ఇతరత్రా కూడా పలు మార్పులు చోటు చేసుకుంటాయి. ప్రత్యేకించి సరుకులపై కొత్త పన్నుల విధింపు ఆ క్రమంలో ధరల ఖరారు వంటివి కూడా జరగాల్సి ఉంటుంది.

ఆర్థిక సంవత్సర మార్పిడితో లాభాలేమిటీ?

నిజానికి గత ఏడిది నీతి ఆయోగ్ మండలి సమావేశంలో ప్రధాని మోడీ ఆర్థిక సంవత్సర కాలాన్ని మార్చాలని ప్రతిపాదించారు. ఇప్పుడున్న ఎప్రిల్ – మార్చి పద్ధతికి బదులుగా జనవరి 1 నుంచి డిసెంబర్ 31 వ తేదీకి తీసుకువెళ్లాలని సూచించారు. దేశం ప్రధానంగా వ్యవసాయికం, తద్వార వచ్చే ఆదాయం కీలకం అని, దీని పరిధిలోనే బడ్జెట్ రూపకల్పన ఉండాల్సి ఉందని ప్రధాని తెలిపారు. ఏడాదికి వ్యవసాయ ఆదాయం గురించి నిర్దిష్ట అంచనాలు వెల్లడి అయిన తరువాతనే బడ్జెట్ రూపకల్పన మంచిదని అభిప్రాయపడ్డారు. అత్యంత కీలకమైన జాతీయ సంవిధాన ప్రక్రియల సంస్థ భేటీలో ఈ కీలక అంశాన్ని ప్రస్తావించారు. దేశ వాతావరణ పరిస్థితిని బట్టి జూన్‌లో రుతుపవనాల ఆగమనం జరుగుతుంది. వర్షాలను బట్టి, పంట దిగుబడులను లెక్కలోకి తీసుకుని వివిధ రాష్ట్రాలు తమతమ కొత్త పథకాలను, వ్యయాలను అక్టోబర్ వరకూ వాయిదా వేసుకుంటాయి. అప్పుడు వీటిని ఖరారు చేసుకుని, తదనుగుణంగా అమలు చేయడం ప్రారంభిస్తే ఇక వాటి సంపూర్తికి కేవలం అర్థ సంవత్సరం ఉంటుంది. ఈలోగానే కొత్త బడ్జెట్ ఎప్రిల్ నుంచి మొదలవుతుంది. దీనితో తిరిగి వ్యయ అంచనాలు, కేటాయింపుల ప్రక్రియ కొత్తగా చేపట్టాల్సి వస్తోంది. దీనిని పరిగణనలోకి తీసుకుని దేశంలోని వ్యవసాయ ఉత్పత్తి చక్రాన్ని పరిగణనలోకి తీసుకుని జనవరి నుంచే ఆర్థిక సంవత్సరాన్ని రూపొందించాల్సిన అవసరం ఉందని ప్రధాని స్పష్టం చేశారు. వ్యవసాయిక దేశంలో సంబంధిత ఉత్పత్తులు, రైతాంగం ప్రాతిపదికగానే ప్రధానంగా బడ్జెట్ కేటాయింపులు దీనికి అనుగుణంగానే ఆర్థిక సంవత్సరం ఉండాలని ప్రధాని ప్రతిపాదించారు. దీనికి అనుగుణంగానే ఆర్థిక సంవత్సర కాలాన్ని మార్చేందుకు యోచిస్తోన్న కేంద్రం దీనిపై త్వరలోనే కీలక నిర్ణయం వెలువరిస్తుందని భావిస్తున్నారు.

గని కార్మికుడి అవశేషాలు వెలుగులోకి



షిల్లాంగ్ : మేఘాలయాలో జరిగిన గని ప్రమాదంలో ఒక కార్మికుడి మృతదేహాన్ని వెలికితీశారు. డిసెంబర్ 13వ తేదీన ఈ ఇరుకైన గనిలోకి కార్మికులు ప్రవేశించారు. ఉన్నట్లుండి 370 అడుగుల లోతున ఉధృతంగా నీరు చేరడం తరువాత వారి జాడ తెలియకుండా పోవడం జరిగింది. కార్మికులను గుర్తించే ప్రక్రియ ఇటీవలే నిలిచిపోయింది. అయితే గురువారం తిరిగి చేపట్టిన అన్వేషణలో ఒక మృతదేహం కుళ్లిపోయిన దశలో కనుగొన్నారు. దీనిని బయటకు తీశారు. భూగర్భ జలాలలో రిమోట్‌తో నిర్వహించే వాహనం (యుఆర్‌ఓవి) సాయంతో ఈ అవశేషాలను భూమి పొరల నుంచి తొలుత నీటి బయటకు తీసుకువచ్చారు. తరువాత ఉపరితలానికి చేర్చారని అధికారులు తెలిపారు. ఈ భౌతిక కాయాన్ని పోస్టుమార్టంకు తరలించారు. అధికార వర్గాలు ఈ గనిలో అత్యంత అధునాతన యంత్రాలను, కీలకమైన యుఆర్‌ఓవిని రంగంలోకి దింపారు.

'ఎస్‌సి, ఎస్‌టి' సవరణలపై స్టే కుదరదు

న్యూఢిల్లీ : ఎస్‌సి/ఎస్‌టి చట్టంలో ప్రతిపాదిత సవరణల నిలుపుదలకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఎస్‌సి, ఎస్‌టిలపై దాడుల ఘటనలలో నిందితులకు ముందస్తు బెయిల్ లేకుండా చేసేందుకు చట్టంలో సవరణలకు కేంద్రం ప్రతిపాదించింది. ఎస్‌సి ఎస్‌టి చట్టంపై గత ఏడాది మార్చి 20వ తేదీన సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పుపై కేంద్రం రివ్యూ పిటిషన్, సవరణలపై దాఖలైన సవాళ్లను కలిపి విచారించనున్నారు. న్యాయమూర్తి ఎకె సిక్రీతో కూడిన ధర్మాసనం సవరణలపై స్టే కుదరదని పేర్కొంటూ కేసు విచారణను వాయిదా వేసింది. ఈ పిటిషన్ల అంశాన్ని ప్రధాన న్యాయమూర్తి పరిధికి నివేదించారు. ఈ ధర్మాసనంలో జస్టిస్ యుయు లలిత్ కూడా సభ్యులుగా ఉన్నారు. ఎస్‌సి /ఎస్‌టి చట్టంలోని కటుతర నిబంధనలను దుర్వినియోగపరుస్తున్నారనే వాదనను పరిగణనలోకి తీసకుంటూ గత ఏడాది మార్చిలో ధర్మాసనం తీర్పు వెలువరించింది. ప్రభుత్వోద్యోగులపై దీనిని ఇష్టారాజ్యంగా ప్రయోగిస్తున్నారని పేర్కొంటూ ఈ చట్టం పరిధిలో తక్షణ అరెస్టులు చేయరాదని స్పష్టం చేసింది. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం యాంటిసిపేటరీ బెయిల్‌కు అవకాశం లేకుండా ఉండేలా చట్టానికి సవరణలు ప్రతిపాదించింది.

హైకోర్టు ఆస్తుల విభజనకు ఏకాభిప్రాయం

మన తెలంగాణ/హైదరాబాద్: హైకోర్టు చరాస్తులను జనాభా ప్రాతిపదికన పంచుకోవాలని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాలు ఏకాభిప్రాయానికి వచ్చాయి. హైదరాబాద్‌లోని హైకోర్టు ఆస్తుల విభజనపై ఇరు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు ఎస్‌కె జోషి, ఎసి పునేత, రెండు రాష్ట్రాల విభజన కమిటీ కన్వీనర్‌లు రామకృష్ణారావు, ప్రేమచంద్రారెడ్డి, రెండు హైకోర్టుల రిజిస్ట్రార్ జనరళ్ళు బుద్ధభవన్‌లో గురువారం సమావేశమై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా చరాస్తులను రాష్ట్ర పునర్విభజన చట్టం ప్రకారం జనాభా నిష్పత్తిలో ఆంధ్రప్రదేశ్ 58 శాతం, తెలంగాణ 42 శాతం చొప్పున పంచుకుందామన్న నిర్ణయం జరిగింది. ఏపీ చేసిన ప్రతిపాదనకు తెలంగాణ కూడా అంగీకారం తెలిపింది. ఈ నిర్ణయం మేరకు హైకోర్టు పరిధిలో ఉన్న 140 వాహనాలు, 900 కంప్యూటర్లు, ప్రింటర్లు, స్కానర్లు, లైబ్రరీ పుస్తకాలు, లెడ్ డిస్‌ప్లే బోర్డులు, మొబైల్ ఫోన్లను జనాభా ప్రాతిపదికన పంపిణీ అవుతాయి.

2,130 సర్పంచ్‌ల ఏకగ్రీవం

- ఆదిలాబాద్‌లో అత్యధికం, మేడ్చల్ మల్కాజ్‌గిరిలో అత్యల్పం
- రికార్డు స్థాయిలో పంచాయతీలు ఏకగ్రీవం
- ఒక్కో పంచాయతీకి రూ. 10 లక్షల చొప్పున మొత్తం రూ.230 కోట్లు



మన తెలంగాణ/హైదరాబాద్: తెలంగాణ ఏర్పడిన తరువాత జరుగుతున్న మొదటి పంచాయతీ ఎన్నికల్లో రికార్డు స్థాయిలో మొత్తం 2130 పంచాయతీ సర్పంచ్‌లు ఏకగ్రీవమయ్యాయి. అత్యధికంగా ఆదిలాబాద్ జిల్లాలో 170 పంచాయతీ సర్పంచ్‌లు ఏకగ్రీవం కాగా, మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లాలో 09 మాత్రమే ఏకగ్రీవమయ్యాయి. అయితే ఇక్కడ పంచాయతీల సంఖ్య కూడా తక్కువగానే ఉంది. మహబూబ్‌నగర్ జిల్లాలో 126, మహబూబాబాద్ జిల్లాలో 117, వరంగల్ రూరల్ జిల్లాలో 107, పెద్దపల్లి జిల్లాలో 19, కరీంనగర్ జిల్లాలో 22, రాజన్న సిరిసిల్లలో 43, జగిత్యాల్‌లో 42, వనపర్తిలో 45, వరంగల్ అర్బన్ జిల్లాలో 17 పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. ఏకగ్రీవమైన పంచాయతీలకు ప్రభుత్వం తరపున రూ.10 లక్షల నజరాన అందనుంది. అలాగే టిఆర్‌ఎస్ ఎంఎల్ఎలు రూ.5 లక్షల చొప్పున ఇవ్వాలని నిర్ణయించారు. ఈ లెక్కన ప్రభుత్వం తరపున అందే రూ.10 లక్షల చొప్పున 2130 గ్రామాలకు రూ.213 కోట్లు ఇవ్వాల్సి ఉంటుంది. 2013 జరిగిన పంచాయతీ ఎన్నికల్లో ఉమ్మడి ఎపి మొత్తం 2642 సర్పంచ్‌లు ఏకగ్రీవం కాగా, తెలంగాణలో 8778 పంచాయతీలకు గాను 662 మాత్రమే ఏకగ్రీవమయ్యాయి. ఈసారి 12,732 గ్రామాలకు గాను 2130 ఏకగ్రీవం కావడం విశేషం. అలాగే 29,927 వార్డులు ఏకగ్రీవమయ్యాయి. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం గురువారం మూడో విడతలో ఏకగ్రీవమైన పంచాయతీల జాబితాను విడుదల చేయడంతో మొత్తం లెక్క తేలింది. మొదటి విడతలో 769 పంచాయతీ సర్పంచ్ ఏకగ్రీవమైతే, రెండో విడతలో 788, మూడో విడతలో 573 పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. అలాగే మొదటి విడతలో 10, 654 వార్డులు, రెండో విడతలో 10,317, మూడో విడతలో 8956 వార్డులు ఏకగ్రీవమయ్యాయి. ఇందులో అత్యధికంగా టిఆర్ఎస్ పార్టీ బలపర్చిన వారే ఉండటం గమనార్హం. ఈ నెల 1వ తేదీన 12,732 గ్రామాలకు, 1,13,190 వార్డులకు నోటిఫికేషన్ విడుదల చేసింది. మూడు విడతల వారీగా ఎన్నికలకు నోటీసులు ఇచ్చింది.ఇందులో 24 పంచాయతీలకు నామినేషన్లు రాకపోవడం, వచ్చిన వాటిలో సరైనవి లేకపోవడంతో వాటికి ఎన్నికలు నిర్వహించడం లేదు. అలాగే 471 వార్డులకు కూడా ఎన్నికలు నిర్వహించడం లేదు.

వారణాసినుంచే ప్రధాని పోటీ?

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోడీ మరోసారి ఉత్తర ప్రదేశ్‌లోని వాణాసి నియోజకవర్గంనుంచే లోక్‌సభకు పోటీ చేయనున్నట్లు భారతీయ జనతాపార్టీలోని అత్యంత విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. కాంగ్రెస్ పార్టీ ప్రియాంక గాంధీని ఉత్తరప్రదేశ్ తూర్పు ప్రాంత పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జిగా నియమిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ అధికారికంగా ప్రకటించిన ఒక రోజు తర్వాత పరిణామం చోటు చేసుకోవడం గమనార్హం. ప్రియాంక ప్రత్యక్ష రాజకీయాల్లోకి ప్రవేశిస్తున్న వార్త దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తుండగా తూర్పు యుపినుంచి మోడీ పోటీ చేయనున్నట్లు వార్త రావడం యుపిలో తన పట్టును నిలుపుకోవడానికి బిజెపి ఒక వ్యూహం ప్రకారం తీసుకున్న నిర్ణయంగా భావిస్తున్నారు. 2014 లోక్‌సభ ఎన్నికల్లో మాదిరిగానే 2019లో కూడా మోడీ రెండు నియోజకవర్గాలనుంచి పోటీ చేస్తారని గత ఏడాది ఊహాగానాలు బలంగా వినిపించాయి.

కరీంనగర్‌కు అవార్డు

బేటీ బచావో బేటీ పఢావో పథకానికి
కేంద్ర మంత్రి చేతుల మీదుగా అందుకున్న కలెక్టర్



మన తెలంగాణ / హైదరాబాద్ : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'బేటీ బచావో బేటీ పఢావో' పథకాన్ని సమర్ధవంతంగా అమలు చేయడంలో దేశం మొత్తం మీద ఎంపికైన పదహారు జిల్లాల్లో కరీంనగర్ కూడా చోటు సంపాదించుకుంది. సమర్ధవంతమైన సమిష్టి కార్యాచరణ విభాగంలో కరీంనగర్ జిల్లాకు ఈ అవార్డు లభించగా బాలికల దినోత్సవం సందర్భంగా కేంద్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి మనేకాగాంధీ ఈ అవార్డును జిల్లా కలెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్‌కు అందజేశారు.

రైతు రుణం మాఫీ రూ.13

కంగుతిన్న మధ్యప్రదేశ్ రైతు

అగర్ మాల్వా (మధ్యప్రదేశ్): మధ్యప్రదేశ్‌లో ఓ రైతుకు రూ.24 వేలు మాఫీ కావలసి ఉండగా రూ.13 మాత్రమే మాఫీ కావడంతో ఆ రైతు కంగు తిన్నాడు. అధికారులు రుణ మాఫీకి సంబంధించిన జాబితాను బుధవారం విడుదల చేయగా, శివలాల్ కటారియా అనే రైతు తనకు మాఫీ అయిన రుణం మొత్తాన్ని చూసి నివ్వెరపోయాడు.ఎందుకంటే అతనికి 13 రూపాయలు మాఫీ అయినట్లు ఆ జాబితాలో ఉంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మధ్యప్రదేశ్‌లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ రూ.2 లక్షల లోపు రైతు రుణాలను మాఫీ చేస్తున్నట్లు ప్రకటించడం తెలిసిందే. దీంతో రైతులంతా తాము తీసుకున్న రుణాల వివరాలను అధికారులకు అందించారు. అగర్ మాల్వా జిల్లాలోని నిపానియా బైజ్‌నాథ్ గ్రామానికి చెందిన శివలాల్ కటారియా కూడా తాను తీసుకున్న రూ.23,815ల వివరాలను అధికారులకు అందించాడు. మొత్త రుణం మాఫీ అవుతుందని అతను ఆశతో ఉన్నాడు. కానీ కేవలం 13 రూపాయలు మాఫీ అయిందని చెప్పి వాపోయాడు. అధికారులను ప్రశ్నించగా.. రుణ మాఫీ ప్రకటించే రోజుకు తన పేరు మీద ఎలాంటి రుణం లేదని చెబుతున్నారని, ఈ పథకంలో అవకతవకలు జరుగుతున్నాయని అంటున్నాడు. ఈ అంశంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పాడు. మరోపక్క రాష్ట్ర ప్రభుత్వం కూడా అవకతవకలను సరి చేసేందుకు చర్యలు తీసుకుంటామని అంటోంది.

ఈ విషయాన్ని విలేఖరులు జిల్లా కలెక్టర్ అజయ్ గుప్తా దృష్టికి తీసుకెళ్లగా, ఈ విషయాన్ని పరిశీలిస్తానని అంటూ,జిల్లాలో రుణ మాఫీ వర్తించే రైతుల సంఖ్య భారీగా ఉందన్నారు. నిజంగానే రుణ మాఫీ రైతులకు వరంలాంటిదని కటారియా అంటూ, పది నెలల క్రితం తాను తీసుకున్న రుణం పూర్తిగా మాఫీ చేస్తారని ఆశిస్తున్నట్లు చెప్పాడు.



పిఎస్‌ఎల్‌వి–సి44 ప్రయోగం సక్సెస్

నిర్ణీత కక్ష్యలోకి కలాంశాట్, మైక్రోశాట్

శ్రీహరికోట: కొత్త సంవత్సరాన్ని ఇస్రో విజయంతో ఆరంభించింది. పిఎస్‌ఎల్‌వి–సి 44 రాకెట్‌ను సక్సెస్‌ఫుల్‌గా ప్రయోగించింది. గురువారంనాడు రాత్రి 11.37 గంటలకు నింగిలోకి దూసుకెళ్లింది. తమిళనాడు విద్యార్థులు రూపొందించిన కలాంశాట్‌తో పాటు రెండు మైక్రోశాట్‌లను విజయవంతంగా మోసుకెళ్లింది. తమిళనాడులోని చెన్నైకి చెందిన స్పేస్ కిడ్జ్ ఇండియాకు చెందిన విద్యార్థులు కేవలం రూ.12లక్షలతో ఆరు రోజుల్లోనే అతి తేలికైన ఉపగ్రహాన్ని రూపొందించారు. దీనికి కలామ్‌శాట్ అని పేరు పెట్టారు. మొత్తం 740 కిలోల బరువైన ఈ రెండు ఉపగ్రహాలను పిఎస్‌ఎల్‌వి నిర్ణీత కక్ష్యంలో ప్రవేశపెట్టింది . ఇవి మిలిటరీ ఇమేజింగ్ ఉపగ్రహాలు. ఇందులో ఒకదాని పేరు మైక్రోశాట్–ఆర్. దీనిని డిఆర్‌డిఒ రూపొందించింది. పిఎస్‌ఎల్‌వి సిరీస్‌లో ఇది 46వ ప్రయోగం కావడం విశేషం.

వచ్చే నెల నుంచే కోటా

న్యూఢిల్లీ: వచ్చే నెలనుంచి అన్ని కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలను ఇటీవల ఆమోదించిన ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు పది శాతం రిజర్వేషన్ ఆధారంగా భర్తీ చేయడం జరుగుతుందని ప్రభు త్వం ఒక ఉత్తర్వులో తెలియజేసింది. ఇడబ్ల్యుఎస్ కోటా అమలుకు సంబంధించి పాటించాల్సిన విధి విధానాలపై త్వరలోనే పూర్తి వివరాలతో కూడి న ఆదేశాలను జారీచేయడం జరుగుతుందని సి బ్బంది వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆ ఉత్తర్వు లో పేర్కొంది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు, సర్వీసుల్లో ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు పది శాతం రిజర్వేషన్లను అమలు చేయడం జరుగుతుంది. 2019 ఫిబ్రవరి 1నుంచి నోటిఫై చేసే అన్ని ప్రభుత్వ ఉ ద్యోగాలలోను ఇది అమలు అవుతుంది' అని ఉత్తర్వులో పేర్కొన్నారు. ప్రస్తు తం ఎస్‌సిలు, ఎస్‌టిలు, సామాజికంగా, ఆర్థికం గా వెనుకబడిన వర్గాలకు అమలు అవుతున్న రిజర్వేషన్ల పథకాల కిందికి రాని, ఏడాదికి రూ.8 లక్షలకన్నా తక్కువ ఆదా యం కలిగిన వారు ఆర్థికంగా వెనుకబడిన వర్గాలుగా పరిగణింపబడతారని కూడా సామాజిక న్యాయం, సాధికారికత మంత్రిత్వ శాఖ జారీ చేసిన ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు. అంతేకాకుండా అయిదు ఎకరాలు అంతకు పైబడిన వ్యవసాయ భూమి, నోటిఫైడ్ మున్సిపాలిటీల్లో వెయ్యి చదరపు అడుగులు, అంతకు పైబడిన రెసిడెన్షియల్ ఫ్లాట్ , వందచదరపు గజాలు, అంతకుపైబడిన నివాస స్థలం, మిగతా ప్రాంతాల్లో 200 చదరపు గజాలు, అంతకు పైబడిన నివాసస్థలం కలిగి ఉన్నవారిని వారి కుటుంబ ఆదాయంతో సంబంధం లేకుండా ఇడబ్ల్యుఎస్‌లుగా గుర్తించడం జరగదని కూడా ఆ ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.



గురువారంనాడు ఢిల్లీలో రాష్ట్రీయ బాల పురస్కారాల విజేతలతో ముచ్చటిస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ

> రానున్న ప్రపంచకప్‌లో సీనియర్ బౌలర్ అశ్విన్‌కు చోటు కల్పించాలి. ఇంగ్లండ్ పిచ్‌లపై అశ్విన్‌ను ఆడించడమే మంచిది. అతను జట్టులో ఉంటే గెలుపు అవకాశాలు మరింత పెరుగుతాయి.
> – టీమిండియా మాజీ క్రికెటర్ గంభీర్



అదరగొట్టిన మిథాలీ సేన

కివీస్‌పై భారత్ ఘన విజయం

నేపియర్: భారత మహిళా క్రికెట్ జట్టు కూడా పురుషుల జట్టు బాటలోనే ప్రయాణించింది. న్యూజిలాండ్‌తో గురువారం జరిగిన తొలి వన్డేలో మిథాలీ సేన 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ విజయంతో సిరీస్‌లో 1–0 ఆధిక్యాన్ని అందుకుంది. ముందుగా బ్యాటింగ్ చేసిన ఆతిథ్య న్యూజిలాండ్ జట్టు 48.4 ఓవర్లలో 192 పరుగులకు ఆలౌటైంది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన భారత్ 33 ఓవర్లలోనే కేవలం ఒక వికెట్ మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. ఓపెనర్లు స్మృతి మందన (105), జమీమా రోడ్రిక్స్ 81(నాటౌట్) అద్భుత బ్యాటింగ్‌తో భారత్‌కు ఘన విజయం సాధించి పెట్టారు. ఊరిస్తున్న లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు ఓపెనర్లు మందన, రోడ్రిక్స్ కళ్లు చెదిరే ఆరంభాన్ని ఇచ్చారు. కివీస్ బౌలర్లను దీటుగా ఎదుర్కొన్న వీరిద్దరూ స్కోరును పరిగెత్తించారు. ఈ జోడీని విడగొట్టేందుకు కివీస్ బౌలర్లు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. అద్భుత బ్యాటింగ్‌ను కనబరిచిన మందన, రోడ్రిక్స్ పరుగుల వరద పారించారు.



మందన తన మార్క్ షాట్లతో అలరించింది. ఒకవైపు వికెట్‌ను కాపాడుకుంటూనే చెత్త బంతులను ఫోర్లు, సిక్సర్లుగా మలుస్తూ స్కోరును నడిపించింది. రోడ్రిక్స్ కూడా అద్భుతంగా ఆడింది. వీరిద్దరూ తొలి వికెట్‌కు రికార్డు స్థాయిలో 180 పరుగులు జోడించారు. అసాధారణ బ్యాటింగ్‌ను కనబరిచిన మందన 104 బంతుల్లో 9 ఫోర్లు, మరో మూడు సిక్స్‌లతో 105 పరుగులు చేసి ఔటైంది. మరోవైపు రోడ్రిక్స్ 94 బంతుల్లో 9 ఫోర్లతో 81 పరుగులు చేసి అజేయంగా నిలిచింది. దీంతో భారత్ ఘన విజయం సాధించింది. అంతకుముందు తొలుత బ్యాటింగ్ చేసిన కివీస్‌ను భారత బౌలర్లు తక్కువ స్కోరుకే పరిమితం చేశారు. ప్రారంభంలో ఓపెనర్లు సుజి బేట్స్, సోఫీ డివైన్‌లు బాగానే ఆడారు. ఇద్దరు తొలి వికెట్‌కు 61 పరుగులు జోడించారు. బేట్స్ 36, సోఫీ 28 పరుగులు చేశారు. కెప్టెన్ సాటర్‌వైట్ 31, అమేలియా కర్ 28, హన్నా రోవె 25 తప్ప మిగతావారు విఫలమయ్యారు. దీంతో కివీస్ ఇన్నింగ్స్ 192 పరుగుల వద్దే ముగిసింది. భారత బౌలర్లలో ఎక్తా బిస్త్, పూనమ్ యాదవ్ మూడేసి వికెట్లు పడగొట్టారు.

ఫైనల్లో క్వితోవా, ఒసాకా

టైటిల్ పోరుకు నాదల్

ఆస్ట్రేలియా ఓపెన్



మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ మహిళల సింగిల్స్‌లో జపాన్ స్టార్ నవోమి ఒసాకా, చెక్ రిపబ్లిక్ దిగ్గజం పెట్రా క్వితోవా టైటిల్ పోరుకు చేరుకున్నారు. మరోవైపు పురుషుల సింగిల్స్‌లో రెండో సీడ్ రఫెల్ నాదల్ (స్పెయిన్) ఫైనల్లో ప్రవేశించాడు. గ్రీక్ వీరుడు స్టెఫానోస్ పోరాటం సెమీస్‌లోనే ముగిసింది. స్పెయిన్ బుల్ నాదల్ అతని జైత్రయాత్రకు బ్రేక్ వేశాడు. మహిళల సింగిల్స్‌లో ఏడో సీడ్ కరోలినా ప్లిస్కోవా (చెక్), డానిల్లె రోస్ కొలిన్స్ (అమెరికా)లు సెమీస్‌లోనే ఇంటిదారి పట్టారు. ప్లిస్కోవాను ఒసాకా, కొలిన్స్‌ను క్వితోవా ఓడించారు. శనివారం జరిగే ఫైనల్లో ఒసాకా, క్వితోవాలు అమీతుమీ తేల్చుకుంటారు. కాగా, వీరిలో ఎవరూ గెలిచినా కెరీర్‌లో తొలి ఆస్ట్రేలియా ఓపెన్ టైటిల్ చేరుతుంది. ప్లిస్కోవా ఇంతకు ముందు రెండు సార్లు వింబుల్డన్ ఓపెన్‌లో విజేతగా నిలిచింది. కాగా, ఒసాకా కిందటి ఏడాది అమెరికా ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టైటిల్ సాధించింది. కాగా, శనివారం జరిగే ఫైనల్లో ఎవరూ గెలిచినా అరుదైన రికార్డును అందుకుంటారు.


హోరాహోరీ

ఒసాకా–ప్లిస్కోవాల మధ్య జరిగిన సెమీఫైనల్ పోరు నువ్వానేనా అన్నట్టుగా సాగింది. ఇద్దరు ప్రతి పాయింట్ కోసం సర్వం ఒడ్డారు. దీంతో పోరు హోరాహోరీగా కొనసాగింది. ఉత్కంఠభరితంగా సాగిన పోరులో ఒసాకా 6–2, 4–6, 6–4తో విజయం సాధించింది. తొలి సెట్‌లో ఒసాకా ఆధిపత్యం చెలాయించింది. చక్కని షాట్లతో అలరించిన ఒసాకా అలవోకగా సెట్‌ను సొంతం చేసుకుంది. కానీ, రెండో సెట్‌లో ప్లిస్కోవా పుంజుకుంది. ఒసాకాను హడలెత్తిస్తూ ముందుకు సాగింది. ఒసాకా కీలక సమయంలో ఒత్తిడికి గురైంది. దీన్ని తనకు అనుకూలంగా మార్చుకున్న ప్లిస్కోవా సునాయాసంగా సెట్‌ను దక్కించుకుంది. ఫలితాన్ని తేల్చే మూడో సెట్ కూడా హోరాహోరీగా సాగింది. ప్రారంభంలో ప్లిస్కోవా ఆధిక్యంలో నిలిచింది. కానీ, ఒసాకా అద్భుత పోరాట పటిమను కనబరుస్తూ మళ్లీ పైచేయి సాధించింది. చివరి వరకు ఆధిక్యాన్ని నిలబెట్టుకుంటూ మ్యాచ్‌ను సొంతం చేసుకుని టైటిల్ పోరుకు దూసుకెళ్లింది.

క్వితోవా అలవోకగా

మరో సెమీఫైనల్లో 8వ సీడ్ క్వితోవా అలవోక విజయం సాధించింది. అమెరికా స్టార్ కొలిన్స్‌తో జరిగిన పోరుల క్వితోవా 7–6, 6–0తో విజయం సాధించింది. తొలి సెట్‌లో క్వితోవాకు ప్రత్యర్థి నుంచి గట్టి పోటీ ఎదురైంది. కొలిన్స్ అద్భుత పోరాట పటిమతో క్వితోవాకు గట్టి పోటీ ఇచ్చింది. దీంతో పోరు టైబ్రేకర్ వరకు వెళ్లింది. ఇందులో క్వితోవా జయకేతనం ఎగుర వేసింది. అయితే రెండో సెట్‌లో మాత్రం క్వితోవాకు ఎదురులేకుండా పోయింది. ప్రారంభం నుంచే చెలరేగి ఆడిన క్వితోవా ఏదశలోనూ ప్రత్యర్థికి కోలుకునే అవకాశం ఇవ్వలేదు. చూడచక్కని షాట్లతో విరుచుకు పడిన క్వితోవా ఒక్క గేమ్ కూడా కోల్పోకుండానే సెట్‌ను సొంతం చేసుంది. ఈ విజయంతో పెట్రా క్వితోవా ఫైనల్ బెర్త్ ఖరారైంది. శనివారం జరిగే తుది పోరులో జపాన్ సంచలనం ఒసాకాతో తలపడుతుంది.





ఎదురులేని నాదల్

పురుషుల సింగిల్స్‌లో అగ్రశ్రేణి ఆటగాడు రఫెల్ నాదల్ ఫైనల్‌కు చేరుకున్నాడు. గురువారం జరిగిన సెమీఫైనల్లో నాదల్ 6–2, 6–4, 6–0తో గ్రీకు వీరుడు స్టెఫానోస్ సిట్సిపాస్‌ను ఓడించాడు. ప్రారంభం నుంచే దూకుడుగా ఆడిన నాదల్ ఏ దశలోనూ ప్రత్యర్థికి కోలుకునే అవకాశం ఇవ్వలేదు. చూడచక్కని ఆటతో అలరించిన నాదల్ అలవోకగా మూడు సెట్లు గెలుచుకుని టైటిల్ పోరుకు అర్హత సాధించాడు. అసాధారణ షాట్లతో చెలరేగిన నాదల్ ఎటువంటి ప్రతిఘటన లేకుండానే మొదటి సెట్‌ను సొంతం చేసుకున్నాడు. రెండో సెట్‌లో ప్రత్యర్థి నుంచి కాస్త ప్రతిఘటన ఎదురైంది. అయితే అది తాత్కాలికమే అయింది. మళ్లీ పుంజుకున్న నాదల్ సెట్‌ను సొంతం చేసుకున్నాడు. ఇక, మూడో సెట్‌లో అయితే నాదల్ జోరుకు ఎదురేలేకుండా పోయింది. ప్రత్యర్థికి ఒక్క గేమ్ కూడా ఇవ్వకుండానే సెట్‌ను సాధించి ఫైనల్‌కు చేరుకున్నాడు.



రాహుల్, హార్దిక్‌లపై సస్పెన్షన్ ఎత్తివేత

ముంబయి: మహిళలపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసి చిక్కుల్లో పడిన టీమిండియా యువ క్రికెటర్లు లోకేశ్ రాహుల్, హార్దిక్ పాండ్యలకు ఊరట లభించింది. వీరిద్దరిపై విధించిన సస్పెన్షన్‌ను బిసిసిఐ పాలకుల కమిటీ ఎత్తి వేసింది. అయితే వీరిపై విచారణ మాత్రం జరుగుతుందని పాలకుల కమిటీ స్పష్టం చేసింది. రానున్న కీలక సిరీస్‌ల నేపథ్యంలో రాహుల్, పాండ్యలపై విధించిన నిషేధాన్ని ఎత్తి వేయాలని రోజురోజుకు ఒత్తిడి పెరగడంతో కమిటీ ఈ నిర్ణయం తీసుకుంది. వీరిపై సస్పెన్షన్‌ను ఎత్తి వేస్తున్నట్టు పాలకుల కమిటీ గురువారం అధికారికంగా ప్రకటించింది. దీంతో వీరిద్దరూ టీమిండియాకు ఆడేందుకు మార్గం సుగమం అయ్యింది. సొంత గడ్డపై ఆస్ట్రేలియాతో జరిగే సిరీస్‌లో వీరిద్దరికి తిరిగి స్థానం లభించే అవకాశాలు మెరుగు పడ్డాయి. ప్రముఖ బాలీవుడ్ నిర్మాత కరణ్ జోహార్ నిర్వహిస్తున్న కాఫీ విత్ కరణ్ కార్యక్రమంలో పాల్గొన్న రాహుల్, పాండ్యలు మహిళలపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. దీంతో ఈ వ్యాఖ్యలపై పెను దుమారం లేచింది. దీన్ని తీవ్రంగా పరిగణించిన బిసిసిఐ పాలకుల కమిటీ రాహుల్, పాండ్యలపై తాత్కాలిక నిషేధాన్ని విధించింది. అయితే వీరిపై విధించిన నిషేధాన్ని ఎత్తి వేయాలని బిసిసిఐ ప్రతినిధి ఖన్నా ఇటీవల పాలకుల కమిటీకి లేఖ రాశారు. దీనికి స్పందించిన కమిటీ నిషేధాన్ని ఎత్తి వేస్తున్నట్టు ప్రకటించింది.

క్వార్టర్స్‌లో సింధు, శ్రీకాంత్

సైనా నెహ్వాల్ ముందుకు.. ఇండోనేషియా మాస్టర్స్

జకార్తా: ఇండోనేషియా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత స్టార్ షట్లర్లు పి.వి.సింధు, కిదాంబి శ్రీకాంత్, సైనా నెహ్వాల్‌లు క్వార్టర్ ఫైనల్లో ప్రవేశించారు. మహిళల సింగిల్స్‌లో సింధు, సైనాలు ప్రిక్వార్టర్ ఫైనల్ పోటీల్లో విజయం సాధించారు. మరోవైపు పురుషుల సింగిల్స్‌లో అగ్రశ్రేణి ఆటగాడు శ్రీకాంత్ క్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లాడు. రెండో సీడ్‌గా బరిలోకి దిగిన సింధు ప్రిక్వార్టర్ ఫైనల్లో 23–21, 21–7 తేడాతో స్థానిక క్రీడాకారిణి మరిస్కాను ఓడించింది. ప్రారంభ సెట్‌లో సింధుకు ప్రత్యర్థి నుంచి తీవ్ర పోటీ ఎదురైంది. ఇద్దరు ప్రతి పాయింట్ కోసం తీవ్రంగా పోరాడారు. దీంతో సెట్ ఉత్కంఠభరితంగా సాగింది. ఒక దశలో సింధు తీవ్ర ఒత్తిడిలో కనిపించింది. అయితే కీలక సమయంలో మళ్లీ పుంజుకుంది. చివరికి సెట్‌ను గెలిచి ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఇక, రెండో సెట్‌లో సింధు ప్రారంభం నుంచే దూకుడుగా ఆడింది. ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా ఆడుతూ ముందుకు సాగింది. చూడచక్కని షాట్లతో అలరించిన సింధు అలవోకగా సెట్‌ను గెలిచి క్వార్టర్ ఫైనల్ బెర్త్‌ను ఖాయం చేసుకుంది. మరో పోటీలో సైనా 21–17, 21–15 తేడాతో ఇండోనేషియాకే చెందిన ఫిట్రియానిను ఓడించింది. సైనా ప్రారంభం నుంచే ఆధిపత్యం చెలాయించింది. చక్కటి షాట్లతో ప్రత్యర్థికి ముచ్చెమటలు పట్టించింది. సైనా దూకుడును ప్రదర్శించడంతో ప్రత్యర్థికి ఇబ్బందులు తప్పలేదు. ఇదే క్రమంలో సైనా తొలి సెట్‌ను దక్కించుకుంది. తర్వాతి సెట్‌లో సైనా మరింత చెలరేగిపోయింది. ప్రత్యర్థిని హడలెత్తిస్తూ లక్ష్యం దిశగా అడుగులు వేసింది. చివరికి సెట్‌ను గెలిచి క్వార్టర్ ఫైనల్ బెర్త్‌ను సొంతం చేసుకుంది. ఇక, పురుషుల సింగిల్స్‌లో 8వ సీడ్ శ్రీకాంత్ అలవోక విజయం సాధించాడు. జపాన్ ఆటగాడు కెంటా నిషిమోటాతో జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో శ్రీకాంత్ 21–14, 21–9తో జయభేరి మోగించాడు. ప్రారంభం నుంచే తన మార్క్ షాట్లతో చెలరేగిన శ్రీకాంత్ ఏదశలోనూ ప్రత్యర్థికి పుంజుకునే అవకాశం ఇవ్వలేదు. వరుసగా రెండు సెట్లు గెలిచి క్వార్టర్ ఫైనల్లో ప్రవేశించాడు. అయితే పురుషుల డబుల్స్‌లో భారత జోడీకి పరాజయం ఎదురైంది. మను అట్రి–సుమీత్ రెడ్డి జోడీ ప్రిక్వార్టర్ ఫైనల్లో పోరాడి ఓడింది.





కుప్పకూలిన శ్రీలంక

బ్రిస్బేన్: ఆస్ట్రేలియాతో గురువారం ప్రారంభమైన తొలి టెస్టులో శ్రీలంక మొదటి ఇన్నింగ్స్‌లో 144 పరుగులకే కుప్పకూలింది. తర్వాత తొలి ఇన్నింగ్స్ చేపట్టిన ఆతిథ్య ఆస్ట్రేలియా జట్టు ఆట ముగిసే సమయానికి రెండు వికెట్ల నష్టానికి 72 పరుగులు చేసింది. ఓపెనర్ మార్కస్ హారిస్ 40 పరుగులతో క్రీజులో ఉన్నాడు. మరో ఓపెనర్ జోయ్ బర్న్స్ (15), వన్‌డౌన్‌లో వచ్చిన ఉస్మాన్ ఖ్వాజా (11) వెనుదిరిగారు. కాగా, లంక తొలి ఇన్నింగ్స్ స్కోరును అందుకోవాలంటే ఆసీస్ మరో 72 పరుగులు చేయాలి. అంతకుముందు లంక తొలి ఇన్నింగ్స్‌లో తక్కువ స్కోరుకే ఆలౌటైంది. వికెట్ కీపర్ డిక్వెల్లా మాత్రమే ఒంటరి పోరాట చేశాడు. డిక్వెల్లా ఆరు ఫోర్లు, ఒక సిక్స్‌తో 64 పరుగులు చేశాడు. మిగతావారు ఘోరంగా విఫలమయ్యారు. ఆస్ట్రేలియా బౌలర్లలో కమిన్స్ అద్భుతంగా రాణించాడు. కమిన్స్ 39 పరుగులు మాత్రమే ఇచ్చి కీలకమైన నాలుగు వికెట్లు పడగొట్టాడు. మరోవైపు యువ సంచలనం రిచర్డ్‌సన్ కూడా మూడు వికెట్లు తీసి తనవంతు పాత్ర పోషించాడు. స్టార్ బౌలర్ మిచెల్ స్టార్క్ రెండు వికెట్లు పడగొట్టాడు.





తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయల సంస్థ (టిఎస్ఐఐసి) ఆధ్వర్యంలో ఎల్.బి. స్టేడియంలో జరుగుతున్న క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న సంస్థ చైర్మన్ బాలమల్లు, చిత్రంలో శాట్స్ చైర్మన్ అల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డి తదితరులు



యుపిలో అధికారమే టార్గెట్

• ప్రియాంక, జ్యోతిరాదిత్యకు అప్పగించిన బాధ్యత అదే
• లోక్‌సభ ఎన్నికల్లో పూర్తి బలంతో పోటీ చేస్తాం: రాహుల్



అమేథీ: ఉత్తరప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేలా చూసే బాధ్య తను తన సోదరికి ప్రియాంక గాంధీకి అప్పజెప్పినట్లు కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ చెప్పారు. అంతేకాదు రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ బలంతో పోటీ చేస్తుం దని కూడా ఆయన చెప్పారు.తన లోక్ సభ నియోజకవర్గమైన అమేథీలో రెండు రోజుల పర్యటన ముగిసిన సంద ర్భంగా గురువారం జరిగిన ఒక బహిరంగ సభలో రాహుల్‌మాట్లాడారు. ప్రియాంకను తూర్పు ఉత్తరప్రదేశ్ ఇన్‌చార్జి ప్రధాన కార్యద ర్శిగా నియమించిన సమయంలోనే రాహుల్ అమేథీ నియో జకవర్గంలో పర్యటించడం గమనార్హం. ప్రియాంకతో పాటుగా మాజీ కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియాలకు యుపిలో పార్టీ వ్యవహారాల బాధ్యతలు అప్పగించిన విషయం తెలిసిందే.' ప్రియాంక, సింధియాలకు ఒక టార్గెట్ అప్పగించడం జరిగింది. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపిని తుడిచిపెట్టి యుపిలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడమే అది' అని రాహుల్ అన్నారు.ఉత్తర శాసన సభ ఎన్నికల్లో గెలిచె సత్తా తమ పార్టీకి ఉందని ఆయన చెప్పారు.' మనం లోక్‌సభ ఎన్నికల్లో సంపూర్ణ బలంతో పోటీ చేస్తాం.అంతే కాదు, వచ్చే ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో మనమే గెలుస్తాం' అని రాహుల్ చెప్పారు. రైతు రుణాలను మాఫీ చేస్తామని తాము ఇచ్చిన హామీని నిలబెట్టు కున్నామని కూడా ఆయన చెప్పారు. ఈ సందర్భంగా నరేంద్ర మోడీ ప్రభు త్వంపై రాహుల్ మరోసారి తీవ్రంగా మండిపడ్డారు. ప్రధాని నరేంద్ర మోడీ లాగా తాను 'బిజెపి ముక్త్ భారత్'అని మాట్లాడను. గౌరవంగా మాట్లాడుతా నని దేశంలో కాం గ్రెస్ లేకుండా చేయాలని మోడీ ఇచ్చిన పిలుపును ప్రస్తావిస్తూ రాహుల్ అన్నారు. మోడీ హయాంలో పారిశ్రామిక వేత్తల రుణాలు మాత్రమే రద్దయ్యాయని ఆయన మరోసారి ఆరోపించారు. కాపలాదారే దొంగ అని రుజువైందన్నారు. కాపలాదారు దొంగ అని ప్రతివీ ధిలోను ప్రతిధ్వనిస్తోందని అన్నారు. భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం తన నియోజనవర్గంలో అభివృద్ధిని నత్తనడకగా మార్చిందని కూడా ఆయన ఆరో పించారు. అమేథీ నియోజకవర్గంలో తాను హామీ ఇచ్చిన ఫుడ్ పార్క్ నూటికి నూరుపాళ్లు వచ్చి తీరుతుందని కూడా ఆయన హామీ ఇచ్చారు. బిజెపి వాళ్లు మతం పేరుతో విద్వేషాన్ని వ్యాప్తి చేస్తున్నారని రాహుల్ ఆరోపించారు. గుజ రాత్‌నుంచిబీహార్, యుపి వాళ్లను వెళ్ల కొట్టేలా చేస్తున్నారని, హిందువులు, ముస్లింలు పరస్పరం కొట్లాడుకునేలా చేస్తున్నారని అన్నారు. నరేంద్ర మోడీ అంటే విద్వేషానికి ప్రతిరూపమని, రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో ఆయనను గద్దె దింపి తీరుతామని, దీన్ని ఎవరూ ఆపలేరని రాహుల్ అన్నారు.

రాహుల్.. ఇటలీకి వెళ్లిపో

అమేథీలో కాంగ్రెస్ అధ్యక్షుడికి రైతుల నిరసన

అమేథీ: కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీకి సొంత నియో జకవర్గంలోనే చేదు అనుభవం ఎదురైంది. అమేథీలో రెండు రోజుల పర్యటనకోసం బుధవారం వచ్చిన రాహుల్‌కు వ్యతిరేకంగా గౌరీగంజ్ ప్రాంతంలోని రైతులు ఆందోళ నకు దిగారు.' రాహుల్ ఇటలీకి వెళ్లిపో' అంటూ నినా దాలు చేశారు. రాజీవ్ గాంధీ ఫౌండేషన్ తమ భూము లను లాక్కొందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు ఉద్యోగాలు కల్పించాలని, లేదంటే తమ భూములు వాపస్ చేయాలని వారు డిమాండ్ చేశారు. 'రాహుల్ గాంధీ తీరుపై మేము అసహనంతో ఉన్నాం.ఆయన మా భూములను లాక్కొన్నారు. ఆయనకు ఇక్కడ ఉండే అర్హత లేదు. ఆయన ఇటలీకి వెళ్లిపోవాలి' అని ఆందోళనకారులు ఆగ్రహం వ్యక్తం చేశారు.1980 ప్రాంతంలో కౌసర్ ప్రాంతంలో సామ్రాట్ సైకిల్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయడం కోసం కొంతమంది పారిశ్రామికవేత్తలు రైతులనుంచి 65.57 ఎకరాల భూమిని లీజ్‌కు తీసుకున్నారు. అప్పట్లో ఈ ఫ్యాక్టరీని అమేథీ లోక్‌సభ సభ్యుడిగా ఉండిన రాజీవ్ గాంధీ ప్రారంభించారు. అయితే ఆ తర్వాత అప్పుల పాలయిన ఆ వ్యాపారవేత్తలు లీజ్ చెల్లించలేని పరిస్థితికి దిగజా రారు. కంపెనీని కూడా మూసేశారు. దీంతో ఉత్తరప్రదేశ్ పారిశ్రామికా భివృద్ధి సంస్థ 2014లో ఈ భూమిని వేలం వేసింది. వేలంలో ఈ భూమిని రాజీవ్ గాంధీ చారిటబుల్ ట్రస్ట్ కొనుగోలు చేసింది. అయితే కొంతకాలానికి ఈ వ్యవహారం కోర్టుకు చేరడంతో ఈ వేలం చెల్లదని గౌరీగంజ్ కోర్టు తీర్పు చెప్పింది. భూమిని తిరిగి యుపి పరిశ్రమల అభి వృద్ధి సంస్థకు ఇచ్చేయాని ఆదేశించింది. అయితే ఇప్పటికీ ఆ భూమి రాజీవ్ చారిటీ ట్రస్టు చేతుల్లోనే ఉంది. దీంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రియాంక నియామకంతో ఎలాంటి ప్రభావం ఉండదు: బిజెపి

న్యూఢిల్లీ: క్రియాశీలక రాజకీయాల్లోకి ప్రియాం కా గాంధీ వాద్రా రావడం లోక్‌సభ ఎన్నికల్లో తమ పార్టీపై ఎలాంటి ప్రభావం ఉండదని బిజెపి పేర్కొంది. ఉత్తరప్రదేశ్–తూర్పుకు ఆమె కాం గ్రెస్ పార్టీ ప్రధాన కార్యద ర్శిగా నియమించడంపై ఢిల్లీలో చర్చించు కోవచ్చుగాని, తమ ప్రాంత ప్రజలు ఆ విషయాన్ని పట్టించు కోవడం లేదని ఘాజీపూర్ నుంచి ప్రాతి నిధ్యం వహిస్తున్న కేంద్ర మంత్రి మనోజ్ సిన్హా పేర్కొన్నారు. ఎస్‌పి–బిఎ స్‌పి కూటమిలో చేర్చుకోక పోవడంపై నిస్సహాయ స్థితిలో ఉన్న కాంగ్రెస్‌కు రాష్ట్రంలో కొంత మేరకు ప్రాబల్యం పొందే ప్రయత్నమన్నారు. ప్రియాంక క్రియాశీల రాజకీయ ప్రవేశంపై బిజెపి భాగస్వామ్య పార్టీ శివసేన ప్రశం సించడం పట్ల అది ఆ పార్టీ సొంత అభిప్రాయమని సిన్హా పేర్కొన్నారు. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు 22 కోట్ల కుటుంబాల జీవితాలు మారా యని ఆయన నొక్కి చెప్పారు.

తమ్ముడు వరుణ్‌ను ప్రియాంక ఒప్పిస్తారా?

న్యూఢిల్లీ: క్రియాశీల రాజకీయాల్లోకి రావాలని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ తన చెల్లెలు ప్రియాంక గాంధీ వాద్రాపై ఒత్తిడి తీసుకువచ్చారా? అవుననే అంటున్నాయి పార్టీ వర్గాలు. ప్రియాంక ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావడం ఆమె తల్లి సోనియా గాంధీకి మొదట్లో ఇష్టం లేనప్పటికీ రాహుల్ నచ్చచెప్పిన తర్వాత ఆమె కూడా అంగీకరించారు. ఇదిలా ఉంటే, తూర్పు ఉత్తర్‌ప్రదేశ్‌కు పార్టీ ఇన్‌చా ర్జిగా బాధ్యతలు చేపట్టనున్న ప్రియాంక తన బాబాయ్ కుమారుడు వరుణ్ గాంధీని కాంగ్రెస్‌లోకి తీసుకువచ్చే విషయంలో కూడా చొరవ తీసుకుంటారని తెలుస్తోంది. ప్రస్తుతం బిజెపి ఎంపిగా యుపిలోని సుల్తాన్‌పూర్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న వరుణ్ గాంధీ సొంత పార్టీలో ఇమడలేకపోతున్నారని వార్తలు వస్తున్నాయి. అయితే కాంగ్రెస్ పట్ల ఏమాత్రం సానుకూలంగా లేని వరుణ్ గాంధీ తల్లి మేనకా గాంధీ మాత్రం తన కుమారుడు కాంగ్రెస్‌లోకి వెళ్లడానికి అంగీకరించకపోవచ్చు. కాని, సోదరి ప్రియాంకతో చేతులు కలపాలని వరుణ్ నిర్ణయించుకున్న పక్షంలో ఉత్తర్ ప్రదేశ్‌లో కాంగ్రెస్ విజయావకాశాలు మరింత మెరుగు పడతాయని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.

ఫ్రెండును చంపి.. 200 ముక్కలు చేసి..



లేటు వయసులో పెళ్లిపై జోకులేసినందుకు ఘాతుకం

ముంబయి: ముంబయిలో ఒక వ్యక్తి తన స్నేహితుడిని చంపి, అతడి శవాన్ని దాదాపు 200 ముక్కలుగా నరికి, వాటిని టాయ్‌లెట్‌లో పడేసి వది లించుకున్నాడు. మాంసం ముద్దలు, ఎముకలు డ్రైనేజ్‌లో అడ్డంపడడంతో ఈ భయంకరమైన సంఘటన వెలుగులోకి వచ్చింది. నిందితుడిని ముంబ యిలోని శాంటాక్రూజ్‌కు చెందిన పింటూ శర్మ(42)గా పోలీసులు గుర్తించి అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం...ముంబయి శివార్లలోని వీరా ర్‌లో నివసించే గణేశ్ కోల్హాడ్కర్(58), పింటూ శర్మ స్నేహితులు. కోల్హాడ్క ర్‌కు పెళ్లి కుదరడంతో శర్మ వద్ద నుంచి రూ.1లక్ష అప్పు తీసుకున్నాడు. అందులో రూ.40,000 చెల్లించేశాడు. గత ఏడాది డిసెంబర్ 16న వీరార్ లోని కోల్హాడ్కర్ ఇంట్లో వీరిద్దరూ కలుసుకున్నారు. మాటల సందర్భంలో చాలా లేటు వయసులో పెళ్లి చేసుకుంటున్న కోల్హాడ్కర్‌పై శర్మ జోకులు పేలుస్తూ పెళ్లయిన తర్వాత నీ భార్య పరాయి పురుషుడితో సంబంధం పెట్టుకునే అవకాశం ఉందంటూ శర్మ నోరు జారాడు. దీంతో ఇద్దరి మధ్య మాటల యుద్ధం మొదలైంది. కోపంతో శర్మ తోసేయడంతో గోడకు తల కొట్టుకుని కోల్హాడ్కర్ అక్కడే చనిపోయాడు. ఏమీ జరగనట్టు బయటకు వెళ్లి పోయిన శర్మ ఒక రంపంతో మళ్లీ ఆ ఇంట్లోకి వచ్చాడు. కోల్హాడ్కర్ శవాన్ని నాలుగు రోజుల పాటు దాదాపు 200 ముక్కలుగా కోశాడు. ఆ ముక్కలను టాయ్‌లెట్‌లో పడేసి నీళ్లతో ఫ్లష్ చేశాడు. పెద్ద సైజు ఎముకలను తన వెంట తీసుకెళ్లి శాంటాక్రూజ్‌కు వెళ్లే దారిలో లోకల్ రైలులో నుంచి బయటకు విసి రేశాడు. అయితే, శర్మ టాయ్‌లెట్‌లో పడేసిన మాంసం, ఎముకలు ఆ భవనం డ్రైనేజ్ వ్యవస్థకు అడ్డుపడ్డాయి. భవనంలో నివసించే ఇతరులు పారి శుధ్య కార్మికులను పిలువగా అసలు విషయం బయటపడింది. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు రంగ ప్రవేశం చేసి దర్యాప్తు చేప ట్టారు. తమ జీవితంలో ఇంత క్రూరమైన నేరాన్ని చూడలేదని పోలీసులు చెబుతున్నారు.



కుప్పకూలిన నాలుగంతస్థుల భవనం

ఆరుగురు కార్మికుల మృతి, శిథిలాల కింద నలుగురు
సహాయక చర్యలో పాల్గొన్న ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలు

గుర్‌గావ్ : నిర్మాణంలో ఉన్న నాలుగంతస్థుల భవనం కుప్పకూల డంతో ఆరుగురు కార్మికులు మృతిచెందారు. మరో నలుగురు భవన శిథి లాల కింద చిక్కుకున్నారు. ఈ దుర్ఘటన గుర్‌గావ్ సమీపంలోని ఉల్వాస్ గ్రామంలో గురువారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. స్థానికుడు ఇచ్చిన సమాచారం మేరకు జాతీయ విపత్తుల సహాయక బృందం (ఎన్ డిఆర్‌ఎఫ్), స్థానిక పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని, శిథిలాల పడ్డ ఆరుగురు కార్మికుల మృతదేహాలను బయటకు తీశారు. మూడు ఎన్‌డి ఆర్‌ఎఫ్ బృందాలు, స్థానిక పోలీసులు, అగ్నిమాపక నియంత్రణ శాఖ వారు సహాయక చర్యల్లో పాల్గొన్నాయి. భవన శిథిలాల కింద ఇంకా ఒకరు లేదా ఇద్దరు కార్మికులు ఉండవచ్చని ఎన్‌డిఆర్‌ఎఫ్ అధికార ప్రతి నిధి అనుమానం వ్యక్తం చేశారు. భవన శిథిలాల పూర్తిగా కూరుకుపో వడంతో చిక్కుకున్న వారిని బయటకు తీసేందుకు సహాయక బృందా లకు కష్టతరంగా మారిందని అగ్నిమాపక అధికారి ఇషామ్ సింగ్ తెలి పారు. భవనం కూలే సమయంలో కార్మికులు నాలుగంతస్థులో పనిచే స్తున్నారని అధికారులు తెలిపారు.

వీడని సిబిఐ చిక్కుముడి

• చీఫ్ ఎంపికపై కమిటీలో కుదరని ఏకాభిప్రాయం
• తిరిగి వచ్చే వారం భేటీ



న్యూఢిల్లీ : కేంద్ర దర్యాప్తు సంస్థ సిబిఐ తదుపరి డైరెక్టర్ ఎవరనేది ప్రశ్నార్థకంగానే మిగిలింది. ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వం లోని సిబిఐ అధినేత ఎంపిక కమిటీ గురువారం సమావేశం అ యింది. అయితే ఈ దఫా భేటీలో తదుపరి అధినేత ఎవరనే అంశంపై చర్చలు అసంపూర్తిగా నిలిచిపోయ్యాయి. దీనితో ఈ అత్యున్నత స్థాయి కమిటీ వచ్చే వారం తిరిగి సమావేశం అవుతుం దని ఉన్నతాధికారులు తెలిపారు. ఈ కీలక దర్యాప్తు సంస్థలో అంత ర్గత తగాదాలు, కేసులు చివరికి డైరెక్టర్ అలోక్ వర్మకు పదవి నుంచి వైదొలిగే పరిస్థితి ఏర్పడింది. ఇప్పుడు సిబిఐ తాత్కాలిక డైరె క్టర్ హయాంలోనే సాగుతోంది. కొత్త డైరెక్టర్ ఎంపికకు కేంద్రం కస రత్తు చేపట్టింది. ఎంపిక కమిటీలో ప్రధానితో పాటు దేశ ప్రధాన న్యాయమూర్తి, లోక్‌సభలో ప్రతిపక్ష నేత సభ్యులుగా ఉండటం ఆన వాయితీగా వస్తోంది. అయితే గురువారం నాటి కమిటీ భేటీలో డైరె క్టర్ ఎంపికపై విభేధాలు చోటుచేసుకున్నట్లు వెల్లడైంది. ఎంపిక కమిటీ తదుపరి సమావేశం తేదీలను త్వరలోనే ఖరారు చేస్తారు. వచ్చే వారం ఏదో ఒక రోజున కమిటీ సమావేశం అవుతుందని అధి కార వర్గాలు తెలిపాయి. గురువారం నాటి భేటీకి ప్రధాని మోడీ, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయ్, ప్రతిపక్ష నేత మల్లిఖార్జున ఖర్గే హాజరయ్యారు.బాధ్యతల నిర్వహణలో నిర్లక్ష్యం, అవినీతి అభియోగాలతో అలోక్‌వర్మకు ఉద్వాసన పలికారు. ప్రధా ని నాయకత్వంలోని ఉన్నత స్థాయి కమిటీ నిర్ణయం మేరకు అలోక్ వర్మను పదవి నుంచి తప్పించారు. ఆయన స్థానంలో సంస్థ తాత్కా లిక నిర్వహణ బాధ్యతలను తరువాతి కేడర్‌లో ఉన్న ఎం నాగేశ్వర రావుకు అప్పగించారు. అయితే ఆయన నియామకాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో కేసు దాఖలు అయింది. సిబిఐ డైరెక్టర్ ఎంపిక ప్రక్రియను దాచి ఉంచాల్సిన పనిలేదని, ఎప్పటికప్పుడు ఎంపిక కమిటీ సమావేశ వివరాలను, సిబిఐ డైరెక్టర్ ఎంపిక ఏ స్థాయికి వచ్చిందనే అంశాలను తెలియచేయాలని ఇటీవలే సుప్రీం కోర్టు కేంద్రానికి సూచించింది. ఎంపిక కమిటీ సమావేశ సమగ్ర వివరాలను ప్రజలకు తెలియచేయాల్సి ఉందని పేర్కొన్నారు.

మొన్న సిజె ఇప్పుడు జస్టిస్ సిక్రీ

కేసు విచారణ నుంచి వెనుకకు



న్యూఢిల్లీ : సిబిఐ తాత్కాలిక డైరెక్టర్ నియామకంపై కేసు విచారణ ప్రక్రియ నుంచి సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఎకె సిక్రీ వైదొలిగారు. సిబిఐ డైరెక్టర్‌గా తాత్కాలిక బాధ్యతలను ఎం.నాగేశ్వరరావుకు కేంద్రం అప్పగించడాన్ని సవా లు చేస్తూ పిటిషన్ దాఖలు అయింది. అయితే ఈ కేసు విచా రణ ప్రక్రియ నుంచి ఇప్పటికే ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగొయ్ వైదొలిగారు. ఈ తరువాతి క్రమంలో కేసు విచారణ సంబంధిత ధర్మాసనం నుంచి తాను రెక్యూస్ అవుతున్నట్లు గురువారం జస్టిస్ సిక్రీ తెలిపారు. సిబిఐ డైరెక్టర్ అలోక్ వర్మను పదవి నుంచి తొలిగించిన కమిటీలో తాను సభ్యుడిగా ఉన్నందున , ఈ ప్రస్తుత విచారణలో తాను ఉండటం తగదని భావిస్తున్నట్లు జస్టిస్ సిక్రీ తెలియచేసుకున్నారు. తన పరిస్థితిని అర్థం చేసుకోవాలని, తాను కేసు విచారణ ప్రక్రియ నుంచి వైదొలిగేందుకు అనుమించాల్సి ఉంటుందని జస్టిస్ సిక్రీ న్యాయవాది దుష్యంత్‌దావేకు తెలియచేశారు. కామన్ కాజ్ స్వ చ్ఛంద సంస్థ సిబిఐకి తాత్కాలిక డైరెక్టర్ నియామక ప్రక్రియను సవాలు చేసింది. ఈ సంస్థ తరపున న్యాయవాది దుష్యంత్ వాదిస్తున్నారు. ఈ కేసు విచారణ నుంచి న్యాయమూర్తులు వైదొలుగుతూ రావడం పట్ల న్యాయవాది అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇంతకు ముందు చీఫ్ జస్టిస్ కూడా కేసు విచారణ నుంచి తప్పించుకున్నారని, ఇప్పుడు మరో న్యాయమూర్తి ఇదే బాటలో వెళ్లుతున్నారని , కేసు విచారణ దశలో ఈ విధంగా స్పందించడం ఏమిటని ప్రశ్నిం చారు. దీనిపై జస్టిస్ సిక్రీ స్పందిస్తూ తాను విచారణకు దూరం అవుతున్నట్లు, అంతకు మిం చి మాట్లాడదల్చుకోనట్లు స్పష్టం చేశారు. అయితే న్యాయమూర్తులు ఇటువంటి నిర్ణయా లను ముందుగానే తెలియచేయాల్సి ఉంటుందని,విచారణ ఆరంభం దశలో కొద్ది నిమిషాల ముందు దీనిని ప్రకటించడం ఎంతవరకు సబబు అని న్యాయవాది ఆవేదన వ్యక్తం చేశారు.

సైనికుడిగా మారిన ఉగ్రవాదికి అశోక్‌చక్ర

వీరమరణం పొందిన లాన్స్‌నాయక్ నజీర్ ఆహ్మద్‌కు పురస్కారం



న్యూఢిల్లీ: కశ్మీరీ లోయలో ఆరుగురు ఉగ్రవాదు లను హతమార్చి అమరుడైన సైనికుడు లాన్స్ నాయక్ నజీర్ ఆహ్మద్ వనీకి కేంద్ర ప్రభుత్వం అత్యున్నత సైనిక పురస్కారం అశోక చక్రను మరణానంతరం ప్రకటించింది. ఉగ్రవాదిగా ఉండి సైనికుడిగా మారిన నజీర్ వనీకి గతంలో రెండుసార్లు సైనిక పతకాలు లభించాయి. కుల్గామ్‌లోని చెకి అష్మజి గ్రామానికి చెందిన వనీకి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. దేశంలో ఉన్నతమైన సైనిక పురస్కారాలలో అశోక చక్ర అత్యున్నతమైనది. ఆ తర్వాతి స్థానాలలో కీర్తి చక్ర, శౌర్య చక్ర ఉంటాయి. దక్షిణ కశ్మీర్‌లోని కుల్గాం జిల్లాకు చెందిన నజీర్ అహ్మద్ వనీ 1990లలో ఉగ్రకార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొన్నాడు. ఆ తర్వాత తన తప్పు తెలుసుకుని పూర్తిగా మారిపోయాడు. పోలీసుల ముందు లొంగిపోయాడు. 2004లో టెరిటోరియల్ ఆర్మీ బెటాలియన్‌లో చేరారు. అప్పటి నుంచి సైన్యానికి ఎంతగానో సేవ చేశారు. 2007, 2018లో సేనా పతకాన్ని అందుకున్నారు. గతేడాది నవంబరులో షోపి యాన్ వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఉగ్రవాదులతో పోరాడాడు. ఆ ఎన్ కౌంటర్‌లో తీవ్రంగా గాయపడిన వనీని ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన ప్రాణాలు కోల్పోయాడు.

'రాహుల్‌ను ప్రధానిగా చూడాలనివుంది'



బెంగళూరు: వచ్చే లోక్‌సభ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీని ప్రధాన మంత్రి పదవిలో తాను చూడాలని కోరుకుంటు న్నట్లు కర్నాటక ముఖ్యమంత్రి హెచ్‌డి కుమార స్వామి వెల్లడించారు. ఇటీవల పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కోల్‌కతాలో నిర్వ హించిన ప్రతిపక్షాల ర్యాలీలో పాల్గొన్న కుమార స్వామి దీదీని ప్రధాని పదవికి సమర్థురాలైన నాయకురాలిగా అభివర్ణిం చిన విషయం తెలిసింది. వారం రోజులు తిరగకముందే కుమారస్వామి మాట మార్చుకోవడం విశేషం. ఒక ఇంగ్లీష్ చానల్‌కు ఇచ్చిన ఇంట ర్వ్యూలో ఆయన తమ పార్టీ జనతాదళ్(ఎస్) ప్రధాని పదవిని రాహుల్ అధిష్టించేందుకు కృషి చేస్తుందని చెప్పారు. ప్రధాని అభ్యర్థిగా రాహుల్ గాంధీకి మద్దతివ్వాలన్నది తమ పార్టీ నిర్ణయమని, దీన్ని తన తండ్రి, మాజీ ప్రధాని దేవెగౌడ బలపరుస్తున్నారని ఆయన చెప్పారు. కోల్‌క తాలో తాను అన్న మాటలను తప్పుగా అర్థం చేసుకున్నారని ఆయన చెప్పుకొచ్చారు.

'మోడీజీ.. ఇది దేశద్రోహం కాదా?'



న్యూఢిల్లీ: జవహర్‌లాల్ యూనివర్సిటీ విద్యార్థి సంఘం(జెఎన్‌యుఎస్‌యు) మాజీ అధ్యక్షుడు కన్హయ కుమార్ దేశద్రోహానికి పాల్పడ్డాడో లేదో తనకు తెలియదు కాని ప్రధాని నరేంద్ర మోడీ మాత్రం ఢిల్లీ ప్రభుత్వానికి చెందిన కార్యక్రమా లకు అవాంతరాలు సృష్టిస్తూ "దేశద్రోహానికి" పాల్పడుతున్నారని ఢిల్లీ ముఖ్యమంత్రి అర వింద్ కేజ్రీవాల్ ఆరోపించారు. కన్హయ కుమార్‌పై నమోదైన దేశద్రోహ ఆరోపణలపై విచారణ జరపడానికి అనుమతి మంజూరు చేసే విష యమై ఢిల్లీ ప్రభుత్వానికి చెందిన న్యాయ శాఖ పరిశీలిస్తోందని కేజ్రీ వాల్ గురువారం తెలిపారు. అయితే, కన్హయ కుమార్ దేశద్రోహానికి పాల్పడ్డాడో లేదో తనకు తెలియదని అంటూ "ఢిల్లీలో పిల్లల స్కూళ్ల(ని ర్మాణాలు), ఆస్పత్రులు, సిసిటివి కెమెరాల ఏర్పాటు, బస్తీ వైద్యశాలల ఏర్పాటు వంటి పనులను మోడీజీ నిలిపివేశారు.. ఇది దేశద్రోహం కాదా" అని కేజ్రీవాల్ హిందీలో రాసిన ఒక ట్వీట్‌లో ప్రశ్నించారు.

అమెరికా బ్యాంకులో ఐదుగురి కాల్చివేత

మియామి: అమెరికాలోని ఫ్లోరిడాలో కాల్పుల కలకలం చెలరేగింది. గురువారం సెబ్రింగ్ నగరంలోని బ్యాంక్‌లో దుండగుడు ఐదుగురిని తుపాకీతో కాల్చి చంపినట్లు పోలీస్ చీఫ్ కార్ల్ హోగ్లూండ్ విలేకరులకు తెలిపారు. స్థానికుడైన 21 ఏళ్ల హంతకుడిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించిదర్యాప్తు ప్రారంభించినట్లు హోగ్లూండ్ తెలిపారు. అమెరికాలో 2017లో తరుచుగా జరిగిన హింస, కాల్పుల్లో దాదాపు 40 వేల మంది హత్యకు గురైనట్లు సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రెవెన్షన్ పేర్కొంది

కుంభమేళాలో మారిషస్ ప్రధాని

అలహాబాద్ : మారిషస్ ప్రధాని ప్రవింద్ జుగన్నాథ్ గురువారం కుంభ మేళను సందర్శించారు. గంగా నదిలో పవిత్ర స్నానాలు ఆచరించారు. భార్య కోబితా, పాతిక మందితో కూడిన మారిషస్ అధికార బృందంతో కలిసి ప్రవింద్ ప్రయాగ్‌రాజ్‌లోని త్రివేణి సంగమ స్థలికి వచ్చారు. తొలుత అక్కడి బడే హనుమాన్ దేవాలయాన్ని, కుంభమేళ సందర్భంగా ఏర్పాటు అయిన సరికొత్త సమీకృత కంట్రోల్ సెంటర్‌ను సందర్శిం చారు. మారిషస్ ప్రధాని ఇతరులు సంగమంలో పవిత్ర స్నానాలు ఆచ రించారు. ఆ తరువాత విలేకరులతో మాట్లాడిన ప్రవింద్ మారిషస్, భారత్‌ల మధ్య చిరకాల సంబంధాలు మరింత వృద్ధి కావాలని ఆశిస్తు న్నట్లు తెలిపారు. స్థానిక కుంభమేళా ఘాట్ వద్ద మారిషస్ ప్రధాని భార్యతో కలిసి దీపాలు వెలిగించారు..

గోవా మాజీ గవర్నర్ భానుప్రకాశ్‌సింగ్ కన్నుమూత

చెన్నై: సుదీర్ఘకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ కేంద్ర మాజీ మంత్రి, మాజీ గోవా గవర్నర్, నర్సింగ్‌ఘర్ రాజ్యవంశీయుడు భాను ప్రకాశ్ సింగ్ గురువారం ఇండోర్‌లో కన్నుమూశారు. ఆయన వయసు 90 సంవత్సరాలు. శ్వాసకోశ సంబంధిత సమస్యతో బాధపడుతుండగా చికిత్స కోసం ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించామని ఆయన కుమా రుడు బిజెపి ఎంఎల్‌ఎ రాజ్యవర్ధన్ సింగ్ తెలిపారు. భాను ప్రకాశ్‌కు ఐదురుగు కుమారులు. భార్య ఐదేళ్ల క్రితమే చనిపోయింది. 1962లో భాను ప్రకాశ్‌సింగ్ రాజ్‌ఘర్ లోక్‌సభ స్థానం నుంచి స్వతంత్ర అభ్య ర్థిగా గెలుపొందాడు. తర్వాత, 1964లో ఇందిరాగాంధీ ప్రధానిగా ఉన్నప్పుడు కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ విధించిన రాజభరణాల రద్దును నిరసిస్తూ సింగ్ ఆ పార్టీకి రాజీనామా చేశారు.

Printed and Published by **Tumu Mohan Rao** on behalf of Moveon Media Private Limited, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037 Medchel-Malkajgiri District, TELANGANA and Published from H.No.1-1-60/7A, 4th floor Beacon towers, street no.13, Jawaharnagar, near RTC X Roads Hyderabad-500020 Telangana state, Editor : **Anjaiah Polisetty**, RNI No. TELTEL/2012/42234. Email Id. editor@manatelangana.org. Phone No.040-27655666